



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-3-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 35 పేజీలు: 10+4 వెల: 6.50







# కామ్రేడ్ ఇప్పుడు ఇవ్వలేం.. మరోసారి మీకే అవకాశం!

## ఎమ్మెల్సీ సీటుపై స్పష్టం చేసిన రాష్ట్ర కాంగ్రెస్

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** 'సారీ కామ్రేడ్ ఇప్పుడు ఇవ్వలేం మరో పర్యాయం మీకే అవకాశం ఇస్తాం' అంటూ సిపిఐని కాంగ్రెస్ పార్టీ బుజ్జగిస్తున్నట్లు తెలిసింది. వచ్చే ఎమ్మెల్సీ ఖాళీల భర్తీలో మీకు అవకాశం కల్పిస్తామని కాంగ్రెస్ సిపిఐకి స్పష్టం చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు గాంధీభవన్‌లో చర్చించు కొంటు న్నాయి. తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ వెలువడగానే సిపిఐ నాయకులు గాంధీభవన్‌కు వెళ్ళి టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలిసి డిమాండ్ చేయడంతో మిత్రపక్షాలకు సీట్ల పందేరం ఎలా ఉంటుందనే ఉత్కంఠతకు తెరలేచింది. కాంగ్రెస్‌పార్టీ అదిష్ఠానం ఓవైపు సీట్ల కసరత్తు వేగం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,టిపిసిసి కూడా అభ్యర్థుల జాబితాను తయారించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పార్టీ పెద్దల ముందు ఔత్సాహికుల జాబితాను,తాను రూపొందించిన లఘు జాబితాను పెట్టి వాటిపై చర్చించే అవకాశం ఉంది. మిత్రపక్షాలు సిపిఐ తమకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తోందని అయితే సిపిఐకి ఈ దఫా మొండిచెయ్యి చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గవర్నర్ కోటాలోనే మాకు అవకాశం కల్పించలేదని పొత్త ధర్మంలో భాగంగా తమకు రెండు ఎమ్మెల్సీలు ఇవ్వాలని సిపిఐ నేతల సిఎం రేవంత్‌రెడ్డి,టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌ను వేర్వేరుగా కలిసి విన్నవించారు. ప్రస్తుతానికి ఒకటి మాత్రం ఇవ్వాలని సిఐపి రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రేవంత్‌ను, మహేష్ కుమార్‌లను కోరారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులు వివిధ సమీకరణాల నేపథ్యంలో వచ్చే దఫా అవకాశం ఇచ్చేందుకు హస్తంపార్టీ కామ్రెడ్‌లను బుజ్జగించి ఒప్పించే పనిని పెట్టుకొంది. హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాకు సంబంధించిన ఎమ్మెల్సీ స్థానంకు ఆగస్టులో ఎన్నికలు జరగబోతున్నాయని లేదా వచ్చే ఏడాది గవర్నర్ కోటాలో మరో రెండు ఎమ్మెల్సీ ఖాళీలు కాబోతున్నాయని వాటిని మీకు ఇస్తామని సిపిఐ నేతలకు ఆఫర్ తాజాగా ఇస్తున్నారు. నామినేషన్ల గడువు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ నేతలు తీవ్రంగా పోటీ పడుతున్నారు. విజయశాంతి, జగ్గారెడ్డి వంటి నేతలు ఢిల్లీకి వెళి పార్టీ కోసం తాము పడిన కష్టాలను తెలుపుతున్నారు. అభ్యర్థులు ఎక్కువ మంది ఉండటంతో అదిష్ఠాం కూడా ఆచి తూచి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిప్యూటి సిఎం విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డ కూడా ఢిల్లీలో పార్టీ పెద్దలతో చర్చించి అభ్యర్థుల జాబితాను శనివారంలోగా విడుదలచేసే అవకాశం ఉందని గాంధీభవన్‌వర్గాలు చర్చించుకొంటున్నాయి.



# గుజరాత్‌లో మోడీ రెండురోజుల పర్యటన

## ప్రధాని బందోబస్తులో అందరూ మహిళలే!

**అహ్మదాబాద్, మార్చి 7:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధానినరేంద్రమోడీ తన స్వరాష్ట్రం గుజరాత్‌లో పర్యటించనున్నారు. 8వ తేదీ గుజరాత్‌లోని నవ్‌సారి జిల్లాలోని వన్సీ బోర్సి గ్రామంలో ఏర్పాటుచేసిన లఖ్‌పతి దీదీ సమ్మేళన్‌లో పాల్గొని వారితో ముఖాముఖి నిర్వహిస్తారు. అంతేకాకుండా మహిళా దినత్సోవం రోజున మోడీ పాల్గొంటున్న ఈ సమ్మేళనానికి ఒక ప్రత్యేకత ఉంది. ఈ మోడీ కార్యక్రమం ఆసాంతం కేవలం మహిళా పోలీసులు, మహిళా పోలీస్ ఉన్నతాధికారులే పర్యవేక్షిస్తున్నారు. దేశంలోనే ఇలాంటి కార్యాచరణ మొట్టమొదటిసారిగా నవ్‌సారిజిల్లాలో మోడీ పర్యటనకు అమలుచేయడం విశేషం. ప్రధాని మోడీ వన్సి బోర్సి గ్రామంలో హెలిపాడ్‌లో దిగినప్పటినుంచి వేదికవరకూ కూడా ఆకార్యక్రమం పూర్తయ్యే వరకూ మొత్తం మహిళా పోలీసులు, మహిళా అధికారులే బందోబస్తు పర్యవేఓణచేస్తారని హోంమంత్రి హర్ష్‌సంఘవి తెలిపారు. వీరిలో ఐపి ఎస్ అధికారులనుంచి కానిస్టేబుళ్లవరకూ అందరూ మహిళలే పాల్గొంటారు. గుజరాత్‌లో 8,9తేదీల్లో పర్యటించనున్న ప్రధానిమోడీ మహిళా సమ్మేళన్‌తోపాటు దాద్రా నగర్ హవేలి కేంద్రపాలితప్రాంతంలో కూడా పర్యటిస్తారు. గుజరాత్‌పోలీస్‌శాఖ ఈ కార్యక్రమంకోసం 2100 మంది కానిస్టేబుళ్లు, 187 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 61 మంది పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, 16 మంది డిప్యూటి పోలీస్ సూపరింటెండెంగ్‌లు, ఐదుగురు ఎస్పీలు, ఒక ఐజిపితోపాటు అదనపు డిజి ర్యాంకు అధికారి కూడా మొత్తం బందోబస్తును పర్యవేక్షిస్తారు. సీనియర్ మహిళా ఐపిఎస్ అధికారి హోంశాఖ కార్యదర్శి నిపుణా తోరావానే మొత్తం ఈసెక్యూరిటీని పర్యవేక్షిస్తారని హోంమంత్రి తెలిపారు. ఈ కార్యాచరణతో మహిళలు అన్నిరంగాల్లోను కూడా శక్తివంతు లేనని నిరూపించేందుకు దోహదంచేస్తుందని, గుజరాత్ ఎంతో సురక్షితమైన భద్రతాపూర్వక రాష్ట్రమని ప్రపంచానికి తెలియజేసినట్లువుతుందని హోంమంత్రి చెప్పారు.

# నా భర్తపై తప్పుడు ప్రచారం చేయకండి!

## విడియో విడుదల చేసిన గాయని కల్పన

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** అధిక మోతాదులో నిద్రమాత్రలు వేసుకొని అపస్మారకస్థితిలోకి వెళ్లిన గాయని కల్పన ప్రస్తుతం కోలుకుంటున్నారు. తన భర్తపై మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని దాన్ని వెంటనే ఆపేయాలని విజ్ఞప్తి చేస్తూ ఆమె తాజాగా ఓ విడియోను విడుదల చేశారు. పని ఒత్తిడి కారణంగా నిద్రపట్టలేదని అందువల్ల ట్యాబ్లెట్లు ఎక్కువ డోస్‌లో తీసుకున్న కారణంగా తనకు ఇలా అయిందని తెలిపారు. తన భర్తతో ఎలాంటి మనస్పర్థలు లేవని విడియోలో స్పష్టం చేశారు. వాళ్ల కుటుంబం అంతా సంతోషంగా ఉంటున్నట్లు తెలిపారు. వృత్తిపరంగా ఒత్తిడి ఎక్కువైందని నిద్ర పట్టకపోవడం వల్ల నిద్రకోసం చికిత్సలో వైద్యుడు సూచించిన ప్రిస్క్రిప్షన్‌లో మందులు ఎక్కువ మోతాదులో తీసుకున్నట్లు వివరిచారు. ట్యాబ్లెట్స్ ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల స్పృహ తప్పిపడిపోయినట్లు పేర్కొన్నారు. 'మీడియాలో మా కుటుంబంపై తప్పుడు ప్రచారం జరుగుతోంది. దాని గురించి నేను అందరికి వివరణ ఇవ్వాలనుకుంటున్నాను. నేను నా భర్త, కుమార్తె చాలా సంతోషంగా ఉంటున్నాం. నాకు ఇప్పుడు 45 సంవత్సరాలు, ఇప్పుడు నేను పిహెచ్‌డి, ఎల్ఎల్‌బి చేస్తున్నాను. నా భర్త సహకారం వల్లే నేను ఇవన్నీ చేయగలుగుతున్నాను. ఆయనతో నాకు ఎలాంటి మనస్పర్థలు లేవు. వృత్తిపరమైన ఒత్తిడి కారణంగా నిద్రపట్టడం లేదు. అందుకు నేను చికిత్స తీసుకుంటున్నాను. డాక్టర్స్ ఇచ్చిన ప్రిస్క్రిప్షన్‌లో ట్యాబ్లెట్లు ఓవర్ డోస్ తీసుకున్నాను. అందువల్లే నేను స్పృహతప్పి పడిపోయాను. నా భర్త సరైన సమయంలో స్పందించడం, కాలనీవాసుల, పోలీసుల సహాయం వల్లే ఇప్పుడు నేను మీ ముందు ఉన్నాను. త్వరలో నా పాటలతో మిమ్మల్ని అలరిస్తాను. నా భర్త సహకారం వల్లే నాకు నచ్చిన రంగాల్లో రాణిస్తున్నాను. నా జీవితానికి ఆయన బెస్ట్‌గిఫ్ట్. నా ఆరోగ్యం గురించి వాకాబు చేసిన వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు' అంటూ విడియో విడుదల చేశారు.

# ఇరాన్‌తో అణు ఒప్పందానికి ఖొమైనీకి ట్రంప్ లేఖ!

**వాషింగ్టన్, మార్చి 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఇరాన్‌తో అణు ఒప్పందంపై చర్చలుజరపాలనుకుంటున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా ఆయన ఇరాన్‌కు లేఖరాసారు. మీరు మాతోచర్చలకు సన్నద్ధం అవుతారని ఆశిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. శుక్రవారం ఒక బిజినెస్ నెట్‌వర్క్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్‌మాట్లాడుతూ ఇరాన్‌తో అణు ఒప్పందంచేసుకనేందుకు మేం సిద్ధంగా ఉన్నామని ఆదిశగా ఇరాన్ చర్చలు



జరపాలని కోరుకుంటున్నానని, ఈఒప్పందం సఫలం అయితే ఆదేశానికే మంచిదని అన్నారు. ఇక తాను రాస్తున్న లేఖకు ఇరాన్ నుంచి సమాధానం వస్తుందనే ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రతిఫలంగా ఆదేశానికి అమెరికా ఏదో ఒక మేలుచేస్తుందని,ఎందుకంటే మరే ఇతర దేశంతోను అణుఒప్పందం చేసుకోవడం సాధ్యంకాకపోవచ్చని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఇక ట్రంప్‌రాసిన ఆలేఖ ఇరాన్‌సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమైనీ ఇంటి అడ్రస్‌కు పంపించినట్లు తెలుస్తోంది. అయితే ఆలేఖపై వైట్‌హౌస్ అధికారికంగా స్పందించాల్సి ఉంది. మరోవైపు అంతర్జాతీయ స్థాయిలో అణ్వాయుధాల ఒప్పందాలపై ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇదే అంశాన్ని ఇరాన్ రాయబారి కాసిం జలాలితో చర్చించినట్లు శుక్రవారం రష్యా విదేశాంగమంత్రిత్వ శాఖ ప్రకటించడం గమనార్హం. ట్రంప్ తన లేఖలో ఇరాన్ ముందు రెండు మార్గాలున్నాయని, సైన్యం లేదా ఒప్పందం చేసుకోవడం. ఒప్పందానికే నేను ప్రాధాన్యం ఇస్తానని, ఎందుకంటే ఇరాన్‌ను దెబ్బతీయాలనుకోవడంలేదని చర్చలుజరుపుతారని ఆశిస్తున్నానని ఇరాన్‌కు అది చాలాప్రయోజనకరమన్నారు. ఇరాన్ మరో సారి అణ్వాయుధాలను అభివృద్ధిచేసుకోవడాన్ని నిలువరించే చర్యల్లోభాగంగానే ట్రంప్ ఈ లేఖరాసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో గతంలో అణు ఒప్పందంచేసుకున్న అమెరికా 2018లో ట్రంప్ హయాంలోనే వైదొలిగింది.

# ఎమ్మెల్సీ ఫలితాలపై ఉత్తమ్ అత్యవసర సమావేశం

## హాజరైన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు



**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** ఉత్తర తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నిక లలో కాంగ్రెస్‌పార్టీకి ఎదురు దెబ్బతగలగానే కాంగ్రెస్ హైకామాండ్ ఒక్కసారిగా ఉలిక్కిపడటంతో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కూడా ఎక్కడ లోపం జరిగిం దని సమీక్షలు చేసుకొంటున్నారు. కరీంనగర్ జిల్లా ఇంచార్జీగా వ్యవహరిస్తున్న నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా ముఖ్య నేతలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఓటమికి గల కారణాలు పార్టీ పరిస్థితి ప్రభుత్వపథకాలపై ప్రజల ప్రతిస్పందన వంటి అంశాలపై సుదీర్ఘంగా సమీక్ష చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఎలా విజయం సాధించాలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ తో వివరిస్తూ ఎమ్మెల్యేల అభిప్రాయం కూడా సేకరించారు. బిజెపి,బిఆర్ఎస్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా మెజార్టీ స్థానాలు గెలుచుకోవాలని ఆదేశించారు. పార్టీ అంతర్గత విషయాలు బయట ప్రస్తా వించకుండా అధి ష్ఠానం దృష్టికి మీ ఇబ్బందులు తీసుకొని రావాలని ఆయన సూచించారు. ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, జీవన్‌రెడ్డి హాజరయ్యారు. తెలంగాణలో రెండు ఉపాధ్యాయ ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగగా అందులో రెండు బిజెపి ఒకటి స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు కాంగ్రెస్‌కు భారీగా దెబ్బ తగిలింది. 15 జిల్లాలు 42 నియోజకవర్గాల పరిధిలో జరిగిన మెదక్, కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్ని కలలో బిజెపి గెలుపొండం అది ఇతర ప్రాంతాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఇటీవల కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో12లక్షలకు ఐటి స్టాండర్డ్ డిడక్షన్ ప్రమాణికంగా నిర్ధారించడం ఉద్యోగులకు సంతోషం కలిగించింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం ఐదువిడుతలుగా డిఎ ఇవ్వా ల్సిందిప్రకటించపోవడం,నిత్యం ఎసిబి దాడులతో ఉద్యోగసంఘాల నేతలే లక్ష్యంగా ఉద్యోగులను భయకంపితులు చేయడంతో బిజెపికి దన్నుగా ఉద్యోగులు నిలవడం మొదలు పెట్టారు. ఇప్పటికే కొన్ని ఉద్యోగ సంఘాలు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మాల సీతారామన్‌తో కూడా టచ్‌లో ఉన్నారని ప్రచారం జరుగుతోన్నది. ఉద్యోగ ఉపాధ్యాయులు దూరం కావడం అనే అంశాన్ని తెలంగాణ ఏఐసిసి ఇన్‌చార్జ్ మీనాక్షి దృష్టికి తీసుకెళ్ళాలని ఉత్తతెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ సింపథైజర్ ఉద్యోగులు స్థానిక నాయత్వం వద్ద గోడును వెల్లబోసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి జిల్లా నేతలతో అత్యవసర సమావేశం నిర్వహించారు.

# క్రిప్టోకరెన్సీ చీటింగ్ కేసులో మరో నిందితుడి అరెస్టు

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** జనగాం కేంద్రంగా వెలుగుచూసిన క్రిప్టో కరెన్సీ గోల్‌మాల్ కేసులో మరో నిందితుడిని సిఐడి అధికారులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిఐడి డిజి శిఖా గోయల్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. జనగాంలో ఏడాది క్రితం జిబిఆర్ క్రిప్టో కరెన్సీ మోసం వెలుగు చూడడం తె లిసిందే. ఉమ్మడి వరంగల్‌తో పాటు కరీంనగర్ జిల్లాలకు చెందిన అమాయకులను నిండి ముంచి 95 కోట్ల రూపాయలను ఈ సంస్థ కాజేయడం విదితమే. దీనిపై బా ధితులు చేసిన ఫిర్యాదు మేరకు మొదట జనగాం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఆ తరువాత ఈ కేసును సిఐడికి బదలాయించారు. ఈ గోల్‌మాల్‌కు సూత్రధారిగా జనగాంకు చెందిన కురిమేల రమేష్ గౌడ్ (47)గా తేలింది. ఇతనే జిబిఆర్ క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెట్టేలా అమాయకులను వంచించాడని నిర్ధారణ అయ్యిం ది. ఈ కేసులో రమేష్ గౌడ్ అరెస్టు కాగా తమిళనాడులోని చెన్నైకి చెందిన ఎరువ స్లీవ రవికుమార్ రెడ్డిని గురువారం నాడు చెన్నైలో అరెస్టు చేశారు. నిందితుడిని శు క్రవారం హైదరాబాద్‌కు తరలించి ఇక్కడి కోర్టులో హాజరుపరిచి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసుపై విచారణ సాగుతోందని శిఖా గోయల్ తెలిపారు.



# నడిసముద్రంలో మునిగిపోయిన కూలీలు!

## 188 మంది గల్లంతు

**సనా (యెమెన్), మార్చి 7:** పొట్టకూటికోసం దేశం విడిచివెళుతున్న 188 మంది కూలిబతుకులు నడిసముద్రంలో కలిసిపోయాయి. గల్ఫ్‌దేశాల్లో ఉపాధికోసం వెళుతున్న కూలీలను తీసుకెళుతున్న నాలుగు పడవలు మార్గమధ్యంలో మునిగిపోయాయి. దాంతో ఆ పడవల్లో ప్రయాణిస్తున్న 188 మంది గల్లంతయ్యారు. ఈ సమాచారాన్ని ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ వెల్లడించింది. తమదేశంలో ఘర్షణలనుంచి బయటపడేందుకు ఇథియోపియా ప్రజలు ఎక్కువగా గల్ఫ్‌దేశాలకు వలస వెళుతుంటారు. అందుకు ఈ ప్రమాదం జరిగిన మార్గానే ఉపయోగిస్తుంటారు.

అదిప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన వలసమార్గం. ఈ మార్గంలో గత జనవరిలోకూడా ఇదే విధమైన ప్రమాదంజరిగింది. యెమెన్ తీరంలో పడవ మునిగి 20 మంది ఇథియోపియా వాసులు ప్రాణాలు వదిలారు. అలాగే 2024 సంవత్సరంలో మొత్తం 558 మంది ఈమార్గంలో మృతిచెందారు. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే రక్షణసహాయక బృందాలు రంగంలోకి దిగి చర్యలు చేపట్టాయి. గల్లంతయిన వారికోసం ముమ్మరంగా గాలింపు జరుపుతున్నాయి.

# దక్షిణాది రాష్ట్రాల్లో డ్రగ్స్ కట్టడికి ఉమ్మడి వ్యూహం

## కమాండ్ కంట్రోల్‌లో భేటీ అయిన తెలంగాణ, ఏపి, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల నార్కోటిక్ విభాగాల అధికారులు

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** దక్షిణాది రాష్ట్రాల్లో మాదకద్రవ్యాలను కట్టడి చేసేందుకు ఉమ్మడిగా ముందుకు సాగాలని తెలంగాణ, ఎపి, తమిళనాడు సహా ఒడిశా రాష్ట్రాల నార్కోటిక్ విభాగాలు నిర్ణయించాయి. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో గల తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో (టి.నాబ్) కార్యాలయంలో శుక్రవారం దక్షిణాది రాష్ట్రాల్లో పెరిగిపోతున్న మాదకద్రవ్యాల కట్టడిపై సమావేశం జరిగింది. టి.నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా నేతృత్వం వహించిన ఈ సమావే శానికి ఎపి, తమిళనాడు, ఒడిషా రాష్ట్రాలకు చెందిన నార్కోటిక్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సందీప్ శాండిల్యా మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం వల్ల యువత తమ జీవితాన్ని నాశనం చేసుకుంటోందని వాపోయారు. దీని కట్టడికి ఇప్పటికే తీసుకుంటున్న చర్యలను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం వుందని ఆయన తెలిపారు. ఈ విషయంలో నాలుగు రాష్ట్రాల నార్కోటిక్ విభాగాల అధికారులు డ్రగ్స్ స్మగ్లర్ల గురించి సమాచారం ఎప్పటికప్పుడు ఇచ్చిపుచ్చు కోవాలని ఆయన అన్నారు. స్మగ్లర్ల భరతం పట్టేందుకు పోలీసులు ఉమ్మడిగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఎపి, ఒడిషా నుంచి గంజాయి ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు స్మగ్లింగ్ అవుతుందని, దీనిని మరింత కట్టడి చేయాల్సిన అవసరం వుందని ఆయన చెప్పారు. దీంతో పాటు ఎపి, తమిళనాడు, ఒడిషా రాష్ట్రాల నార్కోటిక్ విభా గాల అధికారులు తమ తమ రాష్ట్రాలలో డ్రగ్స్ నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాబోయే రోజుల్లో నాలుగు రాష్ట్రాల పోలీసులు డ్రగ్స్ కట్టడికి కలి సికట్టుగా పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తమిళనాడు తరపున డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వెంకటేష్ ఆయన బృందంతో పాటు ఎపి, ఒడిషా రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు.

# నేడు మహిళా విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్న సిఎం రేవత్‌రెడ్డి

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మొదటిసారి ఏర్పాటు చేసిన తెలంగాణ మహిళా యూనివర్సిటీ(వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ)ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు (శనివారం) సందర్శించనున్నారు. కోఠిలో ఉన్న కోఠి మహిళా కళాశాలనే మహిళా యూని వర్సిటీగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న అనంతరం మొదటిసారిగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మహిళా దినోత్సవం రోజున(మార్చి 8) మహిళా విశ్వవిద్యాలయంలో పర్య టించనున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా శనివారం సాయంత్రం 4 గంటలకు వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యా లయాన్ని సందర్శించి పలు అభివృద్ధి పనులకు, పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులతోపాటు సిబ్బందితోనూ మాట్లా డనున్నట్టు తెలుస్తోంది. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని క్రీడా మైదానంలో ఈ కార్యక్రమాన్ని నిర్వ హించనున్నారు. ముఖ్యమంత్రిని కలవడానికి వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లతోపాటు అధ్యాపకులు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్టు తెలిసింది.

# బొగ్గు వినియోగంలో ఫస్ట్.. ఉత్పత్తిలో సెకండ్

## కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (ముషీరాబాద్), మార్చి 7, ప్రభాతవార్త:** మన భారతదేశ అభివృద్ధిలో బొగ్గు కీలకపాత్ర పోషిస్తోందని, అందుకే బొగ్గు ప్రాధాన్యత గణనీయంగా పెరుగుతోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కవాడిగూడలోని సిజిఒ టవర్స్‌లోని కేంద్ర పత్రికా సమాచార కార్యాలయంలో ఐఐటీ హైదరాబాద్‌లో రూ. 98 కోట్లతో సెంటర్ ఆఫ్ క్లీన్ కోల్ ఎనర్జీ అండ్ నెట్‌జీరో (క్లీన్జ్) పేరుతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కోలిండియా, ఐఐటి హైదరాబాద్‌ల మధ్య కిషన్‌రెడ్డి సమక్షంలో ఒప్పందం కుదిరింది. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 72 శాతం విద్యుత్తు మన దేశంలో బొగ్గు ద్వారానే ఉత్పత్తి చేసుకుంటున్నామని, స్టీలు, సిమెంట్, అల్యూమినియం, పేపర్, టెక్స్‌టైల్స్, హెవీఇండస్ట్రీ రంగాల్లో బొగ్గు కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు.

బొగ్గు ఉత్పత్తిలో మన దేశం ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉండగా, బొగ్గు వినియోగంలో మొదటి స్థానంలో ఉందని పేర్కొన్నారు.

కోలిండియా ప్రపంచంలోనే నెంబర్ వన్ కంపెనీ అని, బొగ్గు ఉత్పత్తి ద్వారా అనేక రాష్ట్రాల్లో రెవెన్యూ అందచేస్తున్నామని, రైల్వే శాఖలో బొగ్గు రవాణా ద్వారా 50 శాతం ఆదాయం సమకూరుతోందని వెల్లడించారు. క్లీన్ కోల్ ఎనర్జీ, నెట్‌జీరో కర్బన ఉద్గారాలు లక్ష్యంగా సరి కొత్త సాంకేతికత అభివృద్ధి చేసేందుకు సెంట్రల్ మైన్ ప్లానింగ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా పరిశోధన పెంచాలని నిర్ణయం తీసుకున్నామని, అందులో భాగంగా నేషనల్ సెంటర్ ఫర్ కోల్ అండ్ ఎనర్జీ రీసెర్చ్‌ను ఏర్పాటు చేశామని, దేశంలోని ఐఐటీలతో కలసి ఈ సెంటర్ పనిచేస్తుందని స్పష్టం చేశారు. క్లీన్ కోల్ టెక్నాలజీ, బొగ్గు వినియోగంలో ఆధునిక సాంకేతిక అభివృద్ధి చేసే విషయంలో ఐఐటీ హైదరాబాద్‌తో ఎంఒయు చేసుకున్నామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

నెట్ జీరో లక్ష్యాలను చేరుకునేందుకు కటింగ్ ఎడ్జ్ సాంకేతికతలను అభివృద్ధి చేయడం, సుస్థిరంగా బొగ్గును ఎలా వినియోగించుకోవాలనే దానిపై ఐఐటి పనిచేస్తున్నదని, భారతదేశంతోపాటు ప్రపంచ దేశాలకు క్రిటికల్ మినరల్స్ అవసరం ఉందని, క్రిటికల్ మినరల్స్‌ను గుర్తించేందుకు ఐఐటి హైదరాబాద్ కూడా సాంకేతిక సాయం అందచేస్తుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో కోల్ ఇండియా లిమిటెడ్ సిఎండి పి.ఎం.ప్రసాద్, ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ శ్రీమూర్తి, ఎస్.సి.సి.ఎల్ సీఎండి ఎన్.బలరాం నాయక్, పిఐబి హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతిపాటిల్ పాల్గొన్నారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డిసిపి శ్రీనివాస్

# నకిలీపత్రాలు సృష్టించి ప్లాట్ అమ్మకం

## ఏడుగురు నిందితులు అరెస్టు.. పరారీలో మరో 8 మంది

### కోటి నగదు, 3 కార్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం

### కేసు వివరాలను వెల్లడించిన డిసిపి సిహెచ్ శ్రీనివాస్

**హైదరాబాద్ (అత్తాపూర్) మార్చి 7, ప్రభాతవార్త :** నకిలీపత్రాలు సృష్టించి కబ్జాలకు పాల్పడుతూ విక్రయిస్తున్న ల్యాండ్ గ్రాబింగ్ ముఠాను రాజేంద్ర నగర్ పోలీసులు అరెస్టు చేశారు.శుక్రవారం రాజేంద్రనగర్ డిసిపి కార్యాలయంలో ఎసిపి శ్రీనివాస్, సిఐ క్యాస్ట్రోతో కలిసి డిసిపి సిహెచ్ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని పద్మ శ్రీ హిల్స్ సోమాజిగూడకు చెందిన వనీత చౌదరి అనే మహిళకు 600 గజాల ప్లాట్ ఉండి అయితే ప్రస్తుతం అమె తమిళనాడులో ఉంటుందని తెలిపారు. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు ఫోర్జరీ చేసి అమ్మినట్లు ఆమెకు తెలియడంతో గత నెలలో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా 15 మంది నిందితులు కలిసి ల్యాండ్ గ్రామింగ్ పాల్పడినట్లు గుర్తించారు.ఈ 15 మంది నిందితులంతా 600 గజాల స్థలానికి నకిలీ పత్రం సృష్టించి ప్లాట్ యజమాని కెనడాలో ఉంటుందని, నకిలీ స్టాంపులు తయారు చేసి మూసాపేట్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ప్లాటును శ్రీనివాస్ రెడ్డి,భరత్ రెడ్డిలకు 4.26 కోట్ల రూపాయలకు విక్రయించి నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. 7 మంది నిందితులు ఇమ్మానియేల్, దివాకర్ వర్మ, పాల్సన్ సుభాషిని, నాగేష్ అలియాస్ నాగేశ్వర రావు,పుష్ప కుమారి, చంద్రమోహన్, వలిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి 1.69 కోట్ల నగదు, 3 కార్లు, ఏడు సెల్‌ఫోన్లు, నాలుగు నకిలీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, నకిలీ స్టాంపులు, 3 కిలోల నకిలీ బంగారు బిల్లులు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరో 8 మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు.ఈ నకిలీ పత్రాలు సృష్టించి పాట్ల రిజిస్ట్రేషన్ చేసిన కేసులో మరిన్ని వివరాల కోసం కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు డిసిపి వెల్లడించారు.

# తొలిసారిగా 129 మంది కానిస్టేబుళ్లకు ఎక్సైజ్ అకాడెమీలో శిక్షణ

## ట్రైనీ మహిళా కానిస్టేబుళ్లకు కలిసొచ్చిన మహిళా దినోత్సవం

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త :** మహిళలకు ఆర్థిక, రాజకీయ, సామాజి క రంగాల్లో సముచితమైన స్థానం లభించడానికి జరుపుకునే దినోత్సవమే మహిళ దినోత్సవం. ఈ మహిళ దినోత్సవం ఎక్సైజ్‌శాఖలో ఒక ప్రత్యేకత సంతరించుకుంది. ఎక్సైజ్‌శాఖకు బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటి పరిధిలో 26 ఎకరాల్లో విస్తరించిన అకాడమీలో ఎక్సైజ్ శాఖలో 1991 నుంచి 36 బ్యాచ్‌లకు ఎస్ఐలు, కానిస్టేబుళ్ల ఇతర స్థాయి.బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. కాని ఎక్సైజ్ అకాడమీలో 37వ ఎక్సైజ్ కానిస్టేబుళ్ల శిక్షణ బ్యాచ్‌కు ప్రత్యేకత ఏర్పడింది.ప్రతిసారి అందరికి కలిపి శిక్షణ అకాడమీలో ఇవ్వడం జరిగేది. ఈ సారి కేవలం 129 మంది మహిళ కానిస్టేబుళ్లకు శిక్షణ అవకాశం లభించింది. ఇలా మహిళలకు మాత్రమే అకాడమీలో శిక్షణ ఇవ్వడం తొలిసారికావడం విశేషం.ఈ శిక్షణ సమయంలో మహిళ దినోత్సవం రావడం శిక్షణకు మరింత శోభ సంతరించుకుంది.ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్‌శాఖ కమిషనర్ చెవ్వూరు హరి కిరణ్ శిక్షణ మహిళ కానిస్టేబుళ్లకు కొత్త అవకాశాన్ని కల్పించారు. ఎక్సైజ్ శాఖలో పరిధిలో నడిచే బీరు, లిక్కర్ తయారు కంపెనీల్లో ఉత్పత్తులపై అవగహన కల్పించడానికి ప్రత్యేకంగా మహిళ కానిస్టేబుళ్లను పరిశీలిన కార్యక్రమాన్ని చేపట్టారు.కంపెనీలతోపాటు తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండెంట్ కంట్రోల్ సిస్టమ్‌ను కూడ పరిశీలించే అవకాశం కానిస్టేబుళ్ళకు లభించింది.

### ఉద్యోగానికి ముందే డిపార్టుమెంట్‌లో అనుభవం: శ్రావణి ట్రైనీ కానిస్టేబుల్

ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక అనంతరం ఎక్సైజ్ శాఖలో ఎలా ఉంటుందో అని భయపడ్డాం. కాని శిక్షణ అందరు మహిళలకు కలిపి శిక్షణ ఇవ్వడంతో మాలో ఆత్మ స్థైర్యం పెరింగింది. శిక్షణతోపాటు ప్యాక్టరీ సందర్శన ఉద్యోగం బాగా చేస్తామనే నమ్మకం కుదిరింది.

### కొత్త అనుభూతినిచ్చింది: సి.వి. శశిధార్‌రెడ్డి, అకాడమీ జాయింట్ డైరెక్టర్

29 సంవత్సరాల తన సర్వీస్‌లో మహిళ కానిస్టేబుళ్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వ దం కొత్త అనుభూతినిచ్చింది. శిక్షణతోపాటు బీరు, లిక్కర్ తయారీ కంపెనీల సందర్శన కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టినట్లయ్యింది. పోలీస్ కమాండెంట్ కంట్రో ల్ సిస్టర్ పరిశీలన శిక్షణార్థుల్లో ఆత్మస్థైర్యం నింపింది.

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-3-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 35 పేజీలు: 10+4 వెల: 6.50



Government of India

## గత 11 సంవత్సరాల్లో...

- జనన సమయంలో లింగ నిష్పత్తి 918 నుంచి 933 కి పెరిగింది
- విజ్ఞాన శాస్త్రాలు, సాంకేతికత, ఇంజినీరింగ్, గణితాల్లో (స్టెమ్) దాదాపు సగం అడ్మిషన్లు మహిళలవే
- సైనిక పాఠశాలలు, ఎన్డీఏలలో బాలికలకు ప్రవేశం
- సాయుధ బలగాల్లో మహిళలకు శాశ్వత నియామకాలు
- 48% కన్నా ఎక్కువ అంకుర సంస్థల్లో కనీసం ఒక మహిళా డైరెక్టర్ ఉన్నారు
- ముద్ర యోజనలో దాదాపు 70% మంది లబ్ధిదారులు మహిళలే
- 10 కోట్లకు పైగా గ్రామీణ మహిళలు స్వయం సహాయక బృందాల్లో సభ్యులే
- ప్రసూతి సెలవులు 12 వారాల నుంచి 26 వారాలకు పెంపు
- ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద 3.7 కోట్ల మంది లబ్ధిదారులకు రూ.16,500 కోట్లను ప్రభుత్వం అందించింది.
- 74% ప్రధానమంత్రి ఆవాస యోజన గృహాలకు మహిళలే యజమానులు
- 10 కోట్లకు పైగా గృహాల్లో ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు
- 15 కోట్లకు పైగా గృహాల్లో నల్ సే జల్ కనెక్షన్లు ఉన్నాయి
- దాదాపు 12 కోట్ల టాయిలెట్ల నిర్మాణం
- ట్రిపుల్ తలాక్ రద్దు
- ముస్లిం మహిళలు హజ్ యాత్రకు ఒంటరిగా వెళ్లవచ్చు

ఆమె సాధికారత కల్గిస్తుంది, ఆమె నడిపిస్తుంది, ఆమె స్ఫూర్తినిస్తుంది

మహిళా దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం ఈ రోజు- ప్రతి రోజూ!



అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

CBC 46101/13/0012/2425


ఆలోచన అమృతంతో సమానం. ఆలోచనలేని మనిషి అన్ని విధాలా పతనమవుతాడు.

-సిసిరో

# మాటల్లోనే మహిళా రక్షణ!

భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లుగా పదేపదే ఎంతో గొప్పగా చెప్పుకుంటాం. సమాజంలో పూజ్యనీయులైన మహిళల రక్షణ, సంక్షేమం విషయంలో చెప్పుకోదగిన ప్రగతిని సాధించలేకపోతున్నాం. ఇంకా చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించలేకపోతున్నాం. మరొక పక్క మహిళా భద్రత విషయంలో విఫలమవుతున్నామేమోననిపిస్తున్నది. కొత్త చట్టాలు ఎన్నితెచ్చినా, మరెంత మంది అధికారులను నిమించినా, కఠిన చర్యలు తప్పవని పాలకులు ఎంతగా చెప్తున్నా, చట్టాలు కానీ, అధికారులు కానీ తమను ఏమీ చేయలేవనే ధీమాతో మహిళలపై నేరాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. వాస్తవంగా చదువు సంధ్యలు పెరిగే కొద్దీ విజ్ఞానం ఆర్జించే కొద్దీ మనుషుల ప్రవర్తనలోమార్పు రావాలి. మంచి ఏదో, చెడు ఏదో గుర్తించే పరిపక్వత చేకూరాలి. సభ్యతాసంస్కారాలు మరింతగా పెరగాలి. కానీ దురదృష్టవశాత్తు అందుకు విరుద్ధంగా తిరోగమనిస్తున్నామేమోననిపిస్తున్నది. మహిళలపై నేరాలు అదుపు తప్పిపోతున్నాయని చెప్పొచ్చు. ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ అత్యాచారాలు, లైంగిక వేధింపుల కేసుల్లో విచారణ త్వరితగతిన చేయాలని ఉద్ఘాటించారు. మహిళా రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నా వాటి అమలులో నెలకొన్న ఉదాసీనత వల్ల వారిపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. ప్రేమించలేదనే నెపంతో యువతను గొంతు కోసి చంపే సంఘటనలు తరుచుగా జరుగుతున్నాయి. గత యేడాది తెలంగాణలో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో ఒక చెంచు మహిళను కొందరు కిరాతకులు ఇంట్లో నిర్బంధించి వివస్త్రను చేసి శరీరంపై వాతలుపెట్టి కళ్లలో, మర్మాగంలో కారం పెట్టి చిత్రహింసలు పెట్టిన సంఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇక మైనర్ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలకు అంతే లేదు. అంతకుముందు మానసిక వికలాంగురాలైన యువతిని విజయవాడలో ఒక ఇరుకు గదిలో బంధించి ముగ్గురు కిరాతకులు అత్యాచారం చేశారు. ఇలాంటి ఘోరాలు దేశవ్యాప్తంగా ఎన్నోచోట్లు చేసుకొంటున్నాయి. ఇక తాము పోతే తమ పిల్లలకు దిక్కు ఉండదనే భయాందోళనతో పిల్లలను కూడా చంపి ఆత్మహత్యలకు పాల్పడుతున్న తల్లులు ఎందరో ఉన్నారు. దీనికి తోడు కుల, మత, వర్గాలకు అతీతంగా సమాజాన్ని తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతుంటే మూర్తీభవించిన మూఢనమ్మకాలు కుల వ్యవస్థపై ఉన్న భ్రమలతో నేటికీ కన్నతల్లిదండ్రులే హత్యలకు పాల్పడుతున్నారు. కుత్రపన్ని లక్షలాది రూపాయలు సుపారిలిచ్చి కుమార్తెల పసుపు,కుంకుమలను తుడిచివేసేందుకు కూడా కొందరు వెనుకాడడం లేదు. కులాంతర వివాహాలు ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నది. కులాంతర ప్రేమ, పెళ్లిళ్లపై జరుగుతున్న ఈ అమానుషత్వంలో గత పదేళ్లల్లో తెలుగు రాష్ట్రాల్లోనే వందలాది మందిహత్యలకు, ఆత్మహత్యలకు గురయ్యారు. ఇక అదృశ్యాల గూర్చి చెప్పక్కర్లేదు. యేటా లక్షలాది మంది మహిళలు అదృశ్యమవుతున్నారు. భారత్‌లో 2020లో ఏకంగా నాలుగు లక్షల ఇరవైమూడువేల మంది మహిళలు, డెబ్బైతొమ్మిదివేల రెండువందల ముప్పైమంది బాలికలు అదృశ్యమయ్యారు. వారిలో చాలామంది ఆచూకి ఇప్పటికీ తెలియదు. కనీసం వారు బతికి ఉన్నారో లేదో తెలియక కుటుంబ సభ్యులు పడుతున్న వేదన వర్ణనాతీతం. అయితే ఇటీవల కాలంలో సిసికెమెరాలతో నేరస్తులను పట్టుకోగలుగుతున్నారు. ఈ దారుణాలకు పాల్పడుతున్న నిందితుల్లో అధికశాతం అంతోఇంతో చదువుకున్నవారే. జరిగిన, జరుగుతున్న సంఘటనలు ఆవేదనే కాదు, ఆందోళన కలిగిస్తున్నాయి. సభ్యసమాజం తలవంచుకునేలా చేస్తున్నాయి. అయితే సంఘటనలు జరిగినప్పుడల్లా ఖండించడం పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పాలకులు పదేపదే చెప్తూనే ఉన్నారు. ఈ విషసంస్కృతి పెరిగిపోతుందనేందుకు ఈ సంఘటనలు అద్దంపడుతున్నాయి. మరొకపక్క మహిళలపై హింసకు చరమగీతం పాడాలనే ఉద్దేశ్యంతో ఎంతో కృషి జరుగుతున్నది. మనదేశంలోనే కాదు ఇతర దేశాల్లోకూడా చట్టాలు చేస్తున్నారు. ఎన్నెన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారు. అవి ఏమాత్రం సరిపోవడం లేదు. ఇప్పటికీ మన చుట్టూ సమాజంలో లక్షలాది మంది మహిళలు పలురకాల హింసలకు గురవుతున్నారు. ప్రపంచంలోని అన్నిదేశాల్లో స్త్రీ,పురుషుల మధ్య అసమానతలు లెక్కగడితే మహిళలను దేవతలా కొలిచే సంప్రదాయం మన భారతావనిలోనే ఉన్నది. కానీ దురదృష్టవశాత్తు మహిళలపై జరుగుతున్న హింసలో భారత దేశం అగ్రస్థానంలో ఉందని చెప్పొచ్చు. ఏదిఏమైనా మాట లతో కాక మహిళా రక్షణ చేతల్లో చూపాలి. ఈ భారమంతా పాలకులపైనే వేయకుండా స్వచ్ఛంద సంస్థలు కూడా ఇందులో భాగస్వామ్యం కావాలి. సమాజం కూడా ఆలోచించాలి. కేసుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని తిరుగులేని సాక్ష్యాలు సేకరించి నేరస్తులు ఏ పరిస్థితుల్లోనూ తప్పించుకోకుండా కోర్టుల ముందు రుజువు చేసి శిక్షలువేయించాలి. అవసరమైతే చట్టాలను మరింత పటిష్టంచేయాలి. అప్పుడే నేరస్తుల్లో చట్టమన్నా, పోలీసులన్నా భయభక్తులు ఏర్పడతాయి. అలాగే సంక్షేమం విషయంలో కూడా మాటల్లోకాక చేతల్లో చూపాలి. చదువుకొని జీవితాన్ని చక్కదిద్దుకోవాలనే తపన ఈనాటి బాలికల్లో ఎక్కువగా ఉన్నా పేదరికంతోపాటు ఎన్నో సామాజిక పీడనలు ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా అందరూ ఆలోచించాల్సిన తరుణమిది.

యుద్ధానికి కారణాలు ఎవరూ అన్వేషించరు. ఫలితం ఏమిటనే అందరూ ప్రశ్నిస్తారు.



సెనెకా

మానవ నాగరికతను చాలావరకు ప్రభావితం చేసేది ఉత్తమ మహిళలే.



ఎమర్సన్

# ప్రజావాక్కు



### ఆన్‌లైన్‌లో మురికి ఉప్పెన

ఆన్‌లైన్ ద్వారా మురికి యధేచ్ఛగా ప్రవహిస్తోంది. ఇది సామాజిక సమస్యగా పరిణమిస్తోంది. బూతులు, హింస, వెకిలితనం లాంటివి ఏ అడ్డూ ఆపులేకుండా ఉప్పెనలా ముంచేస్తున్నాయి. దేశంలో ఈ విపరీత పోకడను ఎలా నియంత్రించబోతున్నారంటూ సుప్రీం కోర్టు ప్రభుత్వాన్ని అడిగింది. నిజానికి ఆన్‌లైన్‌లో సామాజిక వ్యతిరేక పోకడల్నినియంత్రించడం ఒక పెద్దసవాల్. కంటెంట్ తయారీదారులు, వాటిని అందిస్తున్న ప్లాట్ ఫారాలు స్వీయ నియంత్రణ పాటిస్తాయని భావించడం ఒట్టి మాట. ఏదో రకంగా నలుగురి దృష్టిలో పడాలి,వారి బలహీనతల్ని వాడు కొని లాభపడాలి అన్న ఉద్దేశ్యం తప్ప,వాటికి ఇంకే ఆలోచన, బాధ్యత ఉండదు. ప్రభుత్వం దగ్గర వాటిని నియంత్రించే వ్యవస్థ, ఏర్పాట్లు ప్రస్తుతానికైతే లేవు. ఆ దిశగా ఆలోచించడం ఇప్పుడు అత్యవసరమైపోయింది.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### విఫలమైన శాంతి చర్చలు

ట్రంప్‌తో శాంతిచర్చలు నచ్చక వెనుదిరిగిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అమెరికా తనసైనిక సాయం చేయననే సరికి తాను మొదట్లో చాలా తొందరపడ్డానని గ్రహించి అగ్రరాజ్యానికి తలవంచి తాను ట్రంప్ నాయకత్వంలో నడుస్తానని ఆయన ఆదేశించినట్లు తన దేశంలోని ఖనిజాలను అప్పగించేందుకు సిద్ధమని వైట్‌హౌస్‌లో జరిగిన వాగ్యుద్ధంపై విచారాన్ని వ్యక్తంచేస్తూ అనేకమెట్లు దిగివచ్చాడు. యూరోపియన్ యూనియన్ తనకు అండగా నిలిచినా అగ్రరాజ్యానికి అంగ ప్రదక్షిణ చేయక తప్పలేదు. దీనితో రష్యా, ఉక్రెయిన్ మధ్య సయోధ్య కుదిరినట్టేనా? మూడేళ్ల మారణహోమానికి ముగింపు పలికించారనిఆశిద్దామా?

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### రోడ్ల నిర్మాణం జరగాలి

సూర్యుని ఎండ సాయంత్రం పూట తిరిగి అంతరిక్షంలోకి వెళ్లిపోవాలి. దీనినే హీట్‌బ్యాలన్స్ అంటారు. లేనట్లయితే భూమిమీద ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి. సిసి రోడ్ల వలన హీట్ బ్యాలన్స్ జరగదు. అందువలన సిసి రోడ్లను నిషేధించి డాంబర్ రోడ్లు మాత్రమే వేయాలి. సిసి రోడ్ల మీద వాహనదారులు పడిపోతే తలపగిలి చనిపోయే అవకాశం ఉంది. శాస్త్రీయ పద్ధతిలో రోడ్ల నిర్మాణం జరగాలి.

-పుట్లూరి రాంనర్సిహా రెడ్డి, నల్లగొండ జిల్లా

### తగ్గుతున్న ప్రభుత్వ పాఠశాలల సంఖ్య

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఉపాధ్యాయుల ప్రాతినిధ్యం కోసం మూడు ఎమ్మెల్సీ సీట్ల కోసందిగ్విజయంగా ఎన్నికలు జరిగాయి. ఫలితాలు కూడా వెల్లడి అయ్యాయి. ఉపాధ్యాయుల తరఫున ఈ ఎమ్మెల్సీలు మేధావి వర్గం కనుక ఆలోచించి సమాజానికి, విద్యార్థులకు, విద్యార్థినీలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు మేలు కలిగేలాంటి సూచనలు సలహాలను తెలియజేయాలి. నేటి ప్రజలు ఎందుకో గాని పల్లెల్లో ఉండడం లేదు. పట్టణాలకు చేరుకుంటున్నారు. ప్రభుత్వపాఠశాలలో చదివించడానికి ఇష్టపడడం లేదు ప్రైవేటు కార్పరేట్స్ కళాశాలలో స్కూల్లో చదివించడానికి ఇష్టపడుతున్నారు. విద్య అనేది వ్యాపారం కాదు గనుక లాభనష్టాల గురించి ఆలోచించకుండా పేదల్లో నిరుపేదలకు ఎలాంటి విద్యకు నోచుకోని వ్యక్తుల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధుల పైనఉన్నది. కనుక సలహాలు సూచనలు మండలసభ్యులివ్వాలి.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### బదలీల్లో పెర్ఫార్మెన్స్ పాయింట్స్ తొలగించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదలీలను పారదర్శకంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ బదలీల నియంత్రణ ముసాయిదా చట్టం 2025ను రూపొందించి డ్రాఫ్టును ఇటీవల విడుదల చేసింది. ఇందులో మార్పులూచేర్పులూ అవసరం. ఉపాధ్యాయ బదలీ చట్టం డ్రాఫ్ట్‌లో టీచర్ పర్ఫార్మెన్స్ పాయింట్స్ గురించి తెలిపారు. వాటిని ఏవిధంగా కేటాయిస్తారో తెలపలేదు. పర్ఫార్మెన్స్ పాయింట్స్ పూర్తిగా తొలగించాలి కేవలం సర్వీస్ పాయింట్స్, స్టేషన్ సీనియారిటీ పాయింట్స్‌లతో మాత్రమే బదలీలు చేపడితే అందరికీ సమన్యాయం జరుగుతుంది.

-వాసిలి సురేష్ ,నెల్లూరు జిల్లా

### చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం

ఏపిలోని నగర మున్సిపాలిటీ,కార్పొరేషన్‌లు గతంలో గృహాలు నుండి వచ్చే చెత్తని వసూలు చేయుటకు తీసుకున్న ప్రత్యేక చెత్తపై పన్ను అదనుగా వసూలు చేశాయి. అది విపరీతమైన ఆదాయం. నూతన బాధ్యతలు చేపట్టిన ప్రభుత్వం దాన్ని రద్దు చేసి ప్రజల మన్ననలు పొందింది. ఐతే ప్రస్తుతం వీధుల్లో క్లీనింగ్, వాహనాల ద్వారా చెత్త వసూలు చేయడం కొన్ని చోట్ల పద్ధతిలో జరగక, దిగువ సిబ్బంది పనిలోపంతో పారిశుధ్యం కొత్త సమస్యను తెచ్చాయి.

-బొల్లోజు మేఘానధం, విశాఖపట్నం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రకటనలతో ధరలు తగ్గవు

***నిత్యావసర వస్తువుల చట్టాన్ని తీసుకువచ్చారు. అయినా ఫలితం లేకుండాపోతున్నది. ఇక కూరగాయల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల సాగు గణనీయంగా తగ్గిపోయింది. రేట్లు బీదాబిక్కే కాదు సామాన్యులు కూడా అందుకోలేనంతగా పెరిగిపోయాయి. ఉన్న డబ్బును ఎలా ఖర్చుపెట్టాలో తోచని నల్లధనస్వాములకు ఏ వస్తువు ధర ఎంత పెరిగినా చీకూచింత ఉండకపోవచ్చునేమోకానీ కూలీ, నాలి చేసుకునేవారు, రెక్కాడితే డొక్కాడనివారు నెలజీతం మీదనే ఆధారపడి జీవనం సాగించే మధ్యతరగతి, పరిమిత ఆదాయ వర్గాలదే సమస్య అంతా. ఇప్పటికైనా పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి. ధరలను అదుపులో పెట్టేందుకు త్రికరణ శుద్ధిగా ప్రయత్నాలు చేయాలి.***

దామెర్ల సాయిబాబ

'పదాల కన్న గొప్పది వాక్‌శక్తి, వాక్‌శక్తికన్న గొప్పది మనసు, మనసుకన్న గొప్పది సంకల్పం. మన పాలకుల్లో ఆ సంకల్ప లోపం కారణంగానే ప్రజలకు ఇక్కట్ల మీద ఇక్కట్లు వచ్చిపడుతున్నాయేమోననిపిస్తున్నది. ఇతర సమస్యల మాట ఎలా ఉన్నా రోజురోజుకూ పెరిగిపోతూ ప్రజాజీవితాలను నరకప్రాయంచేస్తున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తెచ్చే ఆలోచన కానీ, ప్రయత్నం కానీ త్రికరణశుద్ధిగా జరగడం లేదు. ధరల నియంత్రణకు, సమీక్షలకు, సమావేశాలకు కొరతలేదు. కమిటీల మీద కమిటీలు వేస్తున్నారు. పెరుగుతున్న ధరలపై ఉక్కుపాదంమోపుతాం, అవసరమైతే ఎస్మాచట్టాన్ని ప్రయోగిస్తాం అంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నా కానీ ఇవేమీ దళారులు పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. ప్రస్తుత పాలకులేకాదు, ఏపార్టీ అధికారంలో ఉన్నా ధరలు పెరగడం, వాటిని నియంత్రిస్తామని చెప్పడం, అక్రమ నిల్వలు చేసేవారిపై చర్యలు తీసుకొని జైళ్లకు పంపుతామని బెదిరించడం ఒక రివాజుగా మారిపోయింది. ఈ విషయంలో గతంలో ఎప్పుడూ పాలకులు చర్యలు తీసుకోవడం లేదని చెప్పడం లేదు. రకరకాల చట్టాలు తెచ్చారు. బ్లాక్‌మార్కెటీర్లను జైళ్లకు పంపించారు. ప్రభుత్వమన్నా, అందులో పనిచేసే అధికారులన్నా గడగడలాడిన సందర్భాలు లేకపోలేదు. కానీ అవిరానురానుతగ్గిపోయాయి. అధికారులను వారివారి విధులను స్వేచ్ఛగా చేయనీయడం లేదేమోననిపిస్తున్నది. అన్నింటిలోనూ మితిమీరిన రాజకీయ జోక్యం, తమ సిఫారసులకు రాజకీయ ఒత్తిడిలకు తలొగ్గని సమర్థులైన అధికారులను బదలీ వేటుతో శంకరగిరి మాన్యాలు పట్టించడం ఆరంభమైంది. అందుకే సమర్థులు, నీతివంతులైన అధికారులు కొందరు ఉన్నా తమకెందుకు ఈ తలనొప్పి అని సర్దుకుపోవడమే సౌఖ్యం అన్నట్లుగా ఉద్యోగాలు నిర్వహించుకుంటున్నారు. మరొకపక్క అధికారుల్లో కూడా అంకితభావం తగ్గిందనే చెప్పొచ్చు. అధికశాతం ఉద్యోగులు బిల్లు, బెల్లు అన్న తీరులో వ్యవహరిస్తున్నారు. దీనికితోడు రాజకీయాల్లో కీలకపాత్ర వహిస్తున్న కొందరు పెద్దలు, మరి కొందరు అక్రమ వ్యాపారస్తులతో మమేకం అవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే నాయకులే కుటుంబ సభ్యుల పేరుతో స్వయంగా వ్యాపారం చేస్తున్నవారు కూడా ఉన్నారు. ఇదేమీ కొత్త విషయంకాదు. ఇప్పటికిప్పుడు ప్రారంభమైంది కూడాకాదు. కానీ ఈసంప్రదాయం రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తున్న విషయం. రాజకీ యమే వ్యాపకంగా జీవనం సాగించేవారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతున్నది. డబ్బుసంపాదనే ధ్యేయంగా మారుతున్నది. ఎన్నికలు కూడా అలా రూపాంతరం చెందుతున్నాయి. ఇందులో ప్రజల బాధ్యత కూడా కొంత ఉందని చెప్పకతప్పదు. దీంతో ఎన్ని కేకలు పెట్టినా, మరెన్ని హెచ్చరికలు చేసినా తమను ఏమీ చేయలేవనే ధీమా ఈ అక్రమ వ్యాపా రాల్లో అంతకంతకు పెరిగిపోతున్నది. ధరలు పెరగడానికి ముఖ్యకారణాల్లో ఇదొకటి. ద్రోవ్యల్బణంతోపాటు మార్కెట్ మాయాజాలం కూడా ఉందనేది నిర్వివాదం. ప్రస్తుతం బియ్యం ధరలనే తీసుకోం డి. బహుశా స్వాతంత్ర్యం వచ్చి నప్పటి నుంచి ఈ ధరలు లేవనే చెప్పొచ్చు. సన్నబియ్యం కిలోఅరవై, డెబ్బైరూపాయలు దాటిపోయింది. ఇక కంది, శెనగ లాంటి పప్పుదినుసుల పరిస్థితి చెప్పక్కర్లేదు. ప్రభుత్వం పేదలకు సబ్సిడీలో అంది స్తున్న బియ్యం తిరిగిపాలిష్ చేసుకొని కొంత మార్కెట్‌లోకి వస్తే మరికొంత విదేశాలకు తరలిపోతున్నది. నిరోధించేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు. పప్పుదినుసులే కాదు పేదలు నిత్యం వాడే కారం, ఉప్పు, నూనెలువంటి ధరలు కూడా

ఒక్క మాట

ఆకాశాన్ని అంటుతున్నాయి. నియంత్రణ కమిటీలు పెట్టినా అవి సమీక్షలతో కాలం గడుపుతున్నాయి. తెలుగురాష్ట్రాలనే కాదు దేశవ్యాప్తంగా కూడా వరిసాగు బాగా విస్తరించింది. దిగుమతులుకూడా ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి. నిల్వచేసుకోవడానికి గోదాముల కొరత ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో కూడాబియ్యం ధరలు ఆకాశానికి అందడం అంతుబట్టడం లేదు. ఇక ఈసారి మిర్చికూడా విస్తారంగానే పండింది. వేలకొద్ది క్వింటాళ్లు మార్కెట్లోకి వచ్చేశాయి. రేటు మాత్రం పాతాళలోకానికి చేరుకున్నది. రైతులకు దిక్కుతోచడం లేదు. గత యేడాది ఇదేసమయంలో ఇరవైఐదువేల వరకు అమ్మిన మిర్చి క్వింటాలుకు ఇప్పుడు అందులో సగం కూడా అమ్మడం లేదు. ఇంకొక పక్క కారంధరలు మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఈధరలు హెచ్చుతగ్గులుగా ఉన్నప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులకు తాము ప్రకటించిన కనీస మద్దతు ధరకు కొంటూ వినియోగదారులకు అందుకు అనుగుణంగా సర సమైన ధరలకు అందించే ఏర్పాట్లు గతంలో చేసేవారు. ఇప్పుడు అదిపూర్తిగా మరిచిపోయారనే చెప్పొచ్చు. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు పటిష్టమైన ఒక వ్యవస్థను మన పెద్దలు ఏర్పాటు చేశారు. కానీ ఆవ్యవస్థ కూడా రానురాను నిర్వీర్యమైపోయింది. ప్రజలకు నిత్యం అవసరమయ్యే సరు కుల కొరత ఏర్పడినప్పుడు సామాన్యులకు అందుబాటులో లేకుండా ధరలు పెరుగుతున్నప్పుడు ఒక పద్ధతి ప్రకారం ప్రజలకు కొంతమేరకైనా సరుకులు అందించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారు. కాలక్రమేణా అదే ప్రజాపంపిణీ వ్యవస్థగా రూపాంతరం చెందింది. మన దేశానికి సంబంధించినంత వరకు 1881ప్రాంతంలో తీవ్ర క్షామం ఏర్పడి సరుకు లభించకపోవడం, లభించినా కొనే ఆర్థికపరిస్థితి లేకపోవడంతో అనేక మంది ఆకలితో అసువులు బాయడంతో ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం ఈ సమస్యను అధిగమించేందుకు ఆకలి చావుల నుండి బీదాబిక్కి ప్రజలను కాపాడేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆనాడు ఆహార కొరతలకు మూలకారణమైన కరవులు, ఆ కరవులు ఎందుకు వస్తున్నాయి?ఎలా నివారించాలి? ఆహార ధాన్యాలను ప్రజలకు అవసరమైన ధరలకు ఎలా అందుబాటులో ఉంచాలి? తదితర అంశాలపై అధ్యయనం చేసిన కమిటీ కొన్ని సూచనలు చేసింది. అయితే బ్రిటిష్ ప్రభుత్వం ఆ సూచనలను ఆనాడు అంతగా పట్టించుకోలేదు. అప్పుడప్పుడు పరిస్థితులకు అను గుణంగా కొన్ని చర్యలు చేపట్టినా ఆ కమిటీ చేసిన సూచ నలు మాత్రం అమలుకు నోచుకోలేదు. 1943లో ఏర్పడిన తీవ్రక్షామం దేశవ్యాప్తంగా ఎంతో మంది చనిపోగా ఒక్క బెంగాల్‌లోనే ముప్పైఐదు లక్షలమందికిపైగా ఆకలితో ప్రాణాలు కోల్పోవడంతో బ్రిటిష ప్రభుత్వం బెంబేలెత్తింది. అప్పుడు ఆ కమిటీ చేసిన ప్రతిపాదనలను బయటకు తీశారు. ఆనాటి నుంచి అంతో,ఇంతో అమలు చేస్తూనే ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా కొనసాగించారు. ఒక పక్క అది కొనసాగిస్తూ అక్రమ నిల్వలు పెరగడం, కృత్రిమ కొరత సృష్టించడం, రేషనింగ్ సరుకుల సేకరణ సమస్యగా మారడం మరొకపక్క రైతులకు గిట్టుబాటుధర రాకపోవడం, వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. వీటిని అధిగమించేందుకు 1965లో భారత ఆహారసంస్థ (ఎఫ్‌సిఐ)ను ఏర్పాటుచేశారు. మార్కెట్లో ధరలు పడిపోయినప్పుడు రైతులు నష్టపోకుండా వారి వద్దనుండి ప్రభుత్వంప్రకటించిన కనీస మద్దతు ధరకు ఎఫ్‌సిఐ కొనుగోలుచేస్తుంది. అలాగే మిల్లర్లుకొనుగోలు చేసిన ధాన్యంలో కొంత శాతం ఎఫ్‌సిఐకి విధిగా ప్రభుత్వం ప్రకటించిన ధరలకు లేవిగా ఇవ్వాల్సిందిగా నిబంధన విధించారు. అలా ఉత్పత్తిదారులు నష్టపోకుండా ఇటువినియోగదారులకు భారం పడకుండా ధరలు అదుపులో ఉంచేందుకు ఇంకొక పక్క పేద,బడుగు,బలహీనవర్గాలకు సబ్సిడీ కింద అందించే కార్యక్రమంలో ఎఫ్‌సిఐ కీలకపాత్ర వహించింది. అలాగే ధరలను అదుపు చేసేందుకు నల్లబజారుకు తరలకుండా కట్టుదిట్టమైన చర్యలుచేపట్టారు. అందులో భాగంగానే నిత్యావసర వస్తువుల చట్టాన్ని తీసుకువచ్చారు. అయినా ఫలితం లేకుండాపోతున్నది. ఇక కూరగాయల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల సాగు గణనీయంగా తగ్గిపోయింది. రేట్లు బీదాబిక్కే కాదు సామాన్యులు కూడా అందుకోలేనంతగా పెరిగిపోయాయి. ఉన్న డబ్బును ఎలాఖర్చుపెట్టాలో తోచని నల్లధనస్వాములకు ఏ వస్తువు ధరఎంత పెరిగినా చీకూచింత ఉండకపోవ చ్చునేమోకానీ కూలీ,నాలి చేసుకునేవారు. రెక్కాడితే డొక్కాడనివారు నెలజీతం మీదనే ఆధారపడి జీవనం సాగించే మధ్యతరగతి, పరిమిత ఆదాయవర్గాలదే సమస్య అంతా. ఇప్పటికైనా పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి. ధరలను అదుపులో పెట్టేందుకు త్రికరణ శుద్ధిగా ప్రయత్నాలు చేయాలి. ●

# వన్యప్రాణుల మనుగడతోనే మానవాళి ఉనికి!


బి.మధు

ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో వన్యప్రాణుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్నిరకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయేతరాలు భారీమూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వన్యప్రాణుల సమతుల్యత దెబ్బతినకుండా వాటిని రక్షించుకుంటూ, జీవవైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరాసులను పరిరక్షించుకోని ఎడల పలు జాతులు అంతరించే ప్రమాదంతోపాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవవైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధిను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80 శాతం ఉభయచర జాతులు, 75శాతం పక్షిజాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి. నేటి జీవజాతుల్లో దాదాపు ఒక్క మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయని భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలపడంతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది. ప్రపంచ సగంజిడిపి ప్రకృతిసంపద మీదనే ఆధారపడి ఉంటున్నది. జీవవైవిధ్య పరిరక్షణకు లేదా పునర్నిర్మాణానికి ప్రతి ఏటా 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500బిలియన్ డాలర్లు అయినా ప్రపంచదేశాలు వెచ్చించాలని ఐరాస ప్రధాన కార్యదర్శిపేర్కొనడం విశేషం. ప్రపంచ మానవాళి ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటిసాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించారని ప్రపంచ దేశాలను, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలను కోరడం జరుగుతున్నది. వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదావ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటివి నిర్వహించాలి. జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత,శుద్ధ జలాలు/పీల్చే గాలులు,వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి. ఈ విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టి విధ్వంసానికి పాలుపడితే రేపటి తరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. ●

# మహిళలపై వివక్ష ఇంకెంతకాలం?

మన్నారం నాగరాజు

ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారు అని మనం ప్రపంచానికి సందేశం అందించినప్పటికీ, వేల సంవత్సరాలుగా వేళ్లూనుకుని ఉన్న మన పురుషాధిక్య సమాజం స్త్రీపట్ల వివక్ష చూపుతూనే ఉంది. పురుషాహంకారానికి, సామాజిక కట్టుబాట్లకు మహిళ బలవుతూనే ఉంది. కుటుంబ ప్రతిష్ట అనే పంజరంలో స్త్రీని బందీని చేసి రక్షణ కల్పించామని సంబరపడుతుంది సమాజం. కాని ఆ రక్షణ ఎంత సురక్షితం? ఇప్పుడు పితృస్వామిక సమాజంలో స్త్రీలు ప్రతిచోటా రాజకీయ అసమానతలకు అణచివేతలకు గురవుతున్నారు. ఈ సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలున్నాయి. ఉన్నవాళ్లు, లేనివాళ్లు అని రెండుగా చీలిపోయిన సమాజం ఇది. నేడు ధనిక వర్గాలలోనూ శ్రామిక వర్గాలలోనూ స్త్రీ, పురుషులు సమానులు కారు. ఈ భారత దేశంలో ఎక్కడైనా స్త్రీలు వివక్షకు గురవుతూనే వున్నారు. స్త్రీలు, విద్య కోసం ఆత్మరక్షణకోసం, రాజకీయ అస్థిత్వం, ఆస్తికోసం సమానత్వం కోసం పోరాటాలు చేస్తూనే వున్నారు. ఈ పోరాటాలకు మనదేశంలో సంస్కరణోద్యమంలోనే బీజాలు పడ్డాయి. స్త్రీలు విద్యావంతులైతే తమ సమస్యలు తామే పరిష్కరించుకుంటారని, భావించి పూలే తన భార్య సావిత్రిబాయికి చదువు నేర్పించి ఏకంగా ఆమె చేత నిమ్నకులాల పిల్లలకోసం పాఠశాలలు తెరిపించారు. వితంతు స్త్రీలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించి పునర్ వివాహాలు జరిపించారు. భారతదేశంలోనే తొలిమహిళా టీచర్ అయిన సావిత్రిబాయిపూలే, బహుజనులను బానిసత్వం నుంచి విముక్తి చేసేందుకు సమాజానికి జ్ఞానబోధ చేసిన బహుజన సమాజ స్వాప్నికురాలు సమాజంలో శూద్ర శోషిత వర్గాల మహిళలకు సామాజిక న్యాయపోరాటం నేర్పిన మహిళోద్యమ పతాక సావిత్రిబాయిపూలే. ఇకస్త్రీ పురుషులు సమానులే. శారీరకమైన తేడాలు మినహా వారిరువురికి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలతో సహా అన్నిరంగాల్లోనూ ఇంటిపని, పిల్లల పెంపకంలోను సమానమైన హక్కులు సాధ్యతలు ఉన్నాయి. భారతదేశాన్ని భరతమాత అనే కొలిచే దేశంలో అందరికి స్వాతంత్ర్యం అనేది బూటకమే. ఈ దుస్థితికి కారణం పురుషాధిక్యాన్ని భరిస్తూ ఉండడమే. ఇంట్లో అబ్బాయిలకు ఉన్న స్వేచ్ఛ అమ్మాయిలకు ఇవ్వకుండా వారి ఆలోచనలకు గౌరవం ఇవ్వకుండా చిన్నతనం నుండే ఆంక్షలు విధిస్తూ, తనును అబలగా మార్చాలనే బాల్యం నుంచే అణగ దొక్కుతున్నారు. మహిళా హక్కులకు ప్రాధాన్యం ఇస్తూ రూపొందించిన హిందూ కోడ్ ముసాయిదా బిల్లు 1947 నవంబర్లో సెలెక్ట్ కమిటీ అంబేద్కర్ పంపించారు. ముసాయిదాబిల్లుపై ఫిబ్రవరి 11 నుంచి అదే ఏడాది సెప్టెంబర్‌లో 14 వరకు చర్చజరిగింది. ఈవిప్లవాత్మక ముసాయిదా బిల్లును చూసి సంప్రదాయవాదులు గగ్గోలు పెట్టారు. 1952లో లోక్‌సభ ఎన్నికల తర్వాత బిల్లును ఆమోదింపచేస్తానని అప్పటి ప్రధాని నెహ్రూ హామీ ఇచ్చారు. 75ఏళ్ల ప్రజా స్వామిక పాలనలో కేవలం ఒక మహిళా ప్రధాని, ఇద్దరు మహిళా రాష్ట్రపతి అంతే. మిగతా వారంతా మగవారేఅంటే మన దగ్గర ఎంత పురుషాధిక్యత ఉందన్న విషయం బహిరంగంగానే అర్థం అవుతుంది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి75 ఏళ్లు గడిచింది. అయినా నేటికీ మహిళలకు




మాత్రం స్వేచ్ఛ, సమానత్వం ఇంకా అందని ద్రాక్షగానే ఉన్నాయి. ఇప్పటికీ వారిని వంటింటికే పరిమితం చేయాలని భారతదేశ సమాజం కోరుకుంటున్నట్లుగా అనిపిస్తుంది. మహిళలు కేవలం పిల్లలను కనేయంత్రాలుగానే మగవాళ్ల చూస్తున్నారు. స్త్రీలకు పీడనతప్ప మరేమీ లేదని రాజ్యాంగ రచన సమయంలో అంబేద్కర్ గ్రహించారు. రాజ్యాంగం స్త్రీ,పురుషులను సమానంగా గుర్తించి గౌరవిస్తోంది. స్త్రీలు అణచివేయబడుతున్నారని ఈ విషయాన్ని గమనించి స్త్రీల అభివృద్ధికి రాజ్యం నిర్వహించాల్సిన కర్తవ్యాలను సూచించింది. ఆర్టికల్ 15(3) ప్రకారం స్త్రీల అభి వృద్ధి ఉన్నతికి రాజ్యంప్రత్యేక చట్టాలు చేయవచ్చు. ఆర్టికల్ 39(బి) ప్రకారం సమాన వేతనం చెల్లించాలి. ఆర్టికల్39(ఎ) ప్రకారం స్త్రీ పురుషులకు సమాన జీవనఉపాధి కల్పించాలి. ఆర్టికల్ 39(సి) ప్రకారం స్త్రీ పురుషుల కార్మికుల ఆరోగ్య శక్తి పరిరక్షణకు కృషిచేయాలి. ఈ రెండు ఆదేశిక సూత్రాలు 15ఎ (ఈ) ప్రకారం స్త్రీ గౌరవ పరిరక్షణకు ప్రతి పౌరుడు కృషి చేయాలి. భారతదేశంలో ప్రతి విషయంలో రాజకీయాలు చోటు చేసుకోవడం ద్వారా అభివృద్ధి కుంటుపడుతుంది. మహిళలకు సమానత్వం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను ఇచ్చేందుకు స్వాతంత్రోద్యమ కాలంలో బీజాలు పడ్డాయి. సంఘ సంస్కర్తలు మహిళలకు కూడా అన్నిరంగాల్లో అర్ధభాగం ఇవ్వాలని సూచించారు. చేతిరాత తలరాతల్లో కూడాసమాన అవకాశాలు లేకుండాపోయాయి. సకల ఆచారాలు, మతాల్లోనూ పితృస్వామిక భావజాలం కారణంగామహిళలకు రెండవ స్థానాన్ని కల్పించబడింది. నేటికి కూడా 33 శాతం రిజర్వేషన్ అమలు కాకపోయింది అనేది నగ్నసత్యం. మహిళా దినోత్సవం పేరు వింటానికి బాగుంటుంది. ఆ ఒక్కరోజు మహిళలను గౌరవించినంత మాత్రాన సరిపోదు. మహిళ మంచికి మమతలకు నెలవు. తనకు ఎన్ని బాధలున్నా నలుగురిలో ఎంతో గుంభనంగా ఉంటుంది. అహర్నిశలూ తన కుటుంబం కోసమే పాటుపడుతూ ఉంటుంది. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎన్నో విజయాలను చవిచూస్తోంది. ఆకాశంలో సగం మీదేనంటారు. అవనిలో చోటే లేకుండా చేస్తారు. ఇటీవల జరిగిన ఉదంతాలను చూస్తే మహిళలకు అసలు రక్షణ ఉందా! అనిపిస్తుంది. ఏటికేళ్ళు దొర్లిపోతూనే ఉంటాయి. మహిళల పరిస్థితిలో మార్పు మాత్రం ఇసుమంత కూడా కనిపించదు. మరిక మహిళా దినోత్సవ స్ఫూర్తి ఎక్కడికి పోతోంది. ఈ పరిస్థితి ఒక్క మనదేశంలో మాత్రమే కాదు. ప్రపంచ దేశాలన్నిటా ఇదే పరిస్థితి. మహిళా దినోత్సవం పేరుతో మహిళలు అన్ని రంగాల్లో సాధించిన విజయాలను చెప్పుకుని పొంగిపోవడంతో సరిపెట్టేసుకుంటే కుదరదు. అసలైన హక్కుల సాధనకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యమించాలి. మగువలపై వివక్షను తొలగించేందుకు అంతర్జాతీయ స్థాయిలో ఆలోచించాలి. స్థానిక ప్రాంతాల నుంచి పోరాటాలను చేపట్టాలి. లింగవివక్షకు వ్యతిరేకంగా కార్యాచరణ చేపట్టాలని ప్రతి మహిళా దినోత్సవాన నాయకులంతా ప్రతిజ్ఞ చేస్తారు. ఇది ఎంతవరకు అమలు జరిగింది ఎవరికి వారే ప్రశ్నించుకోవాలి! ఈ మాటలు, ఈ చేతలు ఒక్క మహిళా దినోత్సవానికే పరిమితమైతే మహిళల దుస్థితి ఎప్పటికీ మారదు! ఈ పోరాటం ఇంటినుంచే ప్రారంభం కావాలి. తమకు సరైనవిలువ, గౌరవం ఇవ్వాలనే డిమాండ్ తీసుకురావాలి. హక్కుల్ని సాధించుకోవడమే కాదు, చట్టసభల్లో సగం స్థానాలు సంపాదించుకునే స్థాయికి మహిళలు ఎదగాలి. రోజురోజుకు స్త్రీలపై హింస రకరకాల రూపంలో పెరిగిపోతూఉంది. ఇలాఎందుకు జరుగుతుంది? ముందు తరాల వారికి హింసలేని సమాజాన్ని అందించలేమా? ఏదిఏమైనా మహిళల ఆలోచనల్లో ఎదగాలన్న తపన రావాలి. వారిని అన్నివిధాల ప్రోత్సహించే బుద్ధి మగవాళ్లకురావాలి, మహిళలకు పూర్తిభద్రత కలిగించేలా చట్టాలని మార్చాలి. మగవారితో సమానంగా ప్రతి అవకాశం మహిళలకు దక్కాలి. ●

వాయిస్ గళ్ల నుంచి గ్రంథాలయాలకి
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
8-3-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 35 పేజీలు: 10+4 వెల: 6.50

నడి సముద్రంలో మునిగిపోయిన కూలీలు 2
కరెంటు షాక్‌తో ఇద్దరు రైతులు మృతి 6

## 12 నుంచి అసెంబ్లీ



### 15న బడ్జెట్ సమర్పణ
### 27 దాకా సమావేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి7:** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్ అయింది. ఈనెల 12వ తేదీన ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తొలి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించనున్నారు. ఆయన ప్రసంగంపై రెండు రోజుల పాటు ధన్యవాద తీర్మానం,చర్చ జరుగనుంది. 15వ తేదీన బడ్జెట్ ప్రతిపాదనల ప్రసంగం ఉండనుంది. 16వ తేదీన అసెంబ్లీకి సెలవు ప్రకటించనున్నారు. తర్వాత 17వ తేదీ నుంచి 27 వరకు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. ఆఖరు రోజు ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించనున్నారు.
ఈసారి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడంతో పాటు బీసీ కులగణనపై చట్టం తెచ్చేందుకు ఆమోదం తెలుపనున్నారు. ఈసారి కూడా బడ్జెట్ సెషన్‌లో పలు ఆర్డినెన్స్‌లు బిల్లుల రూపంలో రానున్నాయి. నూతనంగా పలు బిల్లులను ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి సంబంధించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సెషన్ సమ్మనింగ్ నోటిఫికేషన్ జారీ చేశారు.

రూ.1000 కోట్లతో హ్యామ్ పద్ధతిలో రోడ్ల విస్తరణ 7లో

# దక్షిణాదిపై ప్రతీకారమా?

## పునర్విభజన ఆయుధాన్ని ఎంచుకొన్న బిజెపి

### కేంద్రం ఆదేశాలే అమలు చేశాం.. అయినా మాపై కక్ష ఎందుకు?

### 1971 లెక్కల ప్రకారం నియోజకవర్గాలను విభజించండి

### ఢిల్లీలో ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో సిఎం రేవంత్



శుక్రవారం ఢిల్లీలో ఓ టివి ఛానల్ ఇంటర్వ్యూలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి7:** డీలిమిటేషన్ అంశంపై తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవడానికే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నియోజకవర్గాల పునర్విభజన చేపడుతోందని విమర్శించారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌పై తమిళనాడు నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం అవుతున్న వేళ 'ఇండియా టుడే' నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో రేవంత్ రెడ్డి శుక్రవారం మాట్లాడారు.
మరో 30 సంవత్సరాలు డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేయాలని, అప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ఏ విధంగా పెరుగుతుందో చూడాలని అన్నారు. దక్షిణాదిలో బిజెపికి తగిన ప్రాతినిధ్యం లేదని రేవంత్‌రెడ్డి అన్నారు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ ఆ పార్టీ సాధించిన 240లో దక్షిణాదిలోగెలిచింది కేవలం 29 స్థానాలే, దక్షిణాదిలోని ఏ ఒక్క రాష్ట్రంలో కూడా బిజెపి అధికారంలో లేదని గుర్తు చేశారు. ఎపిలో జూనియర్ భాగస్వామిగా ఉందని తెలిపారు. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలని బిజెపి భావిస్తోందని వెల్లడించారు. ఉత్తరాది రాష్ట్రాలకు మేలు చేకూర్చేలా డీలిమిటేషన్‌కు సిద్ధమవుతోందని తెలిపారు.
దక్షిణాదిపై ప్రతీకారం తీర్చుకునేందుకే నియోజక వర్గాల పునర్విభజన అనేఆయుధాన్ని బిజెపి ఎంచుకుందని వ్యాఖ్యానించారు. దక్షిణాది ప్రాతినిధ్యాన్ని తగ్గించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని తప్పుపట్టారు. కుటుంబ నియంత్రణ చేపట్టాలని ఎవరు ఆదేశించారు. కుటుంబ నియంత్రణ వచ్చాకే మేం ఇద్దరం.. మాకుఇద్దరం నినాదాలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇస్తే దక్షిణాది అమలు చేసిందని, ప్రభుత్వం చెప్పింది చేస్తే మాపై ప్రతీకారం తీర్చుకుంటారా.? అని ప్రశ్నించారు. శుక్రవారం ఢిల్లీలో ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన >>7



### ముద్రా యోజన రుణాలు రూ. 32 లక్షల కోట్లు -ప్రధాని మోడీ

**సూరత్, మార్చి 7:** ఎంఎస్‌ఎంఇ రంగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ముద్రా యోజన కింద రూ.32 లక్షల కోట్ల రుణాలను ఇచ్చామని ప్రధాని మోడీ పేర్కొన్నారు. సున్నా సీట్లు వచ్చినవారు ఇందులో ఎన్ని సున్నాలు ఉంటాయో లెక్కించలేరంటూ విపక్షాలు ప్రత్యేకించి కాంగ్రెస్ పార్టీపై ప్రధానిమోడీ మరోసారి విమర్శలతో ధ్వజమెత్తారు. >>7



### నేడు ప్రజాభవన్‌లో అన్ని పార్టీల ఎంపీలతో ప్రభుత్వం భేటీ

### కేంద్రం వద్ద పెండింగ్‌లోని అంశాలపై చర్చ

### కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్‌కి డి. సిఎం భట్టి ఫోన్

# రండి.. కేంద్రంపై ఒత్తిడి తెద్దాం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి7:** కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఒత్తిడి తెచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ముఖ్యమంత్రికి రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులను కలిసి మూసీ పునరుజ్జీవనం, మెట్రో విస్తరణ, ఆర్‌ఆర్‌ఆర్ తదితర అంశాలపై విన్నవించారు. నిధులు, అనుమతుల కోసం ప్రధాని, మంత్రులను కలిసి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ సరైన స్పందన రావడం లేదని ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. దీంతో పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల సాధనకు పార్లమెంట్‌లో ఎంపీలు ప్రస్తావించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యూహరచన చేస్తోంది. గురువారం కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత సిఎం, మంత్రులు ఈ అంశంపై చర్చించి అన్ని పార్టీల ఎంపీలను కలుపుకొని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రజాభవన్‌లో శనివారం అన్ని పార్టీల ఎంపీల సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది.
కేంద్రంలో పెండింగ్ సమస్యల సాధన ఎజెండా కేంద్ర ప్రభుత్వం వద్ద రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీల ఎంపీలతో రాష్ట్ర ప్రభుత్వం సమావేశం నిర్వహిస్తోంది. రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం వద్ద అపరిష్కృతంగా ఉన్న రాష్ట్రానికి సంబంధించిన వివిధ సమస్యలపై చర్చించనున్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఎంపీలు రాష్ట్రం పక్షాన పార్లమెంట్‌లో, కేంద్ర ప్రభుత్వం వద్ద మాట్లాడాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రయత్నం చేస్తుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు రాష్ట్రానికి సంబంధించిన ఎంపీలందరిని శుక్రవారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్వయంగా ఫోన్ చేసి సమావేశానికి ఆహ్వానించారు.
**ఉద్యోగుల పెండింగ్ బిల్లులు త్వరితగతిన చెల్లిస్తాం: డి. సిఎం భట్టి**
ప్రభుత్వ ఉద్యోగులు వారి బకాయిల కోసం తిరగాల్సిన పనిలేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పది వేల కోట్ల బకాయిలను చెల్లించామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు >>7



### పునర్విభజన, త్రిభాషా విధానంపై ఉమ్మడి పోరు


### 22న చెన్నైలో జెసి భేటీ

### తమిళ సిఎం స్టాలిన్ పిలుపు

**చెన్నై, మార్చి 7:** త్రిభాషాసూత్రం అమలు, జాతీయ కొత్త విద్యావిధానంపై బిజెపియేతర రాష్ట్రాలతో కలిసి సమష్టి పోరాటానికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ పిలుపునిచ్చారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ,పశ్చిమబెంగాల్; పంజాబ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులతోపాటు ఒడిశా బిజెడి అగ్రనేతలను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. ఒకసంయుక్త కార్యాచరణ కమిటీ (జెఎసి)గా ఏర్పడాలని, చెన్నైలో ఇందుకోసం ఈనెల 22వ తేదీ ఆరంభ సమావేశం నిర్వహిం >>7

### సచివాలయంలో కాంట్రాక్టర్ల ధర్నా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి7:** తమకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టర్లు సచివాలయంలో ధర్నాకు దిగారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన సుమారు 200 మంది కాంట్రాక్టర్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసేందుకు శుక్రవారం మధ్యాహ్నం సచివాలయానికి వచ్చారు. డిప్యూటీ సీఎంను కలిసేందుకు ఆయన సెక్యూరిటీ సిబ్బందితో పాటు సచివాలయం సెక్యూరిటీ బాధ్యతలు చూసే ఎస్పీఎఫ్ సిబ్బంది ఒప్పుకోలేదు. తమలో కొందరినైనా డిప్యూటీ సీఎంతో కలిపించండి అని వేడుకున్నా సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో విసుగెత్తిన కాంట్రాక్టర్లు ఆయన >>7



శుక్రవారం ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో బిఆర్‌ఎస్ నేతలతో కెసిఆర్ సమావేశం దృశ్యం

## 21 మంది ఐపిఎస్‌ల బదలీ



### అదనపు డిజి (పర్సనల్)గా అనిల్ కుమార్, ఇంటెలిజెన్స్ ఐజిగా శ్రీనివాసులు

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరోసారి భారీగా ఐపిఎస్ అధికారులు బదలీ అయ్యారు. కొన్ని రోజులుగా ఐపిఎస్‌ల బదలీపై ఊహాగానాలు వస్తుండడం తెలిసిందే. అయితే ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా పడగా కోడ్ ముగియడంతో శుక్రవారం నాడు మొత్తం 21 మందిని బదలీ చేస్తూ సర్కారు ఆ దేశాలు జారీ చేసింది. సీనియర్ ఐపిఎస్ అధికారి అదనదపు డిజి హోదాలో వున్న అనిల్ కుమార్‌ను పర్సనల్ విభాగానికి బదలీ చేయగా ఆయనకు ఎస్‌పిఎఫ్ విభాగం బాధ్యతలు కూడా అప్పగించారు. రామగుండం సిపిగా వున్న శ్రీనివాసులును ఐజిగా పదోన్నతిపై ఇంటెలిజెన్స్‌లో నియమించారు. వరంగల్ సిపిగా పదోన్నతిపై సూ ర్యాపేట్ ఎస్‌పిగా వున్న సన్‌ప్రీత్ సింగ్ నియమితులయ్యారు. నిజామాబాద్ సిపిగా నార్కోటిక్ విభాగంలో వున్న సాయి చైతన్య నియమితులు కాగా, వరంగల్ సిపిగా వున్న అంబర్ కిశోర్ ఝా రామగుండం సిపిగా బదలీ అయ్యారు. >>7

## 10న గ్రూప్-1 ఫలితాలు

### 11న గ్రూప్-2, 14న గ్రూప్-3

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) గుడ్ న్యూస్ చెప్పింది. గ్రూప్-1, 2, 3 ఫలితాల ప్రకటన తేదిలను ప్రకటించింది. ఈ నెల 10న గ్రూప్-1 ఫలితాలను విడుదల చేయనుంది. గ్రూప్-1 మెయిన్స్‌కి హాజరైన అభ్యర్థికి వచ్చిన ప్రొవిజనల్ మార్కుల జాబితాను ఈ నెల 10న టిజిపిఎస్‌సి ప్రకటించనుంది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 563 గ్రూప్-1 పోస్టులభర్తీకి నిర్వహించిన మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తయింది. దీంతో అభ్యర్థులు వాటిలో సాధించిన ప్రొవిజనల్‌మార్కుల జాబి >>7

## ఎమ్మెల్సీ బరిలో బిఆర్‌ఎస్ నుంచి ఇద్దరు

### పరిశీలనలో ప్రవీణ్ కుమార్, దాసోజు శ్రవణ్ పేర్లు

### ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో పార్టీ నేతలతో కెసిఆర్ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి7:** ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులను బరిలో దింపేందుకు బిఆర్‌ఎస్ సన్నద్ధమవుతోంది. ఈమేరకు రిటైర్డ్ ఐపిఎస్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, దాసోజ్ శ్రవణ్ పేర్లను ప్రధానంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈమేరకు శుక్రవారం ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో బిఆర్‌ఎస్ నేతలతో కెసిఆర్ సమావేశం అయ్యారు. సమావేశానికి కెటిఆర్, హరీష్, కవిత, పద్మారావు హాజరయ్యారు. నిరంజన్ రెడ్డి, తలసాని శ్రీనివవాస్ యాదవ్, జగదీశ్వర్ రెడ్డి, పువ్వాడ అజయ్ కూడా కెసిఆర్‌తో భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై చర్చించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలకు కెసిఆర్ దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ఏప్రిల్ 27న బిఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారీ బహిరంగ సభకు కెసిఆర్ ప్లాన్‌చేశారు. ఏప్రిల్ 10న హైదరాబాద్‌లో బిఆర్‌ఎస్ ప్రతినిధుల సమావేశం ఉంటుంది. సిల్వర్ జూబ్లీపేరుతో వరంగల్‌లో బహిరంగ సభకు ప్రణాళికలు వేస్తున్నట్లు సమాచారం. ఇక చాలా రోజుల తర్వాత గులాబీ బాస్ కెసిఆర్ అసెంబ్లీ బడ్జెట్‌సమావేశాలకు హాజరవుతున్నారు. గత బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్ >>7

# 12 ప్రదేశాలు గుర్తింపు!



డాగ్స్‌తో టన్నెల్‌లోకి వెళ్తున్న బృందం

### ఆ ప్రాంతాల్లో మృతదేహాలున్నట్లేనా?

### టన్నెల్‌లో కెడావర్ డాగ్స్‌తో సాగుతున్న అన్వేషణ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి మార్చి7, ప్రభాతవార్త:** ఎస్‌ఎల్‌బిసి టన్నెల్‌లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. 14వ రోజు రెస్క్యూ బృందాలకు ఖచ్చితమైన ఆచూకీ లభించకపోవడంతో మరింత ఆందోళన నెలకొన్నది. ఉదయం 11.25 గంటలకు నలుగురు సభ్యులతో కూడిన అన్వి రోబోటిక్ నిపుణుల బృందంతోపాటు ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ బృందం టన్నెల్‌లోకి వెళ్లారు. టన్నెల్‌లోపల ఇప్పటికే కనిపించకుండా పోయిన కూలీలను అన్వేషిస్తున్న క్యాడవర్ శునకాలు గురువారం ఒకసారి టన్నెల్ లోపల పరిసరాలను పరిశీలించివచ్చిన రోబోటిక్ నిపుణులు, ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ మరోమారు పరిస్థితులను గమనించి రోబోల సాయం తీసుకున్నారు. అన్వీ రోబోటిక్ హైదారాబాద్ బృందం బయట ఉండి ఎప్పటికప్పుడు మొబైల్ ద్వారా సమాచారం తెలుసుకొని పనిచేస్తున్న సిబ్బందికి అవసరమైన సహకారం అందిస్తున్నారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ కార్యదర్శి అరవింద్ కుమార్ టన్నెల్ లోపల బ్యాటరీ సమస్య, రోజ్ కట్టర్ అవసరమని సంక్షిప్త సమాచారం అందిన వెంటనే డిజాస్టర్ మేనేజ్మెంట్ కార్యదర్శి అరవింద్ >>7

## వివేకా హత్య కేసు: ప్రధాన సాక్షి రంగయ్య అనుమానాస్పద మృతి

**పులివెందుల ,మార్చి 7,ప్రభాత వార్త :** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసులో ప్రధానసాక్షిగాఉన్న వాచ్‌మాన్ రంగయ్యఅనే వ్యక్తి అస్వస్థతతో చికిత్సపొందుతూ బుధవారం సాయంత్రం రిమ్స్‌లో మరణించడం జరిగిందని, బుధవారం మధ్యాహ్నం సమయంలో అస్వస్థతకు గురి కావడంతో పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లడం జరిగిందని అక్కడినుండి మెరుగైన చికిత్సకోసం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని వైఎస్‌ఆర్ కడప జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ మీడియాకు తెలిపారు.
మీడియాతో ఆయన మాట్లాడుతూ వాచ్‌మాన్ రంగయ్య మృతిపై రంగయ్య భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి గా కేసు నమోదుచేశామని ఎస్.పి తెలిపారు. వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ప్రధాన సాక్షి మరణించడం హై ప్రొఫెషనల్ మర్డర్‌గా మేము భావిస్తున్నామనీ రంగయ్య మరణం వెనుక ఎవరి ప్రమేయం ఉన్నదా అన్న అనుమానంతో అన్ని కోణాల్లో దర్యాప్తు చేయడం కోసం ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. మాజీమంత్రి వివేకా హత్య కేసులో భాగంగా 2014 సం. నుండి 2024 మధ్య హత్య కేసులోని 6 మంది ప్రధానమైన సాక్షులు చనిపోవడం జరిగింది. 2019లో శ్రీనివాస రెడ్డి, శంకర్ రెడ్డి, 2022లో >>7

## ఆర్టీసి సిబ్బందికి 2.5% డిఎ

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఆర్‌టిసి ఉద్యోగులకు ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా శుభవార్త తెలిపింది. సంస్థ ఉద్యోగులకి 2.5 శాతం డిఏను ఇవ్వనున్నట్టు ప్రకటించింది. డిఎ ప్రకటనతో ప్రతి నెల ఆర్‌టిసిపై రూ.3.6 కోట్లు అదనపు భారం పడుతుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళా దినోత్సవం(మార్చి8) నుండి అమలులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. మహిళా సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తున్న నేపథ్యంలో.. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా >>7

# మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలి




మంత్రి సీతక్కను సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త :** అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం యూసఫ్ గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం, ఎంటర్‌ప్రైజస్ అవరణలో జరిగిన మహిళా సాధికారత యాక్షన్ ప్లాన్ వర్క్‌షాప్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల కష్టానికి తగిన ఫలితం ఉండాలన్నదే మహిళా దినోత్సవ ఆవిర్భావానికి కారణంగా నిలిచింద న్నారు. భూగర్భం నుండి అంతరిక్ష రంగం వరకు అన్ని రంగాల్లో మహి ళలకు అవకాశాలు రావాలని మహిళల కష్టానికి తగిన ఫలితం దక్కినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం అన్నారు. మహిళలు ఎంత ఎత్తుకు ఎదిగిన వివక్షత కొనసాగుతూనే ఉందని, మహిళలు ఎమ్మెల్యేలు మంత్రులు ఐఎఎస్‌లు అయినా లైంగిక అసమానతలను ఎదుర్కొంటూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు మహిళలకు వ్యవసాయం, పరిశ్రమలు మాత్రమే ఉపాధి మార్గాలుకానీ ఇప్పుడు ఎన్నో రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, అయినా మహిళల పట్ల సమాజంలో చిన్న చూపు చూపు చూస్తు న్నా రన్నారు. ప్రతి రంగంలో మహిళల ప్రస్థానాన్ని, వారి స్థానాన్ని సమీక్షించడమే కాకుండాలింగ సమానత్వం విషయంలో ఐక్యరాజ్యసమితి నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంత మేర మనం చేరుకోగలుగుతున్నామో ఆవలోకనం చేసుకోవాలన్నారు. మహిళలకు సమా నత్వం, సమాన అవకాశాలు రావాలి లింగ అంతరాలను తుంచాలన్నారు. సమాజంలో సమా నత్వం శారీరకంగా మహిళలకు ఎన్నో ప్రతికూలతలు ఉన్నాయి వాటన్నిటినీ అధిగమించి మహిళలు మందంజ వేస్తున్నారన్నారు. మహిళల ప్రతికూలతలను దృష్టిలో ఉంచుకొని విధానాల రూపకల్పన జరగాలని, ఆ దిశలో ప్రజా ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టిందన్నారు. మహిళా సంఘాలు మహిళలకు ఆర్థిక రక్షణతో పాటు సామాజిక భద్రత కల్పిస్తున్నాయని, అన్ని రంగాల్లో మహిళలకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తోంది పెట్రోల్ పంపులు, ఆర్టీసీ అద్దె బస్సులను మహిళా సంఘాలకు కేటాయిస్తున్నామన్నారు.

మహిళా సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాముఏడాది అనుకున్న లక్ష్యాలకు మించి మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించా మన్నారు. రూ. 20వేల కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించుకుంటే రూ. 22 వేల కోట్ల వరకు రుణ సౌకర్యం కల్పించామన్నారు. అంతకు ముందు మంత్రి సీతక్క ఈ కార్యక్రమానికి హాజరైనన మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పారిశ్రామిక రంగంలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన పలువురు ప్రముఖులను మంత్రి సీతక్క సన్మానించారు.

# ఎస్ఎస్‌సి విద్యార్థుల హాల్‌టికెట్లు విడుదల

## వెబ్‌సైట్‌లో అందుబాటులోకి..

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి జరగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థుల హాల్‌టికెట్లను ఎస్ఎస్‌సి బోర్డు అధికారక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వాటిని పాఠశాలలకు సైతం పంపించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరక్టర్ ఎ.కృష్ణారావు తెలిపారు. రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకి పంపించామని డైరక్టర్ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవేళ యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తే.. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరు కావొచ్చని స్పష్టం చేశారు. ఈ నెల 21 నుంచి ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షలు ప్రారంభంకానుండగా.. ఏప్రిల్ 4 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. సైన్స్ పరీక్షను రెండు రోజులు నిర్వహిస్తున్నందున.. పార్ట్-1 ఫిజికల్ సైన్స్ పరీక్షను ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు.. పార్ట్-2 బయలాజికల్ సైన్స్ పరీక్షను కూడా ఇదే సమయంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షల కోసం రాష్ట్రంలో 2500 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 11,544 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల నుంచి 4.97 లక్షల మంది విద్యార్థులు ఎస్ఎస్‌సి పరీక్షలు రాయడానికి ఫీజును చెల్లించారు. విద్యార్థులు ఇప్పటి వరకు చదివిన పాఠశాలలకు దగ్గరలోనే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసినట్టు ప్రకటించారు.




పురస్కారాలు ప్రదానం చేస్తున్న జస్టిస్ శ్రావణ్‌కుమార్, జైళ్ల శాఖ డిజిపి సౌమ్యామిశ్రా

# మహిళా సాధికారతే ప్రపంచ సాధికారత

## హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రావణ్‌కుమార్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మార్చి 7, ప్రభాతవార్త:** మహిళా సాధికారతే ప్రపంచ సాధికారత అని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.శ్రావణ్‌కుమార్ అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళా పురోభివృదికి ఉద్దేశించిందని అన్నారు. అయన పేర్కొన్నారు శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై సృజన సాంస్కృతిక సాహిత్య సంస్థ సంస్థ చైర్మన్ అర్చన చౌదరీ, పూంజల రమ్యతేజ, పి.శశిసుధీర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సృజన జీవిత సాఫల్య పురస్కారం తెలంగాణ పారిశ్రామిక మౌలిక సంస్థ టి నిర్మలా జగ్గా రెడ్డి కి సృజన ప్రతిభా పురస్కారాలు సీనియర్ జర్నలిస్ట్ స్వప్నకు నటి ప్రీతి నిగంకి మహిళా క్రికెట్ కమిటీ సభ్యులు ధనలక్ష్మి మ్రకి, సామాజిక సేవా కార్యకర్త అర్చలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్( జైళ్ళు) సౌమ్య మిశ్రా తో కలసి సంస్థ పక్షాన జస్టిస్ శ్రవణ్ కుమార్ బహుకరించి మాట్లాడారు. వివిధ రంగాలకు చెందిన మహిళాలను ఎంపిక చేసుకొని సృజన సంస్థ వారిని గుర్తించటం అపురూపం అన్నారు. ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నినాదం స్త్రీ సమానత్వ పరిరక్షణ అని దీనిని పాటిద్దాం అని చెప్పారు. సౌమ్య మిశ్రా మాట్లాడుతూ సృజన సంస్థ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సేవారంగం లో చేస్తూన్న కృషి ప్రశంసనీయం అన్నారు. సంస్కృతిని కళలను కాపాడే వారిని గౌరవించడం ఉత్తమ సంస్కారం అన్నారు. సంస్థ స్థాపకురాలు అంజనా చౌదరి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సృజన సంస్థ 35 ఏళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు తో పాటు దేశ వ్యాప్తంగా భారతీయ నృత్య ప్రక్రియలు కు వేదిక కలిపిస్తోందని వివరించారు. వేదిక పై నాట్య గురువు కృష్ణ భారతి తమ అభినందన తెలిపారు తొలుత మాధవీ లత శిష్య బృందం ప్రదర్శించిన భరత నృత్య అంశాలు ఆకట్టుకున్నాయి. గొల్ల కృష్ణ వ్యాఖ్యానం సందర్భోచితంగా నిర్వహించారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సరేఖ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అంటే వంటింటి కుందేళ్ళు అని అనే వాళ్ళు... కానీ, నేడు ఈ ప్రపంచపు ప్రగతికి రథ చక్రాలు.మహిళా సాధికారత కోసం రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న తలంపుతో వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమాలను అమలు పరుస్తోందన్నారు. గతంలో మహిళా సంఘాలు అంటే స్వయం ఉపాధి. కాని ప్రజా ప్రభుత్వంలో మహిళా సంఘాలు అంటే పది మందికి ఉపాధి.మహిళను వ గౌరవించడం మన సంస్కృతి. అందుకే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. దాంతో ఆదా అయ్యే మొత్తాన్ని ఇతర అవసరాలకు ఖర్చు చేసుకునే వెసులు బాటు మహిళలకు కలిగింది. ఇప్పటివరకు సుమారు కొట్లాది మంది మహిళలు ఈ పథకం ఉపయోగించుకున్నారని తెలిపారు.

# సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

# 61 యేళ్లు దాటిన విఆర్ఎ వారసులకు విఎల్ఎ పోస్టుల్లో అవకాశం కల్పించాలి

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 61 సంవత్సరాలు దాటిన విఆర్ఎ వారసులకు.. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో నియమిస్తున్న విలేజ్ లెవల్ ఆఫీసర్ (విఎల్ఎ) పోస్టుల్లో అవకాశం కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జాన్‌వెస్లీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి 10,950 విలేజ్ లెవల్ అధికారుల (విఎల్ఓ)ను నియమించాలని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్టు లేఖలో పేర్కొన్నారు.

ఈ నియామకాల్లో అతితక్కువ వేతనాలతో తరతరాలుగా ప్రభుత్వానికి, ప్రజలకు సేవలం దిస్తూ 61 సంవత్సరాలు పైబడిన విఆర్ఎ వారసులకు కూడా అవకాశం కల్పించి, వారి కుటుంబాలను ఆదుకోవాలని లేఖలో కోరారు. 61 యేళ్లు పైబడిన విఆర్ఎ వారసులకు ఉద్యోగాలిస్తామని.. జిఒ నం 81, 85 లను 2023, జూలై, ఆగస్టు నెలల్లో గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిందని గుర్తు చేశారు. జిఒలు వచ్చి రెండేళ్లు కావస్తున్నా 61 సంవత్సరాల వయస్సు దాటిన 3,797 మంది విఆర్ఎ వారసులకు ఉద్యోగాలివ్వకుండా కాలయాపన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రి ఉద్యోగం కొడుకుకు తప్పకుండా వస్తుందనే ఆశతో, ఆస్తి పంపకాల్లో భాగంగా ఉన్న కొద్దిపాటి భూమి అన్నదమ్ములకు ఇచ్చారని.. భూమి లేనివారు లక్షలాది రూపాయలు వడ్డీలకు అప్పులు తెచ్చి ఇచ్చారని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం అప్పులు కట్టలేక, ఉద్యోగాలు రాక ఆర్థిక ఇబ్బందులతో, మనో వేదనతో వీరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని జాన్‌వెస్లీ లేఖలో గుర్తు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా వీరిపట్ల మానవతా దృక్పథంతో స్పందించి 61 సంవత్సరాల వయస్సు పైబడిన విఆర్ఎ వారసులకు.. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో నియమించబోయే విఎల్ఎ ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో జాన్‌వెస్లీ కోరారు.

# బిఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందంతోనే బిజెపి గెలిచింది

## దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి




**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌తో లోపాయికారీ ఒప్పందంతోనే బిజెపి ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలిచిందని దేవరకద్ర ఎమ్మెల్యే మధు సూదన్‌రెడ్డి వివరణ ఇచ్చారు. గాంధీ భవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణలో వచ్చే పదేండ్లు కాంగ్రెస్ అధికారంలోఉంటుందని ఆయన జోస్యం చెప్పారు. బండిసంజయ్, కిషన్‌రెడ్డిలు రెండు ఎమ్మెల్సీలుగెలువగానే మేమే తెలంగాణలో అధికారంలోకి వస్తామని పగటవి కలలు కంటున్నారని ఎద్దేవాచేశారు. లోకల్‌బాడీ ఎన్నికలలో రెండు సీట్లుకూడా రావని ఆయన అన్నారు. తెలంగాణకు నిధులు రాకుండా అడ్డుకుంటున్న ద్రోహులు కిషన్‌రెడ్డి బండిసంజయ్‌లు అని ఆయన దూషించారు,. ఎమ్మెల్సీ ఎన్నికలను మేం పట్టించుకోవడంలేదని మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మేం జీవన్‌రెడ్డిని అక్కడ నుంచి గెలిపించామని చరిత్రను గుర్తుచేసుకున్నారు. 2018లో 103స్థానాలలో డిపాజిట్లు కోల్పోయింది బిజెపి అని ఆయన ఎద్దేవాచేశారు. 2023లో 63స్థానాలలో డిపాజిట్లుకోల్పోయిందని వివరించారు. బిఆర్ఎస్ నేతలను కేసుల నుంచి కాపాడుతూ బిజెపి లబ్ది పొందుతోందని అన్నారు. తీన్మార్ మల్లన్న అన్ని అబద్దాలు మాట్లాడుతున్నారని ఆయన ఆరోపించారు. పబ్లిసిటికోసం లిక్కర్ డాన్ కవిత సిఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తుందని ఆయన అన్నారు.

# 42 శాతం బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

## ప్రభుత్వానికి ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, సుధాకర్ ముదిరాజ్ తదితరులు

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** స్థానిక సంస్థలు,విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లలో ప్రభుత్వం చిత్తశుద్ధితో 42శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కాచిగూడలో జరిగిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతంకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పెంచిన రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరిగే వరకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కుల గణన విషయంలో ప్రభుత్వం ఇప్పటివరకు సరైన విధానం అమలు చేయలేదని ఆరోపించారు. లోపభూఇష్టమైన విధానాలు అమలు చేయడం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వివిధ సందర్భాల్లో ప్రభుత్వ లెక్కల ప్రకారమే 4కోట్లకు పైగా జనాభా ఉంటే, ప్రభుత్వం ఇటీవల చేపట్టిన జనగణనలో మాత్రం 3కోట్ల 55 లక్షల మంది ఉన్నట్లు మాత్రమే తేల్చారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం రీసర్వే కూడా సరిగ్గా చేపట్టకపోవడంతో కేవలం 15 లక్షల మంది మాత్రమే తమ వివరాలు అందజేయడం జరిగిందన్నారు. ఏమాత్రం అవగాహన లేని ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ద్వారా, ఆన్లైన్ ద్వారా, టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కులగణన కుటుంబ సర్వే చేపడితే సర్వే ఫలితాలు తప్పుల తడకగా రాకపోతే ఇంకా ఏవిధంగా వస్తాయని ఆయన ప్రశ్నించారు. మొత్తం ప్రభుత్వ యంత్రాంగం, ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల ద్వారా కుటుంబ సర్వే చేపడితే ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేసేవారని, దీంతో సర్వే ఫలితాలు వందకు వంద శాతం కరెక్టుగా వచ్చేవని ఆయన పేర్కొన్నారు. అసలు కుటుంబ సర్వే చేపట్టడం ప్రభుత్వానికి ఇష్టం లేనట్టుగా చేపట్టడం వల్లే అనుకున్న ఫలితాలు రాలేదన్నారు.

# ఇంటర్ ఫస్టియర్ ఇంగ్లీష్ పరీక్షల్లో ఆరు మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బుధవారం(మార్చి 5) నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పేపర్-1 పరీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా 6 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. సూర్యాపేటలో ఒకటి, నాగర్ కర్నూల్ జిల్లాలో 5 కేసులు నమోదైనట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు రాష్ట్రంలో 96.87 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంగ్లీష్ పేపర్-1 పరీక్షకి 5,03,104 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 4,87,317 మంది హాజరయ్యారు. మరో 15,787 మంది(3.13శాతం) పరీక్షలకు హాజరు కాలేదు. శుక్రవారం జరిగిన పరీక్షలకి సెట్ ఏ పేపర్‌ను ఎంపిక చేశారు. ఇంటర్ బోర్డు నుంచి అబ్జర్వర్స్‌ను సూర్యాపేట, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, వికారాబాద్, మెదక్, హైదరాబాద్ జిల్లాలకు పంపించినట్టు బోర్డు కార్యదర్శి తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు హాల్‌టికెట్లలో క్యూఆర్ కోడ్‌ను అమలు చేయడంతో.. విద్యార్థులు సరైన సమయానికి పరీక్షా కేంద్రాలకు హాజరైనట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య తెలిపారు. హాల్‌టికెట్లపై క్యూఆర్‌కోడ్ ఎంతో ఉపయోగపడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారని తెలిపారు.

# ప్రతి రంగంలోనూ ఆధిపత్యాన్ని సాధిస్తోన్న మహిళలు

## ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సమాజంలో సగభాగమైన మహిళలు నప్రతిరంగంలోనూ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అన్నారు. మహిళా రత్న పురస్కార్-2025ని అందుకున్న శీతల్ చౌహాన్‌ను ఆయన శుక్రవారం తమ కార్యాలయంలో సన్మానించారు. ట్రాన్స్‌పోర్ట్ శాఖ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న శీతల్ చౌహాన్‌ను తెలంగాణ ఇంటెలెక్చువల్స్ ఫోరం ప్రతినిధులతో కలిసి సన్మానించారు. తెలంగాణ రాష్ట్రంలోప్రజా సేవ, రహదారి భద్రత, రవాణా నియంత్రణ రంగాల్లో శీతల్ చౌహాన్ విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు రాజ నారాయణ ముదిరాజ్, ఎండి అక్తర్ అలీ, జయసుధ, రవితేజ, నాగలక్ష్మీతో పాటు తెలంగాణ ఉన్నత విద్యామండలిమహిళా సిబ్బంది పాల్గొని, మహిళా సాధికారతకు ఇదొక గొప్ప గుర్తింపు అంటూ ప్రశంసలు కురిపించారు. మహిళా సాధికారతకు పురస్కారం ఇవ్వడం ఒక గుర్తింపని.. అది ప్రేరణ అన్నారు. మహిళలు ఏ రంగంలోనైనా అగ్రస్థాయికి ఎదిగేందుకు పురుషులు ప్రోత్సాహం అందించాలనీ, సమాన హక్కులు కల్పించాలని బాలకిష్టారెడ్డి పిలుపునిచ్చారు. పురస్కార గ్రహీత శీతల్ చౌహాన్ తెలంగాణ ఉన్నత విద్యామండలి, తెలంగాణ ఇంటెలెక్చువల్స్ ఫోరం సంస్థలకు కృతజ్ఞతలు తెలుపుతూ.. ఈ గౌరవాన్ని ప్రభుత్వ సేవలో త్యాగం చేస్తున్న ప్రతి మహిళా అధికారి, ఉద్యోగినికి అంకితం చేస్తున్నట్టు పేర్కొన్నారు. యువతులు ధైర్యంగా ముందుకు సాగాలని, సమాజ నిర్మాణంలో తమ పాత్రను గుర్తించుకోవాలన్నారు.

# ఇంటర్నేషనల్ ఒలింపియాడ్స్ క్యాంప్ సెలక్షన్స్‌లో నారాయణ జైత్రయాత్ర!

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్, భారతప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్‌కి, ఇంటర్నేషనల్ మ్యాథమ్యాటికల్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌కి అత్యధికంగా 65 మంది నారాయణ విద్యార్థులు ఎంపికయ్యారు. ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్ (ఓసిఎస్‌సి)లో భాగంగా ఆస్ట్రానమీ క్యాంప్‌కి 14 మంది, ఫిజిక్స్ క్యాంప్‌కి 9 మంది, జూనియర్ సైన్స్ క్యాంప్‌కి 9 మంది. జూనియర్ ఆస్ట్రానమీ క్యాంప్‌కి 7 మంది, కెమిస్ట్రీ క్యాంప్‌కి 7 మంది, బయాలజీ క్యాంప్‌కి 7 మంది కలిపి మొత్తంగా 53 మంది విద్యార్థులు ఎంపిక కాగా... ఇంటర్నేషనల్ మ్యాథమ్యాటికల్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్కి (ఓసిఎస్‌సి) 12 మంది, మొత్తంగా 65 మంది నారాయణ విద్యార్థులు ట్రైనింగ్ క్యాంపుకి అర్హత సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ డాక్టర్ సింధూర నారాయణ, శరణి నారాయణ తెలిపారు. ఇంటర్నేషనల్ ఒలింపి యాడ్స్ ట్రైనింగ్ క్యాంప్‌కి ఎంపికైన ప్రతి 4 గురు విద్యార్థుల్లో ఒకరు నారాయణ విద్యార్థి కావటం ఎంతో గర్వ కారణమని వారు పేర్కొన్నారు. ఓరియం టేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్ (ఐఎంఒటిసి)లో కఠినమైన దశలు పూర్తయిన అనంతరం భారత్ తరపున ఆయా ఒలింపియాడ్‌కి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఒక్క నారాయణ నుండే 65 మంది విద్యార్థులు ఎంపిక అవ్వటం ఎంతో సంతోషించదగ్గ పరిణామన్నారు. యావత్ భారతదేశంలోనే నారాయణ విద్యాసంస్థలు తప్ప మరే ఇతర సంస్థ ఇంతటి అత్యద్భుత విజయం సాధించలేదన్నారు. రాష్ట్రస్థాయిలో అయినా, జాతీయస్థాయిలో అయినా పోటీ పరీక్ష ఏదైనా నెం.1 స్థానాన్ని నారాయణ విద్యార్థులే కైవసం చేసుకోవటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్స్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచానికి ధీటుగా నారాయణ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు తెలి పారు. సబ్జెక్ట్ బేసిక్స్‌పై స్ట్రాంగ్ ఫౌండేషన్‌తోపాటు ఫండమెంటల్స్ కూడా సమగ్ర అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# కరెంట్ షాక్‌తో ఇద్దరు రైతులు మృతి


**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** పంట రక్షణకోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు యమ పాశం అయ్యాయి. పంటను కాపాడుకోవాలని అన్నదాతలు చేసిన ప్రయత్నం వారి పాలిట మృత్యువు దేవతగా మారింది. తమ పంటలను కాపాడుకోవడానికి పంట చుట్టూ విద్యుత్ తీగలతో కంచె ఏర్పాటు చేస్తుండగా అన్నదమ్ములు ఇద్దరూ మృత్యువాత పడ్డారు. ఈ విషాద ఘటన తెలంగాణాలోని సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం గోవింద్‌పూర్‌లో విషాదం చోటు చేసుకుంది. అడవి పందుల నుంచి పంట రక్షణ కోసం పొలం చుట్టూ ఇనుప తీగ వేసి విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా విద్యుదాఘాతంతో ఇద్దరు అన్నదమ్ములకు చెందారు. గోవింద్‌పూర్‌కు చెందిన ఎరుకల జగన్ (48), ఎరుకల మల్లేశం (44) వ్యవసాయంతో పాటు, తాపీ మేస్త్రీలుగా పని చేస్తూ జీవిస్తున్నారు. పొలంలో చెరకు, ఇతర పంటలను అడవి పందులు తరచూ ధ్వంసం చేస్తున్నాయి. పంటలను కాపాడుకునేందుకు గురువారం రాత్రి ఇద్దరూ పొలానికి వెళ్లి చుట్టూ ఇనుప తీగ ఏర్పాటు చేశారు. పొలం మీదుగా వెళుతున్న 32/11 కేవీ విద్యుత్తు తీగల నుంచి ఇనుప కంచెకు కనెక్షన్ ఇచ్చేందుకు యత్నిస్తుండగా ఇద్దరూ విద్యుదాఘాతానికి గురయ్యారు. జగన్, మల్లేశం పొలంలోనే ప్రాణాలు విడిచారు. అటుగా వెళ్లిన రైతులు ప్రమాదాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# 19 నెలల పాపపై వీధికుక్కల దాడి

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** నగరంలో వీధి కుక్కల దాడులు తీవ్రరూపం దాల్చడం కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం నగరంలోని కమలా నగర్‌లో వీధి కుక్క ఓ 19 నెలల చిన్నారి లక్ష్మిపై దాడిచేయడంతో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రులో చేరింది. అయినా జిహెచ్‌ఎంసి అధి కారుల్లో చలనం లేకుండా పోయింది. జిహెచ్‌ఎంసి అధికారులు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి సంఘటన స్థలంలో ఉన్నటువంటి కుక్కలన్నిటి పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానికులు కోరు తున్నారు. వీధికుక్కలను సుదూర ప్రాంతాలకు తరలించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని గోల్నాక కార్పొ రేటర్ శ్రీమతి దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ అధికారులను కోరారు.

# వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్‌గా సన్‌ప్రీత్‌సింగ్

## ప్రస్తుత కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా రామగుండం సిపిగా బదలీ



సన్‌ప్రీత్‌సింగ్

**వరంగల్ బ్యూరో, ప్రభాతవార్త:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్‌గా సన్‌ప్రీత్‌సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారిచేసింది. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సన్‌ప్రీత్ సింగ్ 2011 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందినవారు. 2012 సంవత్సరంలో ములుగు ఎఎస్పీ, వరంగల్ రూరల్ ఓఎస్‌డిగా పనిచేశారు. అనంతరం ఎల్‌బి నగర్ డిసిపిగాను, ఎస్పీగా జగిత్యాలలో పనిచేశారు. ప్రస్తుతం పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా రామగుండం పోలీస్ కమిషనర్ బదలీ అయ్యారు.

# పిహెచ్‌సిల్లో 24 గంటలు వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి

## ఒఆర్ఎస్‌తోపాటు ఇతర మందులు అదుబాటులో పెట్టుకోవాలి

## జిల్లా వైద్యాధికారులను ఆదేశించిన పబ్లిక్ హెల్త్ డైరెక్టర్

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వేసవి ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పిహెచ్‌సి) వైద్యాధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ బి రవీందర్ నాయక్ జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా వైద్యాధికారులతో ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. 24 గంటలూ జిల్లా ప్రధాన కార్యాలయంలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్(ఆర్ఆర్‌టి) అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది అయిన ఆశా, ఏఎన్ఎం వంటి వారు అందుబాటులో ఉండేలాగా.. ఓఆర్ఎస్ సాచెట్ల లభ్యతను నిర్ధారించుకొని వాటిని అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. పిహెచ్‌సిలలో అందుబాటులో ఉన్న అవసరమైన మందులు ఐవి ద్రవాల నిల్వలను తనిఖీ చేసుకోవాలన్నారు.

రోజువారీగా నివేదించబడే వేడి సంబంధిత అనారోగ్య (హెచ్ఆర్ఐ) కేసుల డేటా సేకరించుకోవాలన్నారు. సాధారణ ప్రజలకు అధిక వేడి వలన కలిగే అనారోగ్యాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేనప్పటికీ, అత్యవసర పరిస్థితుల్లో జనరేటర్లు వంటి విద్యుత్ బ్యాకప్ వనరులను పరిశీలించుకోవాలన్నారు. అన్ని క్లినికల్ సంస్థలలో అగ్నిమాపక భద్రతా చర్యలను పరిశీలించాలన్నారు. అన్ని క్లినికల్ సంస్థలలో అగ్నిమాపక భద్రతా పరికరాలు అమర్చారో లేదో పరిశీలించాలని.. విద్యుత్ ఆడిట్ చేయాలని సూచించారు. అన్ని క్లినికల్ సంస్థలలో అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్స్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ డిఎంహెచ్‌వోలను ఆదేశించారు.



ఉద్యోగ నియామకపత్రాలు ఇప్పించాలని కోరుతూ డా.చిన్నారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు

# హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల సమస్యలు త్వరలో పరిష్కారం

## ప్రజావాణి ఇన్‌చార్జి డా.జి.చిన్నారెడ్డి

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 7, ప్రభాతవార్త:** టిజిపిఎస్సీ ద్వారా ఎంపికైన హాస్ట ల్ వెల్ఫేర్ ఆఫీసర్ల సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయని ప్రజావాణి ఇన్‌చార్జి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి తరలివచ్చిన హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఈ మేరకు చిన్నారెడ్డిని కల్సి వినతిపత్రం అందించి తమకు ఉద్యోగ నియామకపత్రాలను ఇప్పించాలని కోరారు. స్పందించిన చిన్నారెడ్డి వెంటనే టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోసల్ కు ఫోన్‌చేసి మాట్లాడారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని నికోలస్ చిన్నారెడ్డికి వివరించారు. అలాగే సంగారెడ్డి జిల్లా అమీర్‌పూర్ మండలం పటేల్ గూడా పంచాయతీ అక్రమ లేఅవుట్‌లోని 112 ప్లాట్లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆ కాలనీవాసులు శుక్రవారం చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేసారు. కలెక్టర్‌కు ఫోన్‌చేసి వారిని ఆదుకోవాలని చిన్నారెడ్డి సూచించారు.

### ప్రజావాణిలో అందిన దరఖాస్తులు 346

శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 346 దరఖాస్తులు అందాయి. డా.జి. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.



శుక్రవారం దాద్రి-నాగర్ హావేలిలో ఓ ఆస్పత్రిని ప్రారంభించి విగ్రహం వద్ద అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

# 12 ప్రదేశాలు గుర్తింపు!

>> కుమార్ లోకో మోటర్‌లో పంపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ తో కలిసి సహాయక చర్యలను ముమ్మరం చేశారు.

**12 ప్రదేశాలు గుర్తింపు**

ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో కార్మికుల అన్వేషణకు ఉదయాన్నే 7.15 గంటలకు టన్నెల్‌లోకి బయలుదేరారు. క్యాడవర్ డాగ్స్ బృందం, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలతో పాటు తవ్వేందుకు అవసరమైన అన్నిసామగ్రితో 110మందిని తీసుకొని లోకో మోటర్ పర్యవేక్షణకు డోగ్రా రెజిమెంట్ వెళ్లారు. క్యాడవర్ శునకాలు 15ఫీట్ల లోపల మృతదేహాలు మానవుల ఆనవాళ్లు ఉన్నా గుర్తించగలగటం వీటి ప్రత్యేకత. అన్వేషణ అనంతరం మధ్యాహ్నం 2.40 గంటలకు టన్నెల్ నుంచి తిరిగి బయటకు వచ్చాయి. కేరళ నుంచి తీసుకొచ్చిన కేడవర్ జాగిళాలు 12 ప్రదేశాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అక్కడ మృతదేహాలు ఉన్నట్లు రెస్క్యూ బృందం భావిస్తున్నది. అయితే గతంలో ఎన్జీఆర్ఐ గుర్తించిన ప్రదేశాలనే కేడవర్ డాగ్స్ కూడా గుర్తించినట్లు చెబుతున్నారు.ఇదిలా ఉండగా జాగిలాలు గుర్తించిన ప్రదేశాల్లో మృతదేహాలు ఉన్నట్లా అనేది కూడా బృందం సభ్యులు ఖచ్చితంగా తెలుపడం లేదు. మట్టిని తీసే కొద్దీ పెద్ద ఎత్తు బురద, నీరు నిరంతరంగా ఉబికి వస్తుండడంతో ఎక్కడి నుంచి అంత పెద్ద మొత్తంలో బురద వస్తుందో కూడా అంతుపట్టడం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే కన్వేయర్ బెల్టు ప్రస్తుతం 13,50 కిలోమీటరు వరకు పని చేస్తుండగా, 14వ కిలోమీటరు వరకు పని చేస్తే గంటకు 800టన్నుల మట్టిని బయటకు తోడే అవకాశం ఉంటుందని దాంతో కార్మికుల ఆచూకీ దొరకడం చాలా సులభం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# త్రిభాషా విధానంపై ఉమ్మడి పోరు

>> చాలని నిర్ణయం చారు. త్రిభాషా సూత్రాన్ని సమిష్టిగా ఎదుర్కొన్నా లని ఆయన సూచించారు. ముఖ్యమంత్రులు, పార్టీ సీనియర్ నేతలందరికీ ఆహ్వానం పలుకుతూ సిఎం స్టాలిన్ లేఖలు రాశారు. అలాగే పునర్విభజన కసరత్తుల్లో మనకే అన్యాయంజరుగుతుందని, జనాభా ఆధారంగా పునర్విభజన జరగాలని రెండు కీలకమైన ధృవ్యాలు ఆచరించాలని ఆయన కోరారు. 1971 జనాభా ఆధారంగానే పునర్విభజన జరగాలని ఆయన ముందునుంచి కోరుతున్న సంగతి తెలిసిందే. మొదటి అంశంగా ప్రస్తుతం ఉన్న 543 సీట్లను రాష్ట్రాలకు పునపంపిణీ జరగాలన్నారు. రెండోదశల మొత్తం సీట్ల సంఖ్యను 800కుపైగా పెంచాల్సిన అవసరం ఏర్పడుతుందని అన్నారు. ఈ రెండు కేటగిరీల్లోనూ అన్ని రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను తూచా తప్పకుండా ఆచరించినట్లయితే వారికి సీట్లు తగ్గుతాయి. ఒకవేళ కేంద్రం 2026 జనాభా ఆధారంగా పునర్విభజనచేస్తే దక్షిణాది, బిజెపియేతర రాష్ట్రాలకు నష్టం కలుగుతుందని హెచ్చరించారు. దక్షిణాది ఆందోళనపై కేంద్రం స్పష్టత ఇవ్వలేదని, అలాగే మన అనుమానాలను నివృత్తిచేసే చర్యలు కూడా చేపట్టలేదన్నారు. ప్రోరేటా పద్ధతిలో పునర్విభజన ఉంటుందని మాత్రంచెబుతున్నారని అయితే ప్రోరేటాకు బేసిస్ ఏంటన్నది కూడా చెప్పడంలేదన్నారు. పునర్విభజన పరంగా సీట్ల తగ్గితే ఏ ఒక్క రాష్ట్రం కూడా ఉపేక్షించదని అన్నారు. మన ప్రజాస్వామ్య పునాదులే కదిలిస్తున్న వేళ మనం ఇలాంటి కల్లబొల్లి హామీలను విశ్వసించగలమా అని అన్నారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించి బిజెపియేతర రాష్ట్రాల సీఎంలు, పార్టీ సీనియర్లతో సమావేశం నిర్వహించి సమిష్టివేదికపై పోరాటంసాగించాలని ఆయన కోరారు. మన ప్రతినిధులు ఎక్కడా దెబ్బతినకుండా ఒకేవేదికపైకి రావాలని ఏకీకృత నిర్ణయంతో పునర్విభజనను అడ్డుకోవాలని కోరారు. అలాగే బిజెపియేతర రాష్ట్రాలపార్టీలు కూడా తమ పార్టీ తరపున ఒక సీనియర్ ప్రతినిధి జెఏసికి పంపించాలని సమిష్టిగా వ్యూహం అమలుకు ఆయన సలహాలుసూచనలు ఎంతో కీలకం అవుతాయన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్యాయాన్ని సహించబోమన్నారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ, పశ్చిమబెంగాల్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాల పార్టీ నాయకులు ముఖ్యమంత్రులకు లేఖలు రాశారు. అలాగేపార్టీ అధినేతలు కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పశ్చిమబెంగాల్, ఒడిశా పంజాబ్ నేతలకు కూడా లేఖలురాసి సహకారం కాని పునర్విభజనను సమైక్యంగా అడ్డుకుందామని పిలుపునిచ్చారు. మొట్టమొదటి జెఏసి సమావేశం చెన్నైలో ఈనెల 22వ తేదీ నిర్వహించదలిచామని, పార్టీలు, సీఎంలు, ప్రతినిధులు అందరూ కూడా హాజరయి తమ అభిమతం, అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

# ఆర్టీసి సిబ్బందికి 2.5% డిఎ

>> ఆడబిడ్డల అభివృద్ధి తెలంగాణ ప్రగతిగా మహిళా దినోత్సవం(మార్చి 8) నుంచి ఇందిరా మహిళా శక్తి బస్సులను ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మండల మహిళా సమైక్య సంఘాల ద్వారా మొదటి దశలో 150 బస్సులు అద్దె ప్రాతిపదికన ఆర్‌టిసిలోకి.. తరువాత దశలో 450 బస్సులు కలిపి మొత్తం 600 బస్సులు మహిళా సంఘాల ద్వారా అద్దె ప్రాతిపదికన ఒప్పందం చేసుకోనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన బస్సులను శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారని తెలిపారు. రాష్ట్రంలో మహాలక్ష్మీ పథకం ప్రారంభించిన తరువాత.. ఇప్పటి వరకు 150 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని తెలిపారు. దాదాపు 5వేల కోట్ల విలువైన ప్రయాణాన్ని మహిళలు ఉచితంగా ప్రయాణం చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.



శుక్రవారం న్యూఢిల్లీలో సివిల్ సర్వీసు అధికారుల సమావేశంలో రాష్ట్రపతి ముర్ము

# రూ.1000 కోట్లతో హ్యామ్ పద్ధతిలో రోడ్ల విస్తరణ

## రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఒక హ్యామ్ రోడ్డు

## 60 నుంచి 100 కి.మీ. నిడివి కలిగిన రోడ్డు ఎంపిక

## హ్యామ్‌పై ఆర్ అండ్ బి శాఖ అధికారుల అంతర్మథనం

**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రప్రభుత్వం వెయ్యికోట్ల రూపాయలతో హైబ్రీడ్ యాన్యుటి మోడల్ పద్ధతిలో రోడ్లను విస్తరణ చేయడానికి కసరత్తును వేగవంతం చేసింది. రాష్ట్ర రోడ్లుభవనాలశాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో మహారాష్ట్రలో హ్యామ్ పద్ధతిలో అభివృద్ధిచేసిన రోడ్లను తెలంగాణ ఆర్‌అండ్‌బి అధికారులు వెళ్ళి పరిశీలించారు. మహారాష్ట్ర విధానం అధ్యయనం చేసిన ఇంజనీర్లు ఆ పాలసి విజయవంతమైందనే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రయోగాత్మకంగా సుమారు రూ.1000 కోట్లు కేటాయించి తెలంగాణల రాష్ట్రంలో మొదటి విడతగా హ్యామ్ విధానంలో రోడ్లు నిర్మించాలనే ఒక నిర్ణయం తీసుకొన్నట్లు తెలిసింది. నియోజకవర్గకు ఒక రోడ్డు కనీసం 60 నుంచి 100 కి.మీ నిడివితో ఉన్నది ఎంపిక చేసి రోడ్డు వేసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని రహదారులను మూడు విభాగాలు విభజించి హ్యామ్ పద్ధతిలో విస్తరణ చేసి అభివృద్ధి పరచాలని ఆర్‌అండ్‌బి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి ఉన్నారు. ముఖ్యమైన జిల్లా రహదారులు, ఇతర జిల్లాలను అనుసంధానం చేసే రహదారులు, రాష్ట్ర రహదారులు విభాగంలో సుమారు 10,550కిమి విస్తరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు. రెండోకేటగిరలో మండలకేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు,మండలం కేంద్రం నుంచి మరో మండల కేంద్రాలను కలిపే రోడ్లను అసలు రోడ్లు లేని చోట రెండు వరసల రోడ్డును నిర్మాణం చేయడానికి 1054కి.మి నిడివి గల రోడ్లను గుర్తించారు. మూడో కేటగిరిలో జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు నాలుగు వరసల రహదారులు సుమారు 820 కిమి నిడివితోఉన్నవి అభివృద్ధిచేయాలని భావిస్తున్నారు.

ప్రజల నుంచి వ్యతిరేకతపై అధికారుల్లో అంతర్మథనం హ్యామ్ పద్ధతిలో రోడ్డునిర్మాణం చేశాక టోల్‌చార్జీలు వసూలు చేయాల్సి ఉంటుంది ఇది ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుందని అధికారుల్లో అంతర్మథనం మొదలైంది.ఆర్‌అండ్‌బి మంత్రి హ్యామ్ రోడ్ల వల్ల మారుమూల మట్టి రోడ్లను అభివృద్ధిచేయాడనికి వీలవుతుందని ఆర్‌అండ్‌బి అధికారుల సమావేశంలో దిశనిర్ధేశించారు. అయితే హ్యామ్ విధానంలో నిధుల కేటాయింపు ఎలా ఉంటాయన్న దానిపై అధికారులతో పాటు ప్రజా ప్రతినిధుల నుంచి అనుమానాలు వస్తున్నాయి. రహదారుల నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఒకవేళ రహదారులను నిర్మించిన తర్వాత బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్(బూట్) లో భాగంగా టోల్ ప్లాజాలను ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తే స్థానికంగా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. జిల్లా, మండల స్థాయి రోడ్లపై టోల్ అంటే ప్రజల నుంచి స్పందన ఎలా ఉంటుందోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం హ్యామ్ విధానంలో 40 శాతం నిధులను ఐదు దశల్లో చెల్లించాలని ప్రతిపాదనలు చేసింది. మిగతా 60 శాతం నిధులను గుత్తేదారు సంస్థ భరించాల్సి ఉంది. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత 6 నెలలకోసారి గుత్తేదారు చేసిన ఖర్చును 15 నుంచి 20 ఏళ్ల మధ్య చెల్లించాలి లేదా బీవోటీ పద్ధతిలో టోల్ ప్లాజాలు ఏర్పాటు చేసుకుని వాహనదారుల నుంచి టోల్ వసూలు చేయాలి. ఈ మేరకు మహారాష్ట్రలో ఏ విధానాన్ని అవలంభించారో అదే రాష్ట్ర బృందం అధ్యయనం చేసింది.

# దక్షిణాదిపై ప్రతీకారమా?

>> ఇంటర్వ్యూలో పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కుటుంబ నియంత్రణ విధానానికి ముందైన 1971 లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేపట్టండని కేంద్రానికి సూచించారు. ఈ దేశంలో ప్రతి రాష్ట్రానికి కొన్ని హక్కులున్నాయి.. ఇది రాష్ట్రాల సమాఖ్య.. దక్షిణాదిలో బిజెపికి అధికారం లేదు.. ప్రాతినిధ్యం లేదు.. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది. కొత్త కొత్త మార్గాల ద్వారా దక్షిణాదిని శిక్షించే పనులు చేయకూడదన్నారు. దక్షిణాది రాష్ట్రాలే కాదు పంజాబ్ నుంచి మనీష్ తివారి ఏం చెబుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు నష్టమే. బీమారు (బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్) రాష్ట్రాలే ఎక్కువగా లబ్ధిపొందుతున్నాయని చెబుతున్నారని పేర్కొన్నారు. డిలిమిటేషన్‌తో పంజాబ్ కూడా లాస్ అవుతోంది.. బీమారు రాష్ట్రాలు లబ్ధి పొందుతాయి... ఉత్తరప్రదేశ్ లో 80 సీట్లు ఉంటే 50 శాతం పెంచాలనుకుంటే 120 అవుతాయి. తమిళనాడులో 39 సీట్లున్నాయి. 50 శాతం చొప్పున పెంచితే 60 వస్తాయి. ఇప్పుడు ఆ రెండు రాష్ట్రాల తేడా 40 సీట్లు ఉంటే ప్రోరేటా ప్రకారం చేస్తే 60 సీట్లు తేడా వస్తాయి. ఒక్క రాష్ట్రంలోనే ఇంత తేడా ఉంటే.. మిగతా రాష్ట్రాల పరిస్థితి ఏమిటి? దక్షిణాదిలో మొత్తం 126 ఉంటే 50 శాతం ప్రకారం పెరిగితే ఇంకో 60 నుంచి 62 సీట్లు గరిష్టంగా పెరుగుతాయి. 185 సీట్లతో మావి పూర్తవుతాయి..? మీకు మంచి హృదయం ఉంటే ఎందుకు అఖిలపక్షం పెట్టడం లేదు.. ఇది ప్రభుత్వపరమైన నిర్ణయం. ఎందుకు అధికారులకు వదిలేస్తున్నారు. నిర్ణయాలు ప్రభుత్వాలు తీసుకోవాలని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలే కాదు ఉత్తరాది రాష్ట్రాలు కూడా కలిసి రావాలి. పంజాబ్ వంటివి దక్షిణాదితో కలిసి రావాలి.. పంజాబ్‌లో బిజెపికి ఏం లేదు. అందుకే వాళ్లకు అక్కడ ఏంతగ్గినా ఇబ్బంది లేదన్నారు. 75 ఏళ్ల ప్రజాస్వామ్యం తర్వాత ఏ కులం లెక్కలో ఎంతో తెలియకపోతే ఎలా? జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ లెక్కలు చేస్తున్నప్పుడు బిసి లెక్కలు ఎందుకు చేయకూడదు. మేం అందుకే జన గణనలో కుల గణన చేపట్టాలని శాసనసభలో తీర్మానం పెట్టాం. మేం అందుకే రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటున్నాం. బిసిలకు బిజెపి అన్యాయం చేసిందనేది మేం చెబుతున్నాం. ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లుఇచ్చింది. ఇప్పుడు ఓబీసీలకు వ్వాలనుకుంటున్నాం. ఎలాగైనా మేం రిజర్వేషన్లు ఇస్తాం.. మండల్ కమిషన్ 29 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది.. మేం వాటిని ఇంకా పెంచాలనుకుంటున్నామని చెప్పారు. గుజరాత్ నమూనా కాలం చెల్లిన నమూనా (గుజరాత్ మోడల్ ఇజ్ అవుట్ డేటెడ్ మోడల్)అది టెస్ట్ మ్యాచ్ మోడల్...తెలంగాణది 20-20 నమూనా (మోడల్). తెలంగాణ నమూనానే దేశానికి నమూనా. గుజరాత్ నమూనాలో ఏవిధమైన సంక్షేమం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏమైనా అభివృద్ధి ఉందనుకుంటే అది మోడీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రయత్నించిందే.. మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత గుజరాత్ మార్కెటింగ్‌కు అంబాసిడర్ లేరని చెప్పారు. మోదీనే సొంతంగా గుజరాత్ కోసం పోరాడుతున్నారని, ఎవరైనా దేశానికి పెట్టుబడులు పెట్టడానికి వస్తే గుజరాత్‌కు వెళ్లి పెట్టుబడులు పెట్టమని చెబుతున్నారు... ఇదేం పద్ధతి..?అని ప్రశ్నించారు. మోడీ ఈ దేశానికి ప్రధానమంత్రి.. ప్రధానమంత్రి దేశంలో ఏమూలకైనా పెట్టుబడులు వస్తే వాటికి ఆయన మద్దతు ఇవ్వడం లేదని ఆరోపించారు. అహ్మదాబాద్.. హైదరాబాద్‌లోని మౌలిక వసతులను పోల్చి చూడండి. మా హైదరాబాద్‌లో ఉన్న వసతులు.. అహ్మదాబాద్‌లో ఉన్న వసతులు చూడండి. హైదరాబాద్‌తో పోటీ పడే ఔటర్ రింగు రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం అహ్మదాబాద్‌కు ఉన్నాయా? గుజరాత్‌లో ఫార్మా, ఐటీ పెట్టుబడులు ఉన్నాయా..? గుజరాత్‌లో ఏం ఉంది? నేను అహ్మదాబాద్, ముంబయి, బెంగళూర్, ఢిల్లీతో పోటీ పడడం లేదు.. నేను న్యూయార్క్, సియోల్, టోక్యోతో పోటీపడాలనుకుంటున్నాం. మా తెలంగాణ నమూనాతో ఎవరూ పోటీ పడలేరని స్పష్టం చేశారు. మేంఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తున్నాం. 30 వేల ఎకరాల్లో అద్భుతమైన నగరం నిర్మించే పని ప్రారంభించాం.. అయిదేళ్ల తర్వాత వచ్చి చూడండి.. ప్రపంచంలో అత్యుత్తమ నగరం నిర్మించబోతున్నాం. కోవిడ్ సమయంలో ఔషధాలు ఎక్కడ తయారయ్యాయి. మూడో వంతు ఔషధాలు మేం సరఫరాచేశాం. భారతదేశంలోని 35 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లో ఉత్పత్తి అవుతున్నాయన్నారు. ప్రభుత్వాలు మారినా ముఖ్యమంత్రులు మారినా అభివృద్ధి కొనసాగిందన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమైన గాజులు, ముత్యాలు చార్మినార్ వద్ద దొరుకుతాయని, ఇప్పుడు డాలర్ల మార్పిడి చేస్తున్నాం...400 ఏళ్ల క్రితమే అక్కడ నగదు మార్పిడి ఉందన్నారు. ప్రపంచంలోని ఎక్కడ నగదు (నోట్) తీసుకువచ్చినా అక్కడ మార్చుకోవచ్చన్నారు. మోడీ నిబంధనలు అతిక్రమించి గిఫ్ట్ సిటీలో ప్రయోజనాలు కల్పిస్తున్నారు.. హైదరాబాద్‌కు ఎందుకు ఇవ్వరు. గిఫ్ట్ సిటీలో యూనివర్సిటీ, పరిశ్రమ ఏ పెట్టుబడి వచ్చినా లాభాలు ఆయా దేశాలకు తీసుకెళ్లే అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. మోదీతో నాకు వ్యక్తిగతంగా ఎటువంటి విభేదాలు లేవు.. నేను మోదీ విధానాలతో విభేదిస్తున్నా. మోదీ దేశానికి ప్రధానమంత్రి ఆయనకు గౌరవం ఇవ్వాలి. ఆయనను కలిసి మా రాష్ట్రానికి కావల్సినవి అడగడం నా హక్కు, బాధ్యత.. ప్రజలు నాపై నమ్మకం ఉంచి ఎన్నికల్లో గెలిపించి ముఖ్యమంత్రి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ అప్పులు రూ. 3.50 లక్షల కోట్లు కాదు. రూ.7 లక్షల కోట్లు. 2014లో మేం తెలంగాణ ఏర్పాటు చేసినప్పుడు రాష్ట్రానికి ఉన్న అప్పులు రూ.69 వేల కోట్లు. కేసీఆర్ పదేళ్ల కాలంలోనే రూ.6 లక్షల కోట్లకుపైగా అప్పులు చేసి వెళ్లారు. మా రాష్ట్రానికి ఇప్పుడు నెలకు ఉన్న ఆదాయం రూ.18,500 కోట్లు...జీతాలు, పింఛన్లకు నెలకు రూ.6,500 కోట్లు, ఈ అప్పులకు వడ్డీలకు రూ.6,500 కోట్లు నెలకు మేం కట్టాలనిచెప్పారు. మిగిలిన రూ.5,500 కోట్లతో మేం అభివృద్ధి, సంక్షేమం చేపట్టాలి. అయినా మాపరుగు సాగుతోంది.. మా పరుగును సాగనివ్వండి...వేగం ఉత్తేజాన్నిస్తుంది.. కానీ చంపేస్తుంది తెలుసుగా.. (స్పీడ్ థ్రిల్స్ బట్ కిల్స్) అని అన్నారు. మోదీ ఢిల్లీలో అనేక గ్యారంటీలు ఇచ్చారు.. ఎవరూ మోడీని ప్రశ్నించడం లేదు.. మోదీ గ్యారంటీలకు వ్యతిరేకమైతే ఢిల్లీలో ఎందుకు గ్యారంటీలు ఇచ్చారని ప్రశ్నించారు. మేం 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణాలను మూడు నెలల్లోపు మాఫీ చేశాం. భారతదేశంలో తొలిసారి ఇంత రుణమాఫీ చేశామన్నారు. ఇప్పటి వరకు ఎవరూ చేయలేదన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన, ఇతర అంశాలపై కాకుండా వీటిపై చర్చ జరగాలి. మూల ధన వ్యయంపై (క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్) చర్చ జరగాలి. నేను నెలకు రూ.500 కోట్లు కూడా క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్‌పై పెట్టలేకపోతున్నా పేర్కొన్నారు.

# గ్రూప్-1 ఫలితాలు

>> తాను ప్రకటించనుంది. అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా 1:2 నిష్పత్తికి సంబంధించిన మెరిట్ జాబితాను కమిషన్ ప్రకటించనుంది. అలాగే గ్రూప్-2 జనరల్ ర్యాంకింగ్ జాబితా(జిఆర్ఎల్)ను ఈ నెల 11న, గ్రూప్-3 జిఆర్ఎల్‌ను ఈ నెల 14న ప్రకటించనున్నట్టు టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటితోపాటు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫైనల్ ఫలితాలనుఈ నెల 17న, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టుల తుది ఫలితాలను 29న విడుదల చేయనున్నట్టు తెలిపారు.

# ఐపిఎస్‌ల బదలీ

>> కామారెడ్డి ఎస్పిగా వున్న సింధూ శర్మ ఇంటెలిజెన్స్ ఎస్పిగా బదలీ కాగా ఆమె స్థానంలో నల్లగొండ ఎస్పిగా వున్న రాజేష్ చంద్రనియమితులయ్యారు. నగరంలోని సెంట్రల్ జోన్ డిసిపిగా వున్న ఆకాంక్ష యాదవ్‌ను భువనగిరి డిసిపిగా నియమించగా ఆయన స్థా నంలో హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ డిసిపిగా వున్న శిల్పవల్లి బదిలీ అయ్యారు. సంగారెడ్డి జిల్లా ఎస్పిగా వున్న రూపేష్ నార్కోటిక్ విభాగంలో బదలీ కాగా ఆయన స్థానంలో పారితోష్ పంకజ్ నియమితులయ్యారు. మహిళా భద్రతా విభాగం ఎస్పిగా చేతన నియమితులు కాగా రాజన్న సిరిసిల్లా ఎస్పిగా బాబా సాహెబ్ బదలీ అ య్యారు. వరంగల్ సిపిగా అంకిత్ కుమార్, మంచిర్యాల డిసిపిగా భాస్కర్, సూర్యాపేట్ ఎస్పిగా నరసింహా, ఎస్ఐబి ఎస్పిగా సాయి శేఖర్, పెద్దపల్లి డిసిపిగా పుల్లా కరుణాకర్, సిఐడి ఎస్పిగా రవీందర్ నియమితులయ్యారు.

## వారం - వర్జ్యం

తేది : 8-03-2025, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
శుక్ల నవమి ఉ.8.17
ఆరుద్ర రా.11.28
వర్జ్యం ఉ.11.41-మ.1.19
దు.ఉ.6.30-8.06
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. అనుకోని విధంగా ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం :** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకొంటారు. పూర్వపు మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**మిథునం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆకస్మికంగా ధన, వస్తులాభాలు పొందుతారు.

**కర్కాటకం :** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. మిత్రులనుండి సాయం అందిస్తారు. ప్రయాణాలు.

**సింహం:** కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కన్య :** ఆర్థిక ఇబ్బందులు ఎదురైన అధిగమిస్తారు. కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రయాణాలు.

**వృశ్చికం:** దూర ప్రాంతాల నుండి కీలక సమాచారం అందుతుంది. పనులు నిదానంగా సాగుతాయి.

**ధనుస్సు:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు.

**మకరం:** రుణాలు తీరి ఊరట చెందుతారు. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**కుంభం:** విలాస వస్తువులు, ఆభరణాలు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**మీనం :** దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. పనులలో విజయం సాధిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బిఆర్ఎస్ నుంచి ఇద్దరు

>> ప్రవేశపెట్టిన రోజు మాత్రమే కెసిఆర్ అసెంబ్లీకి వచ్చారు. ఒకరోజు అసెంబ్లీకి వచ్చి మొహం చాటేసారని అధికార పార్టీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఈనెల 12 నుంచి జరిగే తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో బిఆర్ఎస్ అధినేత పాల్గొంటారని గులాబీ వర్గాలం టున్నాయి. ఎస్ఎల్‌బిసి, కాళేశ్వరం, అప్పుల విషయంలో ప్రభుత్వ తీరును సభ సాక్షిగా కెసిఆర్ ఎండగడతారని బిఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడండి కెసిఆర్ అంటూ కాంగ్రెస్ నేతలు సవాల్ చేయడం.. మరోవైపు బిఆర్ఎస్ అధినేత సభకు రావడం లేదని హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడం.. అనర్హత హెచ్చరికలు కూడా కెసిఆర్ అసెంబ్లీకి వెళ్లేందుకు కారణాలుగా చెబుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తర్వాత కెసిఆర్ వ్యవసాయ క్షేత్రం నుంచే పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఏడాదిన్నర కాలంగా మూడుసార్లు మాత్రమే తెలంగాణ భవన్‌లో సమావేశాలు నిర్వహించారు. రెండు వారాల క్రితం జరిగిన సమావేశంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని కెసిఆర్ ప్రకటించారు. పార్టీ ఆవిర్భావించి 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# అనుమానాస్పద మృతి

>> గంగాధర రెడ్డి, 2024 సెప్టెంబర్‌లో వై.ఎస్ అభిషేక్ రెడ్డి, డ్రైవర్ నారాయణ ఇప్పుడు రంగయ్య మరణించడం జరిగిందన్నారు. గతంలో నుంచి వై.ఎస్ వివేకా హత్య కేసులో సాక్షులు మరణించినపుడు ప్రతి సారి పోలీసుల వల్ల, సిబిఐ వల్లనే చనిపోయారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని, దీన్ని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, దీని వెనుక ఎవరున్నారు..ఎందుకిలా చేస్తున్నారు..అన్న కోణంలోనూ, ఈ ప్రధానమైన కేసును కప్పిపుచ్చే ప్రయత్నాలు ఏమైనా చేస్తున్నారా.. అనే అంశాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయడం జరుగుతుందన్నారు. దర్యాప్తునకు ప్రత్యేకమైన బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కేసును శాస్త్రీయంగా, డాక్యుమెంట్‌లను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందన్నారు. వివేకా హత్య కేసులో సాక్షులెవరికైనా తమ ప్రాణాలకు ముప్పు ఉందని భావిస్తే తమకు ఫిర్యాదు చేస్తే పరిశీలించి అవసరమైతే రక్షణ కల్పిస్తామని ఎస్.పి గారు తెలిపారు.

# కేంద్రంపై ఒత్తిడి తెద్దాం

>> అన్నారు. శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల జెఎసి సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా పనిచేసిన ఉద్యోగులు దాచుకున్న డబ్బు కోసం పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను అర్థం చేసుకొని ఒక నిర్ణయం తీసుకున్నామన్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఐదు వేల కోట్ల బిల్స్ పెండింగ్‌లో పెట్టి వెళ్లిందని, గత 14 నెలల కాలంలో కొంత బకాయిలు జమ అయ్యాయని వివరించారు. పాత, కొత్త పెండింగ్ బిల్స్ 10,000 కోట్లు తమ ప్రభుత్వం క్లియర్ చేసిందని తెలిపారు. మరో ఎనిమిది వేల కోట్ల బకాయిలు మిగిలి ఉన్నాయి అని వివరించారు. రానున్న ఏప్రిల్ నుంచి ప్రాధాన్యత క్రమంలో ప్రతినెల 500 నుంచి 600 కోట్ల వరకు ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్స్ క్లియర్ చేస్తామన్నారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారి సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నెలలో ఏ తేదీలో జీతాలు పడతాయో అర్థం కాని పరిస్థితి ఉండేదని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల క్రమం తప్పకుండా ఒకటో తారీఖున జీతభత్యాలు చెల్లిస్తున్నామని, రాష్ట్రంలో దాదాపు 13 లక్షల మంది (ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్) సిబ్బంది ఉన్నారని తెలిపారు. కేవలం రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ తదితర బిల్లును మాత్రమే పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని సాధ్యమైనంత త్వరలో క్లియర్ చేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థికేతర సమస్యలు పరిష్కరించడానికి వివిధ క్యాబినెట్ సభ్యులు ఉన్నాయని ఆ సమస్యలు కూడా త్వరలో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని వివరించారు.తమది ఎంప్లాయ్ ఫ్రెండ్లీ ప్రభుత్వం అన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ నాన్ గెజిటెడ్, గెజిటెడ్, వివిధ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాలు, మున్సిపల్, వైద్య ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సమగ్ర కుటుంబ సర్వేపై కమిటీ ఏర్పాటు

## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి7:** సమగ్ర కుటుంబ (ఆర్థిక, రాజకీయ, విద్య, సామాజిక, న్యాయ) సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధ్యయనానికి సామాజికవేత్తలతో స్వతంత్ర హోదాతో కమిటీ ఏర్పాటు చేసినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. సమగ్ర సర్వే సమాచారాన్ని విశ్లేషణ చేసి చిన్న పొరపాటుకు అవకాశం లేకుండా మేధావులు, సామాజిక శాస్త్రవేత్తలు కృషి చేయాలని కోరారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సలహా కమిటీ సభ్యులతో ఆయన సమావేశం అయ్యారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి చైర్మన్‌గా, రిటైర్డ్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య వైస్ చైర్మన్‌గా, ప్రవీణ్ చక్రవర్తి కన్వీనర్ గా వ్యవహరిస్తారు అని తెలిపారు. కమిటీ సభ్యులుగా డాక్టర్ సుఖదేవ్, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, శాంత సిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, ప్రొఫెసర్ భూక్య భంగ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా జీన్ డ్రీజ్ ఉంటారని తెలిపారు. ఈ నిపుణుల కమిటీ సర్వే నివేదికను నెల రోజుల్లో ప్రణాళిక శాఖకు అందజేయాలని తెలిపారు. ఈ సామాజిక ఆర్థిక సర్వేను దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉన్నత భావంతో మార్గదర్శనం చేశారని తెలిపారు. సమాజంలో సామాజిక న్యాయానికి పునాది వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సర్వే జరిపించింది అన్నారు. ఈ గొప్ప కార్యక్రమంలో చిన్న పొరపాటుకు అవకాశం ఇవ్వరాదనే ఆలోచనతో లోతుగా అధ్యయనం చేసి భాగస్వాములు అందరితోనూ సర్వేపై ముందస్తుగా సమావేశాలు నిర్వహించామని తెలిపారు. ప్రతి 150 ఇళ్లను ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేసుకొని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా సర్వే జరిపించినట్లు తెలిపారు. ఎటువంటి పొరపాట్లు జరగకుండా,అపోహాలకు తావు లేకుండా ఉండటం కోసం దేశంలో, రాష్ట్రంలో సామాజిక స్పృహ కలిగిన మేధావులను సమగ్ర కుటుంబ సర్వే అధ్యయనంలో భాగస్వాములను చేసి స్వతంత్ర హోదా కల్పించినట్టు తెలిపారు. సమావేశంలో ప్రణాళికా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

# రుణాలు రూ. 32 లక్షల కోట్లు

>> సూరత్‌లో ఆహార భద్రత సంతృప్త ప్రచారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఖాతా తెరవకపోవడాన్ని ఉద్దేశిస్తూ ప్రధాని పరోక్షంగా ఛలోక్తులు విసిరారు. ఐదుకోట్ల నకిలీ రేషన్‌కార్డులను ఏరివేయడంద్వారా ప్రజాపంపిణీ వ్యవస్థను క్రమబద్ధీకరించినట్లు ప్రధానిమోడీ అన్నారు. ఆహార భద్రతా లక్ష్యాలను సాధించేందుకు సూరత్‌లో ప్రారంభించిన ఈ కార్యక్రమం అన్నిజిల్లాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

# కాంట్రాక్టర్ల ధర్నా

>> చాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు. రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్టుగా వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడేళ్లుగా తమ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చేందుకు డబ్బులు ఉంటాయి కానీ తమకు ఇవ్వడానికి లేవా అని నిలదీశారు. తమ బిల్లులు క్లియర్ చేయడానికి 20 శాతం కమీషన్లు అడుగుతున్నారని, అంత మొత్తం ఎక్కడి నుంచి తేవాలని ప్రశ్నిస్తున్నారు. అప్పులు తెచ్చి పనులు చేశామని, వాటికి వడ్డీలు చెల్లించడానికే సతమతమవుతున్న తమకు 20 శాతం కమీషన్లు అడగడం ఏమిటని మండిపడ్డారు. కాంట్రాక్టర్ల ఆందోళనతో డిప్యూటీ సీఎం భట్టి సెక్రటేరియట్ నుంచి వెళ్లపోయారు.


**PUBLIC NOTICE** SAHARA INDIA PARIWAR

Command & Registered Office: Sahara India Bhawan, Kapoorthala Complex, Lucknow-226024

**OFFICE : MAQKTHA, MEHDIPATNAM & CHARMINAR**

The General Public is hereby informed that the Service Centres **Maqktha/1269, Mehdipatnam /2577 & Charminar/2575** working under the administrative control of our Regional Office, **Hyderabad** are being **merged** with Service Centre, **Hyderabad/1217** under the administrative Control of Regional Office, **Hyderabad** from dated **01-03-2024.**

So, all the Esteemed Depositors/ Investors of our **Maqktha, Mehdipatnam & Charminar** offices are hereby requested to contact the below mentioned address for fulfilling their office related works-

**SAHARA INDIA, SERVICE CENTRE HYDERABAD**
1st Floor, Royal Traders, Shop. No. 12-2-728/2, Reti Bowli, Mehdipatnam Hyderabad, Telangana-500028

Date: 08-03-2025
Place: Hyderabad

**Regional Manager Worker**
Regional Office, **Hyderabad**

CCN-33



hmda **హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్

**HMDA చట్టం 2008 యొక్క 15(3) సెక్షన్ క్రింద బహిరంగ ప్రకటన**
**(G.O.Ms.No.51 MA & UD విభాగం, తేదీ: 27.02.2025)**

G.O.Ms.No.33, MA, తేదీ: 24.01.2013 సదరు సెక్షన్ యొక్క (1) ఉప-సెక్షన్‌చే అవసరమైన విధంగా దాని ప్రకారం ప్రభుత్వంచే ఆమోదించబడిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ (HMR) కొరకు MDP-2031లో సూచించబడిన భూమి వినియోగానికి ఈ క్రింది మార్పు చేయడానికి ఇందుమూలముగా ప్రభుత్వం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (2008 యొక్క చట్టం నం.8) యొక్క సెక్షన్ 15 యొక్క ఉప-సెక్షన్ (1)చే సంక్రమించబడిన అధికారాలను వినియోగిస్తోంది.

సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు (మం) క్యాసారం (గ్రా) వద్ద ఉన్న సర్వే నం.లు 255/A1/1/2, 255/B, 255/A2/2, 255/B/1, 255/A2/2/1లలోని స్థలం 10503.20 చ.మీటర్లు నికర స్థల విస్తీర్ణం, ఏదైతే ప్రస్తుతం పబ్లిక్, సెమీ పబ్లిక్ సౌకర్యాలు మరియు ఉపయోగ, వినియోగ జోన్‌గా G.O.Ms.No.33, MA & UD, తేది 24.01.2013 ప్రకారం ప్రభుత్వంచే ప్రకటించబడిన MDP-2031లో వినియోగ జోన్‌గా నిర్దేశించబడిందో అది ఇప్పుడు 'గ్రీన్' కేటగిరీ క్రింద సింథటిక్ బుక్ కవర్ షీట్స్ యొక్క ఉత్పత్తికి యూనిట్ స్థాపించటానికి ఉత్పత్తి వినియోగ జోన్‌గా అధీకృతంగా నిర్దేశించబడింది.

పై సంబంధిత వివరాలు వెబ్‌సైట్స్ http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// లో అందుబాటులో ఉన్నాయి.

సం/- మెట్రోపాలిటన్ కమిషనర్ తరపున, డైరెక్టర్ ప్లానింగ్-II, HMDA

DIPR.No.11119-PP/CL/Advt/1/2024-25, తేది: 07.03.2025

# ప్రతిక్షణం 'కెనడా ఫస్ట్' నినాదంతోనే నడిచా..

## వీడ్కోలు ప్రసంగంలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో



**ఒట్టావా, మార్చి 7:** తన పదవీకాలంలో కెనడాను ప్రపంచదేశాల్లో మిన్నగా చూపించేందుకే కృషి చేసానని, నిరంతరం కెనడా ఫస్ట్ అన్న భావనతోనే కొనసాగానని రాజీనామా చేసి పదవినుంచి దిగిపోతున్న ప్రధాని జస్టిన్‌ట్రూడో అన్నారు. కెనడా లిబరల్‌పార్టీలో పెరుగుతున్న అసమ్మతిని చక్కదిద్దేందుకు రాజీనామాచేసిన జస్టిన్‌ట్రూడో స్థానంలో లిబరల్ పార్టీ మరోనేతను ఎంపిక చేసింది. ఈక్రమంలోనే వీడ్కోలు సభలో మాట్లాడిన ట్రూడో కన్నీటి పర్యంతమయ్యారు. ప్రతిరోజు కూడా కెనడా ఫస్ట్ నినాదంతోనే కొనసాగానని, ప్రధానిగా కెనడియన్లు ప్రపంచంలో ఎక్కడా తక్కువగా ఉండకూడదన్న భావనతోనే మెలిగానని అన్నారు. వ్యక్తిగతంగా కూడా ప్రతిరోజు కూడా కెనడా వాసులకోసమే పని చేసానని, ప్రజల అండతోనే కొనసాగినట్లు చెప్పారు. కనీసం చివరిరోజుల్లోకూడా ఈ ప్రభుత్వం కెనడియన్లు ఎక్కడా తగ్గి ఉండ కూడదన్న లక్ష్యంతోనే పనిచేసానని, భవిష్య త్తులో కూడా అలాగే ఉండాలని కోరుకుం టున్నట్లు చెప్పారు. పాపులారిటీ రేటింగ్స్ పడి పోవడంతో ట్రూడో జనవరిలోనే తన రాజీనా మాను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆదివారం నాటికి లిబరల్‌పార్టీ కొత్తనేతను ఎంపికచేసుకునే వీలుంటుంది. ఎన్నికలు అక్టోబరులో జరగాల్సి ఉండగా ఈలోపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కూడా భేటీకావాల్సి ఉంది. ట్రంప్ టారిఫ్ హెచ్చరికలను జాగ్రత్తగా గమనించాలని ఐకమత్యంతో మెలగాలని రానున్న రోజుల్లో కూడా సమిష్టికృషితోనే ముందుకుపోవాలన్నారు. సుంకాలు వేస్తానని, జస్టిన్ ట్రూడో కెనడాకు గవర్నర్‌గా మారతారని, కెనడా అమెరికాలోని 51వ రాష్ట్రంగా కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ జస్టిన్‌ట్రూడోతో వాగ్వాదానికి దిగిన సంగతి తెలిసిందే. కెనడా, మెక్సికో దేశాలపై ట్రంప్ విధించే సుంకాలను వాయిదా వేస్తున్నట్లుప్రకటించిన కొద్దిసేపటికే జస్టిన్‌ట్రూడో వీడ్కోలుసభలో ప్రసంగించారు. అమెరికా కెనడాలు రెండూ కూడా 25శాతం చొప్పున సుంకాలు విధించనున్నట్లు ప్రకటించాయి. రాను రాను ఈ సుంకాలు వాణిజ్యయుద్ధాలకు తెరతీసాయి. ట్రంప్ ఉద్రేకపూరిత రాజకీయాలను ట్రూడో ఖండించారు. కెనడియన్లు, మెక్సికన్లు కూడా ఇపుడు తమదేశాలు ఫస్ట్ అని మసలుకోవాలని పిలుపునిచ్చారు. ట్రంప్ అమెరికా ఫస్ట్ అన్నట్లుగానే మాదేశాలు మాకు ఫస్ట్ అని ఆయన ప్రకటించారు.



## కుప్పకూలిన ఐఎఎఫ్ జాగ్వార్.. పైలట్ సురక్షితం

**పంచకుల, మార్చి 7:** భారత వైమానిక దళానికి చెందిన జాగ్వార్ యుద్ధ విమానం హర్యానాలోని పంచకులలో కుప్పకూలిన ఘటన శుక్రవారం జరిగింది. శిక్షణా కార్యక్రమంలో భాగంగా అంబాలా ఎయిర్‌బేస్ నుంచి బయలుదేరిన విమానం కొద్దిసేపటికే కుప్పకూలింది. అయితే పైలట్ సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనపై శాఖాపరమైన దర్యాప్తు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు. 'సాంకేతిక లోపం కారణంగా ఈ దురదృష్టకర ఘటన చోటు చేసుకుంది. విమానాన్ని నివాస ప్రాంతాలకు దూరంగా నడిపి పైలట్ సురక్షితంగా దూకేశాడు' అని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలియజేసింది. ప్రమాదానికి దారితీసిన పూర్తి కారణాలపై శాఖాపరమైన విచారణ జరుపనున్నట్లు పేర్కొంది. పంచకుల జిల్లాలోని పర్వత ప్రాంతంలో విమానం కుప్పకూలినట్టు రాయ్‌పురానీ ఎస్‌హెచ్‌ఒ మీడియాకు ఫోనులో తెలిపారు. కాగా, గత నెలలో ట్విన్ సీటర్ మిరేజ్ 2000 ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ శిక్షణా కార్యక్రమంలో ఉండగా మధ్యప్రదేశ్‌లోని శివ్‌పురి సమీపంలో కుప్పకూలింది. విమానం నేలను తాకకముందే ఇద్దరు పైలట్లు బయటకు దూకేసి ప్రాణాలతో బయటపడ్డారు.

# హెచ్1బి రిజిస్ట్రేషన్లు షురూ



**వాషింగ్టన్, మార్చి 7:** నిపుణులైన సాఫ్ట్ వేర్ ఉద్యోగులకు అమెరికాలో పనిచేసే ఛాన్స్ ఇచ్చేందుకు 2026లో ఆసక్తితో ఉన్న హెచ్‌వన్‌బి వీసా రిజిస్ట్రేషన్ ప్రక్రియ శుక్రవారంనుంచి ప్రారంభం అయింది. అమెరికా పౌరసత్వం, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ రిజిస్ట్రేషన్‌ప్రక్రియ ఈనెల 22వరకూ కొనసాగుతుందని విదేశాంగశాఖ ప్రకటించింది. హెచ్‌వన్‌బి వీసాలకు అధిక డిమాండ్ ఉన్న క్రమంలో దరఖాస్తుదారులు, వారి స్పాన్సర్ యజమానుల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు ముందుగానే సిద్ధంగా ఉండాలని సూచించారు. హెచ్1బి వీసా అనేది వలసేతర వీసా. ఇది అమెరికా కంపెనీలకు సాంకేతిక నైపుణ్యం అవసరమయ్యే వృత్తుల్లో విదేశీ కార్మికులను నియమించుకోడానికి అనుమతిస్తుంది. ఈ వీసా ముఖ్యంగా ఇనఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, హెల్త్‌కేర్, ఫైనాన్స్, పరిశోధన వంటి రంగాల్లో ప్రాచుర్యం పొందినవారికి లభిస్తుంది. దీనికోసం ప్రతిఏటా వేలాది దరఖాస్తులుచేస్తారు. ప్రస్తుతం ఈ వీసాకోసం 85 వేలమంది ఉన్నారు. వీరిలో సాధారణపరిమితికింద 65 వేలమంది ఉంటే అమెరికా మాస్టర్స్ డిగ్రీ, అంతకంటే ఎక్కువ ఉన్న దరఖాస్తుదారులు 20వేల మంది ఉన్నారు. అభ్యర్థులు ఏడు నుంచి 22 మధ్య తమ ఉద్యోగాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఇవ్వాలన్నారు.

ఇందుకోసం ప్రతి రిజిస్ట్రే షన్‌కు 215 డాలర్లు అంటే 18,695.35 రూపాయలుగా రుసుం ఉంటుంది. వార్షిక పరిమితికంటే ఎక్కువ ఉంటే తదుపరి దశకోసం ఏ దరఖాస్తుదారులు వెళ్తారో నిర్ణయించడానికి యుఎస్‌సిఐఎస్ యాధృచ్ఛికంగా లాటరీ ఎంపిక నిర్వహిస్తుంది. ఈ లాటరీ ఫలితాలు మార్చి 31నాటికి ప్రకటిస్తారు. లాటరీలో ఎంపికయిన వారు వచ్చే ఏప్రిల్ ఒకటినుంచి యుఎస్ సిఐఎస్‌లో హెచ్1బి దరఖాస్తులు చేయాలి.

ఉద్యోగం హెచ్1బి స్పెషాలిటీ వృత్తిప్రమాణాలకు అనుగుణంగా ఉందని, దరఖాస్తుదారునికి అవసరమైన అర్హతు లన్నాయని నిరూపించేందుకు యజమానులు అవసరమైన ధృవపత్రాలు ఇవ్వాలి. ఆమోదం పొందిన హెచ్1బి వీసా హోల్డర్లు వచ్చే అక్టోబరు ఒకటినుంచి అమెరికాలో పనిచేసేందుకు అవకాశం ఉంటుంది.



# మిమ్మల్ని భూమిపైకి తేవడానికి వస్తున్నాం

## వ్యోమగాములకు యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ సందేశం

**వాషింగ్టన్, మార్చి 7:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ 9 నెలలుగా చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. త్వరలోనే వారు భూమి మీదకు రానున్నట్లు పలు మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. సునీత కూడా మంగళవారం ఐఎస్ఎస్ నుంచి విలేకరులతో మాట్లాడుతూ త్వరలోనే భూమి మీదకు చేరుకుంటానని తెలిపారు. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. 'మేము మిమ్మల్ని ప్రేమిస్తున్నాం తీసుకెళ్లడానికి వస్తున్నాం' అని వ్యోమగాములకు సందేశం పంపిస్తూ భరోసా ఇచ్చారు. అత్యంత అసమర్థ అధ్యక్షుడి పాలన (బైడెన్) కారణంగానే ఇంత కాలం మీరు చిక్కుకుపోయారని వారి భూమిపైకి తీసుకువచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని మండిపడ్డారు. వారు చేసిన ఆలస్యం వల్ల వ్యోమగాములు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని విమర్శించారు. ఇకపై అలా జరగనివ్వనని ఆయన పేర్కొన్నారు. వ్యోమగాములను సురక్షితంగా భూమిపైకి తీసుకొచ్చే బాధ్యతను ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు అప్పగించినట్లు ట్రంప్ వెల్లడించారు. దాదాపు రెండు వారాల్లో మస్క్ స్పేస్ఎక్స్ క్యాప్యూల్‌ను ప్రయోగించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ప్రణాళిక ప్రకారం ఐఎస్ఎస్‌లో ఉన్న వ్యోమగాములు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు వారం రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమిని చేరుకుంది. సునీతా విలియమ్స్, విల్‌మోర్‌లు అప్పటి నుంచి ఐఎస్ఎస్‌లోనే ఉంటున్నారు. వారిని తిరిగి తీసుకురావడానికి నాసా స్పేస్ ఎక్స్‌తో కలిసి పనిచేస్తోంది. ఈ ఇద్దరు వ్యోమ గాములను తీసుకురావాలంటే అంతకంటే ముందు కొందరిని ఐఎస్ఎస్‌కు పంపించాల్సి ఉం టుంది. ఈ ప్రయోగం చేపట్టడానికి స్పేస్ ఎక్స్ సమయం కావాలనడంతో ఈ ఆలస్యం జరి గిందని గతంలో అధికారులు పేర్కొన్నారు. తాజాగా వ్యోమగాములు స్పేస్ నుంచి మీడియాతో మాట్లాడారు. తమ కోసం ఈ నెల 12న స్పేస్ఎక్స్‌కు చెందిన క్రూ-10 అంతరిక్ష నౌక రానుందని, నౌకలో కొత్తగా ఐఎస్ఎస్‌లోకి వచ్చే వ్యోమగాములు తమ బాధ్యతలు తీసుకోనున్నారని చెప్పారు. తర్వాత మార్చి 19న ఆ నౌకలోనే తిరిగి భూమి మీదకు తాము బయల్దేరనున్నామని తెలిపారు. అయితే ట్రంప్ తాజా ప్రకటనతో వారిని భూమిపైకి తీసుకువచ్చేందుకు స్పేస్ఎక్స్ చేపట్టిన చర్యలను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది.

# బీహార్ మండలిలో సిఎం నితీశ్ అసహనం

## ప్రధాన ప్రతిపక్షం ఆర్జేడిపై నిప్పులు



**పాట్నా, మార్చి 7:** బీహార్ అసెంబ్లీ సమావేశాల్లో బాలికావిద్యపై జరిగిన చర్చ సందర్భంగా బీహార్ సీఎం నితీశ్‌కుమార్ సహనం కోల్పోయారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఆర్జేడిపై మండిపడ్డారు. మీ పార్టీ ఏమీ చేయలేదని అన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్; భార్య రబ్రీదేవిని సీఎం చేయడాన్ని ఎద్దేవా చేసారు. బాలికా విద్యపై శుక్రవారం అసెంబ్లీలో చర్చ జరిగింది. తన ప్రాంతంలో బాలికల కోసం తగినన్ని స్కూల్స్ లేవని ఆర్జేడి ఎమ్మెల్సీ ఊర్మిలా ఠాకూర్ తెలిపారు. దీనితో విద్యకోసం కిలోమీటర్ల దూరంలోని స్కూళ్లకు వెళ్లేందుకు బాలికలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యామంత్రి సునీల్‌కుమార్ ఇచ్చిన సమాధానంపై ఎమ్మెల్సీ ఊర్మిలాఠాకూర్ అసంతృప్తి వ్యక్తం చేసారు. తన బేగుసరాయ్ జిల్లాలో పరిస్థితిని ఆమె వివరించారు. దీనితో సీఎం నితీశ్ అసహనం చూపించారు. బాలికల విద్యకెసం ఏం ఏంచేశామో మీకు తెలుసా, మేం అధికారంలోకి వచ్చేవరకూ బీహార్‌లోగ్రామీణ బాలికలు చాలా అరుదుగా స్కూళ్లకు వెళ్లేవారని అన్నారు. సీఎం వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ ఠాకూర్ ఖండిస్తూ సార్ దయచేసి అలా అనకండి నేను కూడా ఒక గ్రామంనుంచే వచ్చా. నేను పాతతరానికి చెందినవ్యక్తిని అయినా నాపాఠశాల విద్యను పూర్తిచేసా అన్నారు. మరో ఆర్జేడి ఎమ్మెల్సీ మున్నీదేవి రాజక్ తన సీటునుంచి పైకిలేచారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు మాకు ఉంది. ఇందుకు సమాధానం చెప్పడం మీ పని అన్నారు. దీనితో మున్నీదేవిని సముదాయించేందుకు ఊర్మిలాఠాకూర్‌ప్రయత్నించారు. దీనితో నితీశ్ పూర్తిగా సహనం కోల్పోయారు. తనసీటునుంచి లేచిన ఆయన ప్రతిపక్షంపై విరుచుకుపడ్డారు.

మహిళలకోసం ఏంచేసామో మీకు తెలియదు. మీరు మహిళలు కావచ్చు. కానీ సహకారం ఏమీలేదు అన్నారు. మండలిలో ప్రతిపక్ష నాయకురాలు రబ్రీదేవిపై మాటలదాడి చేసారు. ఆమె భర్త మునిగిపోతున్నపుడు తన భార్యను సీఎం చేసారు. మీపార్టీ ఏమీ చేయ లేదు. మీకు ఏమీ తెలియదు. మహిళల కోసం ఏం చేసినా అదినేనే చేసా. ఇపుడు మహిళలకు ఎలాంటి సమస్యలులేవు. అన్నారు. దీనితో మం డలిలో గందరగోళం చెలరేగడంతో సీఎం నితీశ్ అసహనంతో లేచి వెళ్లిపోయారు.



# సమష్టిగా పనిచేద్దాం.. విరోధం వద్దు

## భారత్‌కు చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ సూచన

**బీజింగ్, మార్చి 7:** భారత్-చైనా మధ్య పరస్పరం విరోధం పెంచుకొనే కంటే భాగస్వాముల్లా కలిసి పనిచేయడం ఉత్తమమని చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ అభిప్రాయపడ్డారు. ఉభయ దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆసియాలోనే కీలకమైన తమ రెండు దేశాల మధ్య సహకారం అత్యంత ముఖ్యమన్నారు. దీనిని ఆయన సమన్వయంతో చేసే నృత్యంతో పోల్చారు.

'చైనా-భారత్ భాగస్వాములుగా పరస్పర విజయానికి సహకరించుకోవాలి. దీనిని సాధించడానికి డ్రాగన్-ఎలిఫెంట్ డ్యాన్స్ ఒక్కటే ఇరు పక్షాలకు ఉన్న సరైన మార్గం' అని వాంగ్‌యీ వ్యాఖ్యానించారు. ఇరు దేశాలు పరస్పరం చిన్నబుచ్చుకోవడం కంటే ఒకరికొకరు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. పరస్పర సహకారమే రెండు దేశాల ప్రజల ప్రాథమిక ప్రయోజనాలను బలోపేతం చేస్తుందన్నారు.

ఇక న్యూఢిల్లీ-బీజింగ్ మధ్య మెరుగైన సంబంధాలు ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ సౌత్ దేశాలకు కూడా ప్రయోజనమన్నారు. అంతర్జాతీయ సంబంధాల్లో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసి అంతర్జాతీయ వేదికలపై గ్లోబర్ సౌత్ (పేద దేశాల) స్థానాన్ని శక్తిమంతం చేస్తుందన్నారు.

ఇరుదేశాల మధ్య వివాదాలను దౌత్యమార్గంలో పరిష్కరించుకొటామని సమష్టి ప్రయోజనాలను కాపాడుకోవడానికి సహకారం అవసరమని వాంగ్ అభిప్రాయపడ్డారు. 'చర్చల ద్వారా పరిష్కారం కానీ సమస్యే లేదు. అదే సమయంలో సహకారంతో చేరుకోలేదని లక్ష్యాలు లేవు' అని వెల్లడించారు.

దక్షిణాఫ్రికాలో జరిగిన జి-20 విదేశాంగ మంత్రుల భేటీలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో చైనా విదేశాంగమంత్రి వాంగ్‌యీ భేటీ అయ్యారు. ఆ తర్వాత కొన్ని వారాల్లోనే ఈ ప్రకటనలు వెలువడ్డాయి. వాస్తవానికి 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత ఇరుదేశాల మధ్య సంబంధాలు అట్టడుగుస్థాయికి పడిపోయాయి. ఆ తర్వాత పలు విడతలుగా ఇరు దేశాలకు చెందిన దౌత్యవేత్తలు, సైనికాధికారులు చర్చలు జరిపారు. 2024లో ప్రధాని మోడీ-చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సు సందర్భంగా కజాన్‌లో భేటీ అయ్యారు. ఆ తర్వాతనే సరిహద్దుల్లో ఉద్రికత్తలు ఉన్నచోట్ల నుంచి ఇరు దేశాల బలగాలు వెనక్కి తగ్గి పాత స్థితికి చేరుకొన్నాయి. మరోవైపు ఈ యేడాది చైనా షాంఘై సహకార సంస్థ సమావేశాలకు ఆతిథ్యం ఇస్తోంది. భారత ప్రధాని మోడీ అందులో పాల్గొనడం అత్యంత కీలకంగా మారనుంది.



## బిజెపి నేత సీతాసోరెన్‌పై పిస్తోలు ఎక్కుపెట్టిన మాజీ పిఎ

**రాంచి, మార్చి 7:** బిజెపి నాయకురాలు జార్ఖండ్ ముక్తిమోర్చా చీఫ్ సిబు సోరెన్ పెద్దకోడలు సీతాసోరెన్ తన సహాయకుడు దేవాశిష్ ఘోష్ తనపై హత్యాయత్నంచేసాడని ఫిర్యాదుచేసారు. ధన్‌బాద్‌లోని సరాయిఢేలాలో హోటల్‌రూమ్‌లోనే తనపై దాడిచేసాడని ఆమె చెప్పారు. ఇందుకు సంబంధించి సరాయిఢేలా పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌కూడా నమోదుచేసారు. ఇద్దరి మధ్య పెరిగిన సంవాదంలో ఘోష్ తన వద్ద ఉన్న పిస్టల్‌తీసి ఆమెపై కాల్పులుజరిపేందుకు యత్నించాడు అయితే ఆమె సెక్యూరిటీ సిబ్బంది వెంటనే మేలుకొని ఆతడిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఆతర్వాత పోలీసులకు సమాచారం అందించి పిస్తోలుతోసహా ఆతడిని పోలీసులకు అప్పగించారు. ధన్‌బాద్‌లో ఒక పెళ్లివేడుకకువెళ్లి వచ్చి హోటల్‌రూమ్‌లో విశ్రాంతికోసమని వచ్చారు. తన పిఎతోను, ఇతర పార్టీ సభ్యులతోను వివిధ అంశాలపై చర్చలుజరిపారని ఎఫ్ఐఆర్‌లో వెల్లడించారు. ఒక్కసారిగా మాజీ పిఎ దేవాశిష్ ఘోష్ పిస్టల్‌తీసి సీతాసోరెన్‌కు గురిపెట్టాడని వెంటనే అప్రమత్తం అయిన సెక్యూరిటీ సిబ్బంది ఆతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ధన్‌బాద్ కోర్టులో ఘోష్‌ను హాజరుపరిచారు. న్యాయమూర్తి జుడిషియల్‌కస్టడీకి ఆదేశించారు.

అయితే తుపాకి ఎక్కుపెట్టడానికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు. జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌కు స్వయానా వదిన అయిన సీతాసోరెన్ సీఎం తండ్రి శిబుసోరెన్ పెద్ద కోడలు. అంతకుముందు జామా నియోజకవర్గం నుంచి జెఎంఎం ఎమ్మెల్యేగా గెలిచారు. లోక్‌సభ ఎన్నికల సమయంలోనే ఆమె బిజెపిలో చేరారు. బిజెపి టికెట్‌పైనే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లోపోటీచేసారు. కానీ రెండు ఎన్నికల్లోను ఓటమి చవిచూసారు.

# కర్ణాటక సినీరంగానికి పరిశ్రమ హోదా

## రాష్ట్రం మొత్తం రూ.200కే సినిమా టికెట్

## రూ.4.8లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన సిఎం సిద్ధరామయ్య

**బెంగళూరు, మార్చి 7:** సినీప్రియులకు కర్ణాటక ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని అన్ని థియేటర్లలో సినిమా టికెట్లను రూ.200కే పరిమితం చేయాలని నిర్ణయించింది. శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీలో సీఎం సిద్ధరామయ్య సినిమా టికెట్లపై కీలకప్రకటనచేసారు. 2025-26కు సంబంధించి కర్ణాటక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.4,08,647 కోట్లతో బడ్జెట్‌ను సీఎం ప్రవేశపెట్టారు. సినిమారంగానికి పరిశ్రమ హోదా ఇస్తున్నట్లు తన ప్రసంగంలో వెల్లడించారు. మౌలిక సదుపాయాలు,సినిమా ప్రమోషన్స్, మహిళా సాధికారత వంటి అంశాలపై ఈసారి బడ్జెట్‌లో కీలకంగా ప్రస్తావించారు. ఈ బడ్జెట్‌లో సినీరంగానికి కీలక నిర్ణయాలు వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని మల్టీప్లెక్స్‌లు సింగిల్‌స్క్రీన్ థియేటర్లలో సినిమా టికెట్‌ధరను రూ.200కే పరిమితంచేస్తున్నట్లు చెప్పారు. సామాన్యులకు కూడా సినిమాను అందుబాటు లోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతోనే ఈనిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కన్నడ సినిమాల ప్రచారం కోసం రాష్ట్రప్రభుత్వం ఒక ఒటిటి ప్లాట్‌ఫామ్‌ని కూడా తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సీఎం ప్రకటించారు. 19వేల 262 కోట్ల లోటుతో కొతనత బడ్జెట్‌ను 4.10 లక్షల కోట్లతో ప్రవేశపెట్టారు. సంక్షేమ పథకాలు అభివృద్ధిపథకాల పట్లబేరీజువేసుకుని మరీ ప్రకటించారు. ఐదు గ్యారంటీలను అమలు చేస్తామని, గత ఏడాది 52 వేలకోట్లు ఉన్న ఈ హామీల వ్యయం ఈ ఏడాది 51,034 కోట వరకూ ఉంటుందని వెల్లడించారు. జిఎస్‌డిపి వృద్ధి 7.4శాతంగా ఉందని, జాతీయ సగటు 6.4కంటే ఎక్కువ ఉందని సీఎం సిద్ధరామయ్య వెల్లడించారు. కొత్తస్కీం సీఎం మౌలికవనరుల అభివృద్ధిపథకం ప్రారంభించి 8వేల కోట్లుకేటాయించారు. మొత్తం రాబడులు 2,92,477 కోట్లుకాగా పన్నులరాబడులే 2,08,100 కోట్ల వరకూ ఉంటుందని తెలిపారు. పన్నేతర రాబడులు 16,500 కోట్లు, కేంద్రనుంచి రాబడులు 67,877 కోట్లు ఉంటాయి. వీటికి అదనంగా రాబడులు స్థూల రుణపరపతిపరంగా 1.16 లక్షలకోట్ల వరకూ ఉంటుందని అంచనా వేసారు. ఇకమొత్తం వ్యయం కూడా 4,09,549 కోట్లుగా వ్లెలడించారు. రెవెన్యూ వ్యయం 3,11,739కోట్లుకాగా మూలధన వ్యయం 71,336కోట్లుగాఉంది. రుణ చెల్లింపులకు 26,476 కోట్లుకేటాయించారు. రెవెన్యూ లోటు 19,262 కోట్లుగా ఉంటుందని తెలిపారు.

# సెంట్రల్ వర్సిటీకి మన్మోహన్ పేరు

## అసెంబ్లీలో ప్రకటించిన కర్ణాటక సిఎం

**బెంగళూరు, మార్చి 7:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గౌరవార్థం ఆయన పేరును ఒక యూనివర్సిటీకి పెడుతున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరు సెంట్రల్‌యూనివర్సిటీకి దివంగత ప్రధాని మన్మోహన్‌సింగ్‌పేరుపెట్టాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. ఈ విషయాన్ని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అసెంబ్లీలో శుక్రవారం ప్రకటించారు. మన్మోహన్‌సింగ్ 2024 డిసెంబరు 26న తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం తర్వాత దేశంలో ఒక యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టడం ఇదే తొలిసారి. బెంగళూరు సెంట్రల్ యూనివర్సిటీని 2017లో స్థాపించారు. 2024లో తన 92వ ఏట కన్నుమూసిన మన్మోహన్‌సింగ్‌ను ఆధునిక ఆర్థిక సంస్కరణల రూపకర్తగా కీర్తిని సంపాదించారు. భారత దేశానికి ఆయన 13వ ప్రధానిగా పనిచేసారు. 2004నుంచి 2014 వరకూ యుపిఎ ప్రభుత్వంలో ప్రధానమంత్రిగా కొనసాగారు.



మన్మోహన్‌సింగ్‌తో సిద్ధరామయ్య(ఫైల్)

# అసెంబ్లీ ఎన్నికల్లో మహాకూటమికి తేజస్వి నాయకత్వం



**పాట్నా, మార్చి 7:** బీహార్ అసెంబ్లీకి ఈ ఏడాది చివరిలో జరిగే ఎన్నికల్లో మహాకూటమి పార్టీలు సమిష్టిగా ఆర్జేడి చీఫ్ తేజస్వియాదవ్ నేతృత్వంలో కలిసి పోటీచేస్తాయని నాయకులు చెపుతున్నారు. ఐదు పార్టీల లెజిస్లేచర్‌పార్టీ నాయకులు ఆర్జేడి ఎమ్మెల్యే అలోక్‌మెహతా ఇంట్లో సమావేశం అయ్యారు. అక్టోబరు నవం బరు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున మహాకూటమి సమిష్టిగా కృషిచేసి ఎలాంటి అభిప్రాయబేధాలు రాకుండా పోటీచేయాలని సూచించారు. ఆర్జేడీ, కాంగ్రెస్,సిపిఐ, సిపిఎం, సిపిఐఎంఎల్‌లిబరేషన్ పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తేజస్వియాదవ్ నాయకత్వంపై తమకు ఎంతో నమ్మకం ఉందని, సమిష్టిగా ఐకమత్యంతో కృషిచేసి ముందుకుపోవాలని నిర్ణయించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహాకూటమి అభ్యర్థులు విజయఢంకా మోగించేవిధంగా చర్యలుచేపట్టాలని, అందుకు తగిన కార్యాచరణ ఇప్పటినుంచే షురూచేయాలని కోరారు. అయితే కూటమి తరపున బహిరం గంగా ఎ లాంటి వ్యాఖ్యలు చేయవద్దని దీనివల్ల కూటమిపై ప్రభావం పడుతుందని ఈ సారి అసెంబ్లీ ఎన్నికలు మన కూటమికి అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎన్నికలని తేజస్వియాదవ్ సూచించారు. బీహార్ మాజీ డిప్యూటిసిఎం కూడా అయిన తేజస్వి ఎన్డీయే ఆధ్వర్యంలో అనేక అవకతవకలు అవినీతి జరుగుతోందని ఎన్డీయే లోపాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అదేసమయంలోఎన్డీయే అవకతవకలను కూడా చెప్పాలని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తేజస్వియాదవ్ నాయకత్వంపై తమకు ఎలాంటి అపోహలు లేవని స్పష్టం చేసారు. మహాకూటమి ఐకమత్యంతో ఉందని, మేమంతా కూడా సమి ష్టిగానే పనిచేస్తామని సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయ్‌శంకర్ దూబె అన్నారు. అంతకుముందు ఆర్జేడి, కాంగ్రెస్‌ల మధ్య విభేదాలు వచ్చాయన్న పుకార్లు లేచాయి. తేజస్వి నాయకత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే అజిత్‌శర్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రిని రాహుల్, సోనియా, మల్లిఖార్జున్‌ఖర్గేలు నిర్ణ యిస్తారన్నారు.అసెంబ్లీ ఎన్నికల తర్వాతజరిగే పార్లమెంటరీపార్టీ సమావేశంలోనే ఈనిర్ణయం జరుగుతుందని చెప్పడంతో కూటమిలో బీటలు ఏర్పడ్డాయన్న ప్రచారంరేగింది. బీహార్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కృష్ణ అల్లవారు మాట్లాడుతూ బీహార్ కాంగ్రెస్ ఎప్పుడూమొదటిస్థానంలోనే ఉంటుందని రానున్న ఎన్నికల్లోకూడా అదే తీరుతో కొనసాగుతుందని, కాంగ్రెస్ 'ఎ'టీమ్‌గా పని చేస్తుందని అనడంతో మళ్లీ పొరపొచ్చాలు ఏర్పడ్డాయి.

# హోటల్ గదిలో మరో టెకీ ఆత్మహత్య

## తన చావుకు భార్యే కారణమంటూ లేఖ

**ముంబయి, మార్చి 7:** తన చావుకు భార్యే కారణమంటూ ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కంపెనీ వెబ్‌సైట్‌లో సూసైడ్ నోట్ పోస్టు చేసి, ముంబయిలో ఒక హోటల్ గదిలో బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. కొన్ని రోజుల క్రితం జరిగిన ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం మృతుడి పేరు నిశాంత్ త్రిపాఠి. అతడు ఇటీవల ముంబయిలోని ఒక హోటల్‌లో దిగారు. చనిపోవడానికి ముందు తన గదికి 'డు నాట్ డిస్టర్బ్' అనే బోర్డు బయట తగిలించి ఉంచారు. దాంతో సిబ్బంది అటువైపుగా వెళ్లలేదు. కానీ ఎంతకీ అతడు గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన సిబ్బంది తమవద్ద ఉన్న తాళం చెవితో గది తలుపులు తెరిచారు. అలాగే పోలీసులకు సమాచారం అందించారు. కానీ అప్పటికే నిశాంత్ మరణించారు. చనిపోవడానికి ముందు తన కంపెనీ వెబ్‌సైట్‌లో సూసైడ్ నోట్‌ను షేర్ చేశారు. అందులో తన భార్య పట్ల తనకున్న ప్రేమను వ్యక్తంచేశారు. భార్యతో పాటు ఆమె బంధువు తన చావుకు కారణమని పేర్కొన్నారు. 'నువ్వు ఈ లేఖ చదివే సమయానికి నేనుండను. మనిద్దరి మధ్య జరిగిన వాటికి నేను నిన్ను ద్వేషించాలి. కానీ నేను ప్రేమనే ఎంచుకుంటా. నేను అప్పుడు, ఇప్పుడు నిన్ను ప్రేమిస్తున్నా. అది ఎప్పటికీ పోదు. మీ ఇద్దరి వల్ల నేను పడిన వేదనంతా నా తల్లికి తెలుసు. మీరు ఆమెను కలవొద్దు. ఇది నా కోరిక. ఇప్పటికే ఆమె చాలా బాధ పడింది. నా తల్లిని ప్రశాంతంగా అయినా బాధపడనివ్వండి' అని లేఖలో వాపోయారు. నిశాంత్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశారు. నిశాంత్ తల్లి ఒక మహిళా హక్కుల కార్యకర్త. తన కుమారుడి మరణంపై తీవ్ర ఆవేదనకు గురైన ఆమె సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. 'ఇంక నాకు జీవితమే లేదు. నేనొక జీవచ్ఛవాన్ని. నా బిడ్డ నన్ను వదిలిపెట్టి వెళ్లిపోయాడు' అని రాసుకొచ్చారు.



# నాలుగు రాష్ట్రాల్లో తుపాను విలయం!



**అట్లాంటా(యుఎస్), మార్చి 7:** అమెరికాలోని అనేక రాష్ట్రాల్లో తుపాను విలయం కొనసాగుతోంది. మిసిసిపిలో మృతులసంఖ్య మూడుకు చేరింది. ఓక్లహామాలో పలుచోట్ల ఇళ్లపై కప్పులు ఎగిరిపోయాయి. ఉత్తర కరోలినా, దక్షిణ కరోలినా, ఫ్లోరిడా, వర్జీనియాల్లో అధికారులు టోర్నడో హెచ్చరికలు జారీచేసారు. ఉత్తర కరోలినాలో ఈఎఫ్1 టోర్నడో వల్ల బలమైన గాలులు వీచాయి. దీనితో పలునిర్మాణాలు దెబ్బతినడంతోపాటు పలుచోట్ల విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. టెక్సాస్, ఓక్లహామా, లూసియానాల్లో ఇప్పటికే కనీసం ఏడు టోర్నడోలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. వీటి సంఖ్య మరింతపెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఫ్లోరిడానుంచి న్యూయార్క్ సిటీవరకూ వీటిప్రభావం ఉందన్నారు. తీవ్రగాలుల ప్రభావంతో టెక్సాస్‌లోని శాన్‌పాట్రిసియో కౌంటీలో సంభవించిన ఓ కార్చిచ్చు వల్ల 20కిపైగా ఇళ్లు కాలిపోయాయి. పసిఫిక్ నుంచి ముంచుకువస్తున్న తుపానుకారణంగా భారీ వర్షాలు, హిమపాతం వంటివి ఉంటాయని వాతావరణశాఖ హెచ్చరించింది. నెబ్రాస్కాలోని తూర్పుప్రాంతంలో భారీ వర్షంకురియడంతో రహదారులను మూసివేసారు. మిన్నెసోటాలోని మిన్నెపోలీస్ విమానాశ్రయంలో 18.8 సెంటీమీటర్ల మేర హిమపాతం కురిసింది. టెక్సాస్‌లో 51 వేళ ఇళ్లు, వర్జీనియాలో 27వేలు, టెన్నెసీలో 17వేల ఇళ్లకార్యాలయాలకు విద్యుత్ నిలిచిపోయింది. 800 విమాన సర్వీసులు రద్దయ్యాయి. అదేవిధంగా ఆస్ట్రేలియా తూర్పుప్రాంతంలో కూడా అల్‌ఫ్రెడ్ తుపాను భీభత్సం సృష్టించింది. భారీ వర్షాలతోప్రజారవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. వందలసంఖ్యలో స్కూళ్లమూతపడ్డాయి. క్వీన్స్‌ల్యాండ్ రాజధాని బ్రిస్బేన్ నగరంపై ఈతుపాను ప్రభావం తీవ్రంగా ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. న్యూసౌత్‌వేల్స్‌లో 4500 ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

# బిసి గురుకులాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** తెలంగాణలోని బీసీ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ క్రమంలో బాలు, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం వచ్చే 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6,7,8,9వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అప్లికేషన్లకు ఈ నెల 31 చివరి తేదీగా ప్రకటించారు. హాల్‌టికెట్లను ఏప్రిల్ 15వ తేదీన విడుదల చేస్తారు. ఈ తరుణంలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా సీట్లను భర్తీ చేయనున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల వయసు 6వ తరగతిలో ప్రవేశానికి ఆగస్టు 31వ తేదీ నాటికి 12 సంవత్సరాలు మించకూడదు, 10 సంవత్సరాలకు తగ్గకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 2 సంవత్సరాల మినహాయింపు కలదు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు మించకూడదు. ఈ నోటిఫికేషన్‌కు దరఖాస్తు ఫీజు రూ.150 ఉంటుంది.

# వైద్యవిద్య, ఇంజినీరింగ్ కోర్సులను తమిళంలో బోధించండి

### త్రిభాష సూత్రంపై స్టాలిన్ వ్యాఖ్యలకు కేంద్రమంత్రి అమిత్‌షా కౌంటర్



**రాణిపేట్(చెన్నై), మార్చి 7:** త్రిభాషా సూత్రం తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్‌చేస్తున్న ఇంజినీరింగ్, వైద్య విద్యను తమిళ భాషలో బోధించాలని తమిళనాడు సీఎం స్టాలిన్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సవాల్ చేసారు. హిందీభాషను వ్యతిరేకిస్తూ స్టాలిన్‌చేస్తున్న వ్యాఖ్యలకు కౌంటర్‌గా అమిత్‌షా తన అభిప్రాయం తెలిపారు. కేంద్ర బలగాల్లో ఇప్పటివరకూ స్థానిక భాషల్లో పరీక్షలురాసే వీలులేదని, అయితే మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్థానిక భాషల్లో పరీక్షలు రాసే వీలు కల్పించిందని, ఇపుడు సిఐఎస్ఎఫ్ పరీక్షను తమిళంలోను రాయవచ్చని మంత్రి అన్నారు. తమిళనాడు రాణిపేటలో జరిగిన 56వ సిఐఎస్ఎఫ్ రైజింగ్‌డే ఈవెంట్‌లోపాల్గొని ఆయన మాట్లాడారు. తమిళ విద్యార్థుల లబ్ధికోసం ఇంజినీరింగ్, మెడికల్ విద్యను తమిళంలో బోధించాలని సీఎం స్టాలిన్‌ను కోరుతున్నట్లు అమిత్‌షా తెలిపారు. భారతీయ సంస్కృతిని బలోపేతంచేయడంలో తమిళనాడు కీలకపాత్రపోషించిందన్నారు. పరిపాలనా సంస్కరణలైనా ఆధ్యాత్మికవిదినైనా విద్య అయినా దేశ సమగ్ర ఐక్యత అయినా తమిళనాడుపాత్రను విస్మరించలేమని అమిత్‌షా స్టాలిన్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.

# ప్రభుత్వ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలి

### పంటలు ఎండిపోకుండా ప్రణాళికాబద్ధంగా సాగునీటి సరఫరా చేయాలి

### నీటిపారుదల శాఖకు సంబంధించి మంజూరైన పనులను గ్రౌండ్ చేయాలి: మంత్రి పొంగులేటి



**కూసుమంచి, మార్చి 7, ప్రభాతవార్త :** ప్రభుత్వ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి సాగు, త్రాగునీటి సరఫరా, మున్నేరు రిటైనింగు వాల్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రోడ్డు మరమ్మతు, అభివృద్ధి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో రైతులు వేసిన పంటలో ఒక్క ఎకరం కూడా ఎండి పోవద్దని, పంట పొలాలకు అవసరమైన నీరు ప్రణాళికాబద్ధంగా రైతులకు అందించాలని అన్నారు. నాగార్జున సాగర్, పాలేరు రిజర్వాయర్లలో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, నీరు వృధా కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా పకడ్బందీగా పర్యవేక్షించాలని అన్నారు. సాగునీరు విడుదల షెడ్యూల్ రైతులకు సమాచారం అందించాలని అన్నారు. భక్త రామదాసు, సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి పాలేరు నియోజకవర్గంలో భూసేకరణ పెండింగ్ బిల్లుల సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలో మంజూరైన చెక్ డ్యాంలకు ప్రతిపాదనలు తయారు చేసి యూ.టి. ల నిర్మాణానికి టెండర్లు పిలవాలని మంత్రి ఆదేశించారు. నీటిపారుదల శాఖకు సంబంధించి పనులు గ్రౌండింగ్ అయ్యేలా కార్యాచరణ చేపట్టాలని అన్నారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి 176 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందని, భూములు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూమిని ఇచ్చి, భూసేకరణ చేసేలా అధికారులు రైతులతో చర్చలు జరపాలని అన్నారు.

# పెరేడ్‌గ్రౌండ్‌లో నేడు లక్ష మంది మహిళలతో మహిళా దినోత్సవం

### హాజరుకానున్న సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీసిఎం భట్టి విక్రమార్క

### ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త :** అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పరేడ్ గ్రౌండ్ వేదికగా మహిళా సదస్సును రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.ఈ కార్యక్రమం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అధ్యక్షతన సభ జరగనుంది. సభా వేదికగా లక్ష మంది మహిళల సమక్షంలో ఇందిరా మహిళా శక్తి మిషన్2025ను సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. మహిళా సంఘాలు ఈ ఏడాది సాధించిన విజయాలతోపాటు, మహిళా సాధికారత బలోపేతం కోసం ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాలను ఇందిరా మహిళా శక్తి మిషన్2025 లో పొందు పరిచారు. అయితే ఇందిరా మహిళా శక్తి మిషన్2025 ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు 32 జిల్లాల నుంచి మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశాలుండటంతో..పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది. మహిళా సభ్యులను సభకు ఆహ్వానిస్తూ మంత్రి సీతక్క స్వయంగా జిల్లా మహిళా సమాఖ్యలకు ఆహ్వానాలు పంపారు. గౌరవ అతిధులుగా హాజరై సభను సక్సెస్ చేసే మహిళా సంక్షేమం కోసం పెద్ద పీట వేస్తున్నప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. జిల్లాల నుంచి వచ్చే మహిళల కోసం 600 కు పైగా ఆర్టీసీ బస్సులను సెర్ప్ అందుబాటులో ఉంచింది. దీంతో పాటు జిల్లాకొక అధికారిని నియమించి బాధ్యతలు అప్పగించింది. మహిళలకు ఇంటి నుంచి బయలు దేరినప్పటి నుంచి ఇంటికి సురక్షితంగా చేరుకునే వరకు ఈ అధికారులు సమన్వయం చేస్తారు. ఎక్కడ ఏలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సదుపాయాలను కల్పించారు. సాయంత్రం ఐదు గంటలకు సభ ప్రారంభం కానున్న నేపథ్యంలో మహిళలంతా అరగంట ముందే సభా స్థలికి చేరుకునేలా ప్లాన్ చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి మహిళలు వచ్చే అవకాశా లుండ టంతో ఏడున్నర గంటల లోపు సభను ముగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.సభ ఏర్పాట్లపై మంత్రి సీతక్క శుక్రవారం నాడు పరేడ్ గ్రౌండ్ ను సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. సభకు వచ్చే మహిళలకు ఏలాంటి అసౌకర్యం జరక్కుండా ఏర్పాటు చేయాలని సూచించారు.
తాగునీరు, విద్యుత్ నిరంతరాయంగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సచివాలయంలో జిల్లా డీఆర్డీఏ, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి కాలమైనందున జాగ్రత్తలు పాటించాలని కోరారు. వాటర్ బాటిల్స్, టవల్స్ ప్రతి ఒక్కరి వద్ద ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు మంత్రి సీతక్క మాట్లాడుతూ..సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం మమహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్స హించిందన్నారు.

# క్రీడాకారుల సెలక్షన్‌లో అక్రమాలకు చెక్

### పారదర్శకంగా ఉండాల్సిందే

### సమాఖ్యలకు కేంద్రం మార్గదర్శకాలు

**హైదరాబాద్, మార్చి, 7 ప్రభాతవార్త:** క్రీడాకారుల ఎంపిక విషయంలో పారదర్శకత పెంపొందించా లని కేంద్రం నిర్ణయించింది. ప్రధానంగా క్రీడాకారుల ఎంపికలో అక్రమాలు, అవకతవకలు జరగకుండా ఉండేందుకు చెక్ పెడుతోంది. ఈ నేపథ్యంలో జాతీయ క్రీడా సమాఖ్యలకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ కొత్తగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ముఖ్యంగా సెలెక్షన్ ప్రక్రియను వీడియో రూపంలో పొందుపరచాలని స్పష్టం చేసిన కేంద్ర మంత్రిత్వ శాఖ అంతకు ముందు పాటించాల్సి న నిబంధనలను తాజాగా వెల్లడించింది. సెలెక్షన్లో అవకతవకలకు తావివ్వ కుండా జవాబుదారీతనం పెంపొందించేందుకు ఇవి ఉపయోగపడనున్నాయని వెల్లడించింది. క్రీడాకారులను ఎంపిక చేయడానికి 15 రోజుల ముందే దానికి సంబంధించిన పూర్తివివరాలను వివిధ జాతీయ క్రీడా సమాఖ్యలు వెల్లడించాలని సూచించింది. దీనివల్ల ట్రయల్స్‌లో అన్యాయం జరిగిందనే విమర్శలకు అవకాశం ఇవ్వకూడదని భావిస్తోంది. ఇటీవలి కాలంలో రెజ్లింగ్, షూటింగ్‌తో పాటు, సెలెక్షన్స్ అవకతవకలపై పలు ఫిర్యాదులు అందడంతో కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ జాతీయ క్రీడా సమాఖ్యలకు ప్రత్యేక సూచనలు చేశారు. భారత ఒలింపిక్స్ సంఘం (ఐఒఏ), స్పోర్ట్స్ అథారిటీఆఫ్ ఇండియా (సాయ్), జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్)లకు పంపించింది. ఎంపిక ప్రక్రియకు సంబంధించిన నియమ నిబంధనలను ప్రతి సమాఖ్య తమ అధికారిక వెబ్‌సైట్లో పొందుపరచడం తప్పనిసరి. సెలెక్షన్లకు మూడు నెలల సమయం ఉన్నప్పుడు మాత్రమే వాటిలో మార్పు చేర్పులు చేయాలి. సెలెక్షన్ ప్రక్రియ అంతా వీడియోలో నిక్షిప్తం చేయాలి. వీటి రికార్డులను సెలెక్షన్ కమిటీ సంతకం చేసిన అనం తరం విధిగా సాయ్‌కు అందజేయాలి. ప్రతి ట్రయల్‌కు ముందు అవసరమైన ఆర్థిక సహాయానికి సంబంధించిన వివరాలను మంత్రిత్వ శాఖకు తెలియజేయాలి. ఒలింపిక్స్, పారాలింపిక్స్, ఆసియా గేమ్స్, పారా ఆసియా గేమ్స్, కామన్వెల్త్ క్రీడల వంటిపెద్ద టోర్నీల ఎంపిక ప్రమాణాలను కనీసం రెండు సంవత్సరాల ముందుగానేపొందుపరచాలి. ఈ అంశంలో అథ్లెట్లకు అవగాహన కల్పించాలి. అలాగే విదేశీ టోర్నీల్లో పాల్గొనేందుకు వెళ్లే సమయంలో పాటిస్తున్న నిబంధనల విషయంలో కీలక సవరణలు చేసింది. దీని ప్రకారం సెలెక్షన్ కమిటీలోని సభ్యులెవరూ ఫిర్యాదుల పరిష్కార కమిటీలో భాగం కారాదు. ఇది సహజ న్యాయ సూత్రానికి విరుద్ధం. జాతీయ క్రీడా సమాఖ్య వివాద పరిష్కార కమిషన్‌ను ఏర్పాటు చేసుకోవాలి. జాతీయ క్రీడా సమాఖ్యల అధ్యక్షులు ఎంపిక ప్రక్రియను దగ్గరుండి పరిశీలించాలి. హై పెర్ఫార్మెన్స్ డైరెక్టర్, చీఫ్ కోచ్, మాజీ క్రీడాకారులు, ఖేల్‌రత్న, అర్జున అవార్డు గ్రహీతలు ఇలా అందుబాటులో ఉన్న వారిని సెలెక్షన్ కమిటీకి ఎంపిక చేసేఅధికారం జాతీయ క్రీడా సమాఖ్య అధ్యక్షులకు అప్పగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

# 25న జిఆర్ఎంబి సమావేశం

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** గోదావరి రివర్‌మేనేజ్‌మెంట్ సమావేవం ఈనెల 25న హైదరాబాద్‌లోని జలసౌధలో నిర్వహించబోతున్నారు. 17వ సమావేశంలో గోదావరి బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాలని తెలంగాణ ప్రభుత్వం అభ్యర్థనను జిఆర్ఎంబి ఎజెండాలో చేర్చింది,. జిఆర్ఎంబి 16వ మీటింగ్ మినిట్స్‌తోపాటు ఎజెండా కాపిని పొందుపరిచి తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖలకు ఉన్నతాధికారులకు మీటింగ్ నోటీసును పంపారు.



# రైలు పట్టాల పక్కన రెండో ప్రపంచయుద్ధంనాటి బాంబు

### కలకలం రేపిన పారిస్ దారేడు నార్డ్ రైల్వేస్టేషన్ ఘటన

**పారిస్, మార్చి 7:** ఫ్రాన్స్ రాజధాని పారిస్‌కు సమీపంలోని ఒక రైలు మార్గంలోపేలని బాంబు గుర్తించడంతో కలకలం రేగింది. రాత్రిపూట సాధారణ తనిఖీలుచేస్తున్నపుడు పట్టాల సమీపంలో ఒక బాంబును గుర్తించారు. పరిశీలించిన భద్రతా సిబ్బంది రెండోప్రపంచ యుద్ధం నాటిదిగా తేల్చారు. పారిస్‌లో అత్యంత రద్దీగా ఉండే గారే దూనార్త్‌మార్గంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనితో ఆస్టేషన్‌ను తాత్కాలికంగామూసివేసారు. ఫలితంగా అనేక రైలు సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ట్రాకులవద్ద బాంబు ఉన్న విషయాన్ని ఫ్రెంచ్ నేషనల్ రైల్వే కంపెనీ కూడా నిర్ధారించింది. ఈనేపథ్యంలో హైస్పీడ్, టిజివి, యూరోస్టార్ రైల్లు సహా గారే డు నార్డ్ స్టేషన్‌నుంచి రాకపోకలు సాగించే ఇతర సర్వీసులను కూడా తాత్కాలికంగా నిలిపివేసారు. ప్రయాణీకులు గంటలకొద్దీ వేచి చూస్తున్నారు. ఈ ప్రభావం ఒకరోజు మొత్తం ఉండొచ్చని అధికారులు అంచనావేస్తున్నారు. పోలీసులు బాంబు స్క్వాడ్ బృందాలు దాన్ని నిర్వీర్యంచేసేపనిలో ఉన్నాయి. ఉత్తర పారిస్‌లోని గారేడు నార్డ్ స్టేషన్ నిరంతరం రద్దీగా ఉంటుంది.

# క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డిజిగా హిమాన్ష్ బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్, మార్చి, 7 ప్రభాతవార్త:** ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ ది సెమీ అరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిసాట్) డైరెక్టర్ జనరల్‌గా డాక్టర్ హిమాన్షు పాఠక్ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ పటాన్‌చెరులోని ఇక్రిసాట్ కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. అంతకు ముందు డైకర్టర్ జనరల్‌గా డాక్టర్ జాక్వెలిన్ హ్యూస్ డైరక్టర్ జనరల్‌గా వ్యవహరించగా, ఆయన పదవీ కాలం ముగియడంతో ఆ స్థానంలో హిమాన్షును నియమించింది. బాధ్య తలు స్వీకరించిన తర్వాత డాక్టర్ పాఠక్ మాట్లాడుతూ, ఎండిన భూము లలో వ్యవసాయ స్థితిస్థాపకతను పెంపొందించే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు.

# ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు 50 మంది బిసి గురుకుల విద్యార్థుల ఎంపిక


### విద్యార్థులను అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్, మార్చి, 7 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసే ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు 50 మంది బిసి గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులను బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులు అభినందించారు. బిసి గురుకులాల్లోని 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న.. పది నుంచి 15 సంవత్స రాల వయస్సు గల విద్యార్థులకు నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో 50 మంది విద్యారులు ఎంపిక కావడం అభినందనీయమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థులు తమ తెలివితేటలతో ఎన్నో కొత్త ఆవిష్కరణలు చేస్తున్నారని, వారిలోని ప్రతిభను గుర్తించి ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ వారిని ఇన్‌స్పైర్ లాంటి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్స హించాలని మంత్రి సూచించారు. ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనా విద్యార్థుల బ్యాంక్ అకౌంట్‌లో పదివేల రూపాయలు జమ అవుతాయని, ఈ డబ్బుతో వారి ఆలోచన మేరకు ప్రాజెక్టను చేసి ప్రదర్శనలో ఉంచాలని మంత్రి సూచించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులను స్కూల్ స్థాయి నుంచే భాగస్వామ్యులను చేసేం దుకు ఈ ప్రదర్శన ఎంతో ఉపయోగ పడుతుం దన్నారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమంగా నిలిచిన ప్రాజెక్టను జాతీయ స్థాయిలో ప్రదర్శిస్తారని.. విద్యార్థులు, ఉపాధ్యా యులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ప్రతిభకు సృజనాత్మకతను జోడించి ప్రాజెక్ట్ చేయాలన్నారు. సామాజిక ప్రయోజనం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని.. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ప్రాజెక్ట్ చేయడంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశనం చేయాలని మంత్రి సూచించారు. విద్యార్థి దశ నుంచే సరికొత్త ఆవిష్కరణలతో విద్యార్థులు రాణించినప్పుడే భవిష్యత్‌లో వారు గొప్ప గొప్ప సైంటిస్ట్‌లుగా ఎదుగుతారన్నారు. విద్యార్థులకు కావల్సిన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని.. విజ్ఞానం పెంచుకోవడం, సృజనాత్మకత పెంపొందించుకోవడం ద్వారా తమ భవిష్యత్ ను గొప్పగా తీర్చిదిద్దుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

# ఢిల్లీలో భారత విదేశాంగ శాఖ అధికారి ఆత్మహత్య!

**న్యూఢిల్లీ, మార్చి 7:** విదేశాంగశాఖకు చెందిన అధికారి జితేంద్రరావత్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. భవనంపై నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నారు. శుక్రవారం ఢిల్లీలోని చాణక్యపురి ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై ఆ శాఖ స్పందించింది. విదేశాంగశాఖకు చెందిన రెసిడెన్షియల్ సొసైటీలో అధికారులు నివాసం ఉంటున్న భవనం టెర్రస్ పై నుంచి దూకి రావత్ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆయన తన తల్లితో పాటు ఆ ఇంట్లో ఉంటున్నారు. రావత్ భార్య, ఇద్దరు పిల్లలు ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో నివసిస్తున్నారు. కొంతకాలంగా డిప్రెషన్‌తో బాధపడుతూ ఆయన చికిత్స కూడా తీసుకుంటున్నారు.
ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని ఢిల్లీ పోలీసులు తెలిపారు. విదేశాంగశాఖ ఆయన మృతిని ధృవీకరిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ క్లిష్టమైన సమయంలో ఆ కుటుంబానికి అన్ని రకాలుగా సాయం అందిస్తున్నాం. కేసు విచారణలో ఎప్పటికప్పుడు ఢిల్లీ పోలీసులతో సంప్రదింపులు చేస్తున్నాం అని పేర్కొంది. బాధిత కుటుంబం గోప్యత దృష్ట్యా ఇతర వివరాలేవీ వెల్లడించడం లేదని తెలిసింది.



శుక్రవారం రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రం అందజేస్తున్న నాగబాబు, పాల్గొన్న ఎపి మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్ రాజు తదితరులు

# నాగబాబు నామినేషన్ దాఖలు

### ఎపిలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ సీటుకు పోటీ

**విజయవాడ మార్చి 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ శాసనసభసభ్యుల కోటాలో ప్రకటించబడిన ఐదు శాసనమండలి సభ్యుల (ఎంఎల్‌సీ) ఎన్నికకు కూటమి తొలి అభ్యర్థిగా కొణిదెల నాగబాబు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్ర శాసనసభ భవనంలో రిటర్నింగ్ అధికారి, రాష్ట్ర శాసనమండలి ఉపకార్యదర్శి ఆర్.వనితా రాణికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఎం. ఎల్.సి. అభ్యర్థిగానామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన ఆయనతోపాటు రాష్ట్ర మానవ వన రుల అభివృద్ధిశాఖ మంత్రి నారాలోకేష్, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్‌రాజు హాజరయ్యారు. కొణిదెల నాగబాబు తన నామినేషన్ పత్రంతోపాటు బిఫార్మ్, అఫడవిట్, సెక్యూరిటీ డిపాజిట్ తదితర పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. రిటర్నింగ్ అధికారి ఆర్.వనితారాణి ఆ నావినేషన్ పత్రాలను పూర్తిగా పరిశీ లించిన పిదప భారత సంవిధానపు 173 (ఎ) పరచ్ఛేదము ప్రకారం ఆయనచే ప్రతిజ్ఞ చేయిం చారు. సహాయ రిటర్నింగ్ అధికారులు మరియు ఆంధ్రప్రదేశ్ శాసన సభ సహాయ కార్యదర్శులు ఆర్. శ్రీనివాసరావు, ఎం. ఈశ్వరరావు నావినేషన్ తదితర పత్రాల పరిశీనలో రిటర్నింగ్ అధికారి సహకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, అలాగే నామి నేషన్‌ను బలపరిచిన లోకేష్, మనోహర్‌కు నాగ బాబు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేల కోటా లో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమిలో భాగంగా జనసేన అభ్యర్థిగా నాగబాబు పేరును పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ ఖరారు చేశారు.

# విదేశీయులను టార్గెట్ చేస్తూ నకిలీ కాల్‌సెంటర్ల దోపిడీ

### హైదరాబాద్ తరహాలో దేశంలో మరిన్ని ఉన్నట్లు టిజిసిఎస్‌బి అనుమానం

### రెండు నెలల వ్యవధిలో 18 వేల మందికిపైగా అమెరికన్లకు టోకరా

**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** నకిలీ కాల్ సెంటర్ పేరు వినగానే ప్రైవేటు కంపెనీలు, బడా సంస్థల్లో మంచి వేతనలతో కూడిన ఉన్నత ఉద్యోగాలు ఇప్పిస్తామ ని నిరుద్యోగుల నుంచి వేల రూపాయల నుంచి లక్షల రూపాయలు దండుకుని బిచాణా ఎత్తేయడం వరకే చూశాం. దేశ వ్యాప్తంగా అనేక నగరాలలో ఈ తరహా నకిలీ కాల్ సెంటర్లు ఇప్పటికీ వందల సంఖ్యలో వున్నాయంటే అతిశయోక్తి కాదు. అయితే వీటికి భిన్నంగా విదేశీయులు ముఖ్యంగా అమెరికన్లను టార్గెట్ చేస్తూ కోట్లాది డాల ర్లను దోచుకునేందుకు హైదరాబాద్‌లో ఏర్పాటైన నకిలీ కాల్ సెంటర్ పోలీసు శాఖను షాక్‌కు గురిచేసింది. అమెరికాలోని పే పాల్ వినియోగదారుల (భారత్‌లో వుండే ఓ సెల్ కంపెనీ తరహా వినియోగదారులు)ను పథకం ప్రకారం టార్గెట్ చేసి వారి వ్యక్తిగత వివరాలతో పాటు బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించి క్షణాల వ్యవధిలో ఖాతాలు ఖాళీ చేస్తున్న ముఠా గోల్‌మాల్ వ్యవహారాలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ఆరా తీయసాగింది. ఎక్సిటో సొల్యూషన్స్ పేరిట ఏర్పా టైన నకిలీ కాల్ సెంటర్ తరహాలో దేశంలో మరికొన్ని వుండవచ్చని టిజిసిఎస్‌బి అధికారులు భావిస్తున్నారు. దీనిపై ముఖ్యమైన నగరాల పోలీసులను అప్రమత్తం చేశా రు. సైబర్ నేరగాళ్లు పంథా మార్చారు. పోలీసులకు దొరకకుండా వుండేందుకు, ఫిర్యాదు చేసేందుకు బాధితులు రాకుండా జాగ్రత్త పడుదూ కొత్త తరహా నేరాలను ఎంచు కున్నారు.

ఈ క్రమంలో హైదరాబాద్‌లో తాజాగా రట్టయిన నకిలీ కాల్ సెంటర్. నగరంలో ఇంతకు ముందు కొన్ని నకిలీ కాల్ సెంటర్ల బండారం బయటపడినా అవ న్నీ నిరుద్యోగులను ఉద్యోగాల పేరిట మోసం చేసినవే కావడం గమనార్హం. అయితే తొలిసారిగా అమెరికన్లు సహా విదేశీయులను పథకం ప్రకారం మోసం చేస్తూ వారి బ్యాంకు ఖాతాల నుంచి 100 డాలర్ల నుంచి 500 డాలర్లు, వెయ్యి డాలర్ల వరకు నగదును కాజేస్తున్న నకిలీ కాల్ సెంటర్ బాగోతం సంచలనం రేపింది. నగరానికి చె ందిన మనస్విని అనే యువతి గుజరాత్‌కు చెందిన కైవాన్ పటేల్, విక్కీ పటేల్, రూపేష్ కుమార్ అనే నేరగాళ్లతో కలిసి ఈ నకిలీ కాల్ సెంటర్‌ను నిర్వహిస్తోంది. గు జరాత్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు సైబర్ నేరాలలో ఆరితేరిన వారు కాగా వీరు దుబాయ్‌లో వుంటూ బడా సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి వ్యవహా రాలను నడుపు తున్నారు. ఆంగ్లంలో పరిజ్ఞానం వుండి అమెరికన్ల తరహాలో మాట్లాడగలుగుతున్న ఈశాన్య రాష్ట్రాలకు చెందిన యువతీ, యువకులను ఎంపిక చేసుకుని వారిచేత అమె రికాలోని పేపాల్ ఖాతాదారుల వివరాలు సోషల్ మీడియా, వెబ్‌సైట్ల నుంచి సేకరించి వారికి ఫోన్ చేయడం ద్వారా మోసాలు ప్రారంభిస్తారు. ఇందుకోసం రెండు బృం దాలు పనిచేస్తాయి. మొదటి బృందం పే పాల్ కంపెనీ ప్రతినిధులుగా చెప్పుకుంటూ ఫోన్‌లు చేసి మీ ఖాతాలు హాక్ అయ్యాయని, మీరు పలానాచోట తప్పుడు పద్ధ తుల్లో లావాదేవీలు నడిపారనో బెదిరించి, వారి బ్యాంకు వివరాలు, క్రెడిట్ కార్డుల వివరాలు సేకరిస్తుంది. ఇదే సమయంలో రెండవ బృందం రంగంలో దిగి ఈ వివ రాల ఆధారంగా అమెరికన్ల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నాయి. రెండు నెలలుగా పనిచేస్తున్న ఈ నకిలీ కాల్ సెంటర్ ఇప్పటి వరకు నిత్యం ఐదు వందల మంది అ మెరికన్లకు ఫోన్‌లు చేసినట్లు తేలింది. ఇందులో నిత్యం 300 మంది వరకు మోసపోయినట్లు భావిస్తున్నారు. ఈ లెక్కన రెండు నెలల్లో 18 వేల మందికి పైగా మోస పోయివుంటారని భావిస్తున్నారు. వీరు కోట్లాది డాలర్లు మోసపోయి వుంటారని భావిస్తున్నారు. ఈ కేసులో మనస్వినితో పాటు 62 మంది టెలికాలర్లు అరెస్టవగా దుబాయ్‌లో వుండే ముగ్గురు నేరగాళ్లతో పాటు మరో 70 మంది కోసం గాలిస్తున్నారు. దుబాయ్‌లో వున్న ము గ్గురు కీలక నేరగాళ్లను భారత్‌కు తీసుకువచ్చి విచారిస్తే నకిలీ కాల్ సెంటర్‌కు సంబంధించి మరింత సమాచారం వెలుగుచూసే వీలుందని టిజిసిఎస్‌బి అధికారులు భావి స్తున్నారు.



# మహిళల వన్డేలో .. న్యూజిలాండ్ విక్టరీ

## 78 పరుగుల తేడాతో శ్రీలంకపై గెలుపు

**న్యూఢిల్లీ:** మహిళల వన్డేలో సొంత గడ్డమీద న్యూజిలాండ్ శ్రీలంకను చిత్తుగా ఓడించి. న్యూజిలాండ్, శ్రీలంక మహిళా జట్ల మధ్య ఇవాళ శుక్రవారం వన్డే మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో శ్రీలంకను 78 పరుగుల తేడాతో న్యూజిలాండ్ చిత్తు చేసింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ మిడిలార్డర్ బ్యాటర్ మ్యాడీ గ్రీన్ అద్భుత సెంచరీతో (100) కదం తొక్కడంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో గ్రీన్ మినహా ఎవరూ పెద్ద స్కోర్లు చేయలేకపోయారు. జార్జియా ప్లిమ్మర్ 28, ఇసబెల్లా గేజ్ 19, జెస్ కెర్ 38, పోల్లీ ఇంగ్లిస్ 34 (నాటౌట్) పరుగులు చేశారు. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 46 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కెప్టెన్ సూజీ బేట్స్ 5, ఎమ్మా మెకలియోడ్ 6, బ్రూక్ హ్యాల్లీడే 6 పరుగులకు ఔటయ్యారు. ఈ దశలో జార్జియా ప్లిమ్మర్ కొద్దిసేపు సంయమనంతో బ్యాటింగ్ చేసింది. తదుపరి ప్లిమ్మర్ 54 బంతులు ఎదుర్కొని 28 పరుగులు చేసి ఔటైంది. అనంతరం గ్రీన్, గేజ్, కెర్, ఇంగ్లీస్ సహకారంతో సెంచరీ పూర్తి చేసుకుంది. అయితే తదుపరి గ్రీన్ చివరి బంతికి రనౌటైంది. లంక బ్యాటర్లలో చమారి ఆటపట్టు 2 వికెట్లు పడగొట్టగా, అచిని కులసూరియ, ఇనోషి ప్రియదర్శిని, కవిశ దిల్హారి తలో వికెట్ దక్కించుకున్నారు. దీంతో 246 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక 46.4 ఓవర్లలో 167 పరుగులకే చాప చుట్టేసి ఓటమిపాలైంది. కివీస్ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేసి శ్రీలంక బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చారు. హన్నా రోవ్ 4, బ్రీ లింగ్, ఏడెన్ కార్సన్ 2, సూజీ బేట్స్ ఓ వికెట్ తీశారు. జెస్ కెర్ వికెట్ తీయకపోయినా అత్యంత పొదుపుగా బౌలింగ్ చేసింది. శ్రీలంక ఇన్నింగ్స్‌లో హర్షిత సమరవిక్రమ (59) ఒక్కరే అర్ధ సెంచరీతో రాణించారు. కవిష దిల్హారి 25, నీలాక్షి డిసిల్వ 20, అనుష్క సంజీవని 13 (నాటౌట్), కుగంధిక కుమారి, కెప్టెన్ ఆటపట్టు తలో 11 పరుగులు చేశారు. మనుడి ననయక్కార, ఇనోషి ప్రియదర్శిని డకౌట్లు కాగా, మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. ఈ గెలుపుతో న్యూజిలాండ్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది.

## ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో..

# అత్యధిక రన్స్ చేసిన హీరో?

## టాప్ ప్లేయర్ల రేస్‌లో భారత్

### ఇప్పటి వరకూ జరిగిన మ్యాచ్‌ల్లో టాప్‌లో డకెట్



బెన్ డకెట్



రచిన్ రవీంద్రా



విరాట్ కోహ్లీ



శ్రేయస్ అయ్యర్



టామ్ లాథమ్



కేన్ విలియమ్సన్

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ-2025 మరో 36 గంటల్లో జరిగే ఫైనల్ మ్యాచ్‌తో ముగియనుంది. ఈ నెల 9వ తేదీన జరిగే ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, న్యూజిలాండ్ పోటీ పడనున్నాయి. ఇక ఈ రెండు జట్ల మధ్య పోటీతో ఛాంపియన్స్ ట్రోఫీ ఎవరిదో తేలిపోనుంది. దీంతో ఈ టోర్నమెంట్‌లో అత్యధిక రన్స్ చేసిన ప్లేయర్ల రేసులో హీరో ఎవరనేది కూడా వెల్లడికానుంది. అయితే ఇప్పటి వరకూ జరిగిన ఈ ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో అత్యధిక రన్స్ చేసిన టాప్ ప్లేయర్లలో భారత్ ఆటగాళ్లు సైతం ఉన్నారు. అయితే ఈ టోర్నీలో అత్యధిక రన్స్ చేసిన ప్లేయర్‌గా నిలిచే ఛాన్స్ ఎవరికి ఉందనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటి వరకు అయితే అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్ అగ్రస్థానంలో ఉన్నాడు. 3మ్యాచ్‌ల్లో కలిపి డకెట్ 227 పరుగులు చేశాడు. అతని తర్వాత న్యూజిలాండ్ యువ సంచలనం, మన భారత సంతతికి చెందిన ఆటగాడు రచిన్ రవీంద్రా ఉన్నాడు. రచిన్ 3 మ్యాచ్‌ల్లో 226 పరుగులు చేసి సెకండ్ ప్లేస్‌లో ఉన్నాడు. రచిన్‌కు ఎలాగో టీమిండియాపై మంచి రికార్డ్ ఉండటంతో ఫైనల్ రెండు రన్స్ చేసినా డకెట్‌ను దాటేస్తాడు. కానీ మరిన్ని పరుగులు చేస్తే తన టీమ్‌లో ఉన్న ప్లేయర్లతో టీమిండియా ఆటగాళ్ల కంటే ముందు ఉంటాడు. ఇక టీమిండియా సూపర్ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సైతం ఈ లిస్ట్‌లో దూసుకెళ్తున్నాడు. పాకిస్థాన్‌పై సెంచరీ, ఆస్ట్రేలియాపై 84 పరుగులు క్వాలిటీ ఇన్నింగ్స్‌తో ప్రస్తుతానికి కోహ్లీ 217 పరుగులతో నాలుగో స్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్‌తో ఫైనల్‌లో రచిన్ తక్కువ పరుగులకు అవుటై, అతన్ని కోహ్లీ బీట్ చేస్తే ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా కోహ్లీ నిలుస్తాడు. విరాట్ కోహ్లీ సొంత టీమ్ నుంచే గట్టి పోటీ ఉంది. అది కూడా తన తర్వాత ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ నుంచి. అయ్యర్ ఇప్పటి వరకు 4 మ్యాచ్‌ల్లో 195 పరుగులు చేశాడు. కోహ్లీ కంటే జస్ట్ 22 పరుగులు మాత్రమే వెనుకబడి ఉన్నాడు. అవి దాటి ఆ తర్వాత మరిన్ని పరుగులు చేస్తే అయ్యర్ ఫస్ట్ ప్లేస్‌కి చేరే ఛాన్స్ ఉంది. ఇక అయ్యర్ తర్వాత న్యూజిలాండ్ ఆటగాళ్లు టామ్ లాథమ్, కేన్ విలియమ్సన్ కూడా అత్యధిక పరుగులు చేసిన ఆటగాడి ప్లేస్ సాధించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. లాథమ్ 193, విలియమ్సన్ 189 పరుగులతో ఉన్నారు. సౌతాఫ్రికాతో జరిగిన సెమీ ఫైనల్‌లో కేన్ మామ సూపర్ సెంచరీతో మంచి టచ్‌లో కనిపిస్తున్నాడు. ఇండియాపై కూడా బాగా ఆడితే నంబర్ ప్లేస్ చేరుకుంటాడు.

లాస్ట్ బట్ నాట్ లీస్ట్ టీమిండియా యంగ్ గన్ శుభమ్‌మన్ కూడా ఈ లిస్ట్‌లో నేనున్నాను అంటున్నాడు. కానీ, గిల్ కచ్చితంగా ఫైనల్‌లో సెంచరీ చేస్తేనే మిగతా అందర్నీ దాటుకొని ఫస్ట్ ప్లేస్‌కి వెళ్లే అవకాశం ఉంది. గిల్ సెంచరీ చేయడంతో పాటు రచిన్, కోహ్లీ లాంటి టాప్‌లో ఉన్న ఆటగాళ్లు తక్కువ స్కోర్‌కే పరిమితం అవ్వాలి. అప్పుడే గిల్ నంబర్ వన్ ప్లేస్‌కి వెళ్తాడు. వీరే కాకుండా రోహిత్ శర్మలాంటి వాళ్లు ఏ డబుల్ సెంచరీ బాదేసి నంబర్ ప్లేస్‌లోకి వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఎప్పుడు ఎవరు ఎలా ఆడతాడరో చెప్పలేం. అదే క్రికెట్‌లోని అసలు మజా.

## ఫుట్‌బాల్ దిగ్గజం

# సునీల్ ఛెత్రి యూటర్న్



**న్యూఢిల్లీ:** భారత ఫుట్‌బాల్ దిగ్గజం సునీల్ ఛెత్రి మళ్లీ టీమిండియా జెర్సీలోమెరవనున్నాడు. తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకుంటున్నట్లు ఈ ఫుట్‌బాల్ కింగ్ ప్రకటించాడు. ఈ విషయాన్ని ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్‌ఎఫ్) సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. 'సునీల్ ఛెత్రి జట్టులోకి తిరిగొచ్చాడు. భారత ఫుట్‌బాల్ దిగ్గజం, కెప్టెన్ సునీల్ ఛెత్రి మార్చిలో ఫిఫామ్యాచ్‌లు ఆడేందుకు సిద్ధమవుతున్నాడు అని ఏఐఎఫ్‌ఎఫ్ తమ సోషల్ మీడియా ఖాతాల్లో పేర్కొంది. కాగా 40 ఏళ్ల సునీల్ ఛెత్రి గతేడాది జూన్‌లో అంతర్జాతీయ ఫుట్‌బాల్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఇంటర్నేషనల్ కెరీర్‌కు వీడ్కోలు పలికినా, ఇండియన్ సూపర్ లీగ్‌లో కొనసాగుతున్నాడు. తాజా సీజన్‌లో అతను 12 గోల్స్ నమోదు చేశాడు. అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న9 సునీల్ ఛెత్రి ఏఐఎఫ్‌ఎఫ్ విజ్ఞప్తి మేరకు రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక 2005లో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లోకి అరంగేట్రం చేసిన సునీల్ ఛెత్రీ.. 151 మ్యాచ్‌ల్లో 94 గోల్స్ నమోదు చేశాడు.

## మహిళల ప్రీమియర్ లీగ్‌లో..

# ప్లే ఆఫ్స్‌కు చేరువైన ముంబై



**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ 2025లో ముంబై ఇండియన్స్ నాలుగో విజయాన్ని నమోదు చేసింది. గురువారం యూపీ వారియర్స్‌తో జరిగిన మ్యాచులో 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ప్లే ఆఫ్స్‌కు మరింత చేరువైంది. ఇక హ్యాట్రిక్ ఓటములు నమోదు చేసిన యూపీ వారియర్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. లక్నోలోని ఏకనా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచులో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్‌కు దిగిన యూపీ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. జార్జియా వోల్ (33 బంతుల్లో 55; 12 ఫోర్లు) డబ్ల్యూ పీఎల్లో తొలి అర్ధశతకంతో ఆకట్టుకోగా, గ్రేస్ హ్యారిస్ (28; 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ దీప్తిశర్మ (27; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. కిరణ్ నవ్గిరె (0), షినెల్ హెన్రీ (6), శ్వేత సెహ్రావత్ (0), ఉమా ఛెత్రీ (1) విఫలమయ్యారు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో అమేలియా కెర్ 38 పరుగులిచ్చి 5 వికెట్లతో అదరగొట్టగా, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ హేలీ మాథ్యూస్ (2 వికెట్లు; 68 పరుగులు) ఆల్రౌండ్ ప్రదర్శనతో మెరిపించింది. ఓపెనర్లు రాణించడంతో ఒక దశలో 7.5 ఓవర్లలో 74 పరుగులు చేసిన వారియర్స్ ఆ తర్వాత అదే జోరు కొనసాగించలేకపోయింది. అమేలియా విజృంభణతో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయ బ్రంట్ (23 బంతుల్లో 37; 7 ఫోర్లు) రాణించారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 58 బంతుల్లోనే 92 పరుగులు జోడించడంతో ముంబై సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది.

## ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో..

# భారత్‌కు తొలి ఓటమి

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ మాస్టర్స్ టీ20 లీగ్‌లో ఇండియా మాస్టర్స్ జోరుకు ఆస్ట్రేలియా మాస్టర్స్ కళ్లెం వేసింది. వడోదర వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 95 పరుగుల తేడాతో భారత్ ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 269 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఆసీస్ బ్యాటర్లలో కెప్టెన్ షేన్ వాట్సన్, స్టార్ బ్యాటర్ బెన్ డంక్ విధ్వంసకర సెంచరీలతో చెలరేగారు. భారత బౌలర్లను ఊచకోత కోశాడు. ఈ దిగ్గజ క్రికెటర్లు ఇద్దరూ రెండో వికెట్‌కు 236 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. ఇక భారత బౌలర్లలో పవన్ నేగి ఒక్కడే ఓ వికెట్ పడగొట్టాడు. మిగిలిన బౌలర్లందరూ దారుణంగా విఫలమయ్యారు. అనంతరం 270 పరుగుల భారీలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ నిర్ణీత ఓవర్లలో 174 పరుగులకు ఆలౌటైంది. భారత బ్యాటర్లలో కెప్టెన్ సచిన్ టెండూల్కర్ అద్భుతమైన హాఫ్ సెంచరీతో చెలరేగాడు. మాస్టర్ బ్లాస్టర్ క్రీజులో ఉన్నంతసేపు తన ట్రేడ్ మార్క్ షాట్లతో అభిమానులను అలరించాడు..369సచిన్ కేవలం 33 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 64 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆతర్వాత యూసఫ్ పఠాన్ 25 పరుగులు చేయగా, మిగితా బ్యాటర్లంతా పేలవ ప్రదర్శన చేశారు.

# వాణిజ్యం

# నయారా 2.59 కోట్ల షేర్ల బైబ్యాక్..

**ముంబై, మార్చి 7:** ప్రైవేట్ రంగంలోని దిగ్గజ చమురు మార్కెటింగ్ కంపెనీల్లో ఒకటైన నయారా ఎనర్జీ కీలక ప్రకటన చేసింది. తన మైనార్టీ వాటాదారుల నుంచి షేర్ల బైబ్యాక్ చేయనున్నట్లు తెలిపింది. దాదాపు 2.59 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయనున్నట్లు తెలిపింది. ఇందు కోసం ఒక్కో షేరుకు రూ.731 చొప్పున చెల్లిస్తామని ఆఫర్ ఇచ్చింది. మైనార్టీ వాటాదారులకు తమ వాటాదారులకు ఇది మంచి అవకాశంగా కంపెనీ పేర్కొంది. ఎక్కువ రేటుకు తమ వాటాను విక్రయించుకునేందుకు ఇది ఒక మంచి ఛాన్స్‌గా సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇంతకు ముందు నయారా ఎనర్జీ కంపెనీ పేరు ఎస్సార్ ఆయిల్‌గా ఉండేది. ప్రస్తుతం నయారా ఎనర్జీగా చమురు మార్కెటింగ్ రంగంలో తమ వ్యాపార విస్తరణ వేగవంతం చేసింది. ఈ కంపెనీకి దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఈ కంపెనీ షేర్లు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో ట్రేడ్ అయ్యేవి. అయితే, 2016 ఫిబ్రవరి 17వ తేదీన ఈ రెండు ఎక్స్ఛేంజీల నుంచి ఈక్విటీ షేర్లను స్వచ్ఛందంగా కంపెనీ డీలిస్ట్ చేసింది. అంటే ప్రస్తుతం నయారా ఎనర్జీ అన్‌లిస్టెడ్ కంపెనీల జాబితాలో ఉంటుంది. ప్రస్తుతం ప్రకటించిన షేర్ల బైబ్యాక్ పాలసీ మైనార్టీ వాటాదార్లు తమ వాటా విక్రయించి, కంపెనీ నుంచి బయటకు వెళ్లే అవకాశాన్ని కల్పిస్తుందని నయారా ఎనర్జీ తెలిపింది. ఇందు కోసం మొత్తం 2,59,08,262 షేర్లను తిరిగి కొనుగోలు చేస్తామని తెలిపింది. ఒక్కో షేరుకు రూ. 731 చొప్పున వెచ్చించి కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంది. 2025, మార్చి 3వ తేదీన నయారా ఎనర్జీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ షేర్ల బైబ్యాక్ కోసం కంపెనీ దాదాపు రూ.1894 కోట్ల వరకు వెచ్చించాల్సి రావచ్చని సంస్థ సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అయితే, ఈ కంపెనీ స్టాక్ మార్కెట్లలో ఉండదు. ప్రస్తుతం కంపెనీలో పెట్టుబడులు పెట్టిన మైనార్టీ షేర్ హోల్డర్ల నుంచి షేర్లు కొనుగోలు చేయనుంది.



# ఓపెన్‌ఎఐ నుంచి ఎఐ ఏజెంట్స్..

**ముంబై, మార్చి 7:** చాట్‌జిపిటి మాతృ సంస్థ ఓపెన్‌ఎఐ త్వరలో మరిన్ని ఎఐ ఏజెంట్లను తీసుకు రానుంది. ఎఐ ఏజెంట్ సేవల్ని ఇప్పటికే పరిచయం చేసిన సంస్థ, ఈ సారి కొత్త తరహా ఎఐ ఏజెంట్లను తీసుకొస్తోంది. అయితే ఇప్పటికే అందిస్తున్న సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ల మాదిరిగా కాకుండా, కంపెనీల కోసం వీటిని ప్రత్యేక ధరలో తీసుకు రావాలని చూస్తోందని తెలిసింది. నిర్దిష్టమైన విభాగంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన ఈ ఏజెంట్లను వినియోగించాలంటే ధర కాస్త ఎక్కువ వెచ్చించాల్సి ఉంటుందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఓపెన్ ఎఐ సంస్థ మూడు రకాల ఎఐ ఏజెంట్లను తీసుకురావాలని భావిస్తోంది. ఇందులో ఒక ఎఐ ఏజెంట్ సంస్థలో కీలక వ్యక్తిగా వ్యవహరిస్తుంది. సంబంధిత అంశంపై లోతైన జ్ఞానం కలిగి ఉంటుంది. విమర్శనాత్మక ఆలోచన, వ్యూహాత్మక ప్రణాళిక, సొంతంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం దీని సొంతం. ఈ ఏజెంట్ ధర నెకు రూ.1.74 లక్షలుగా ఉంటుందని తెలుస్తోంది. సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేసే మరో రకం ఎఐ ఏజెంట్ ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్నట్లు తెలిసింది. దీని ధర నెలకు రూ.8.7 లక్షలుగా ఉండనుంది. కోడింగ్, డీబగ్గింగ్, బగ్ ఫిక్సింగ్, కోడ్ డెవలప్‌మెంట్ వంటి విధులను ఈ ఏజెంట్ నిర్వర్తిస్తుంది. అయితే ఇదే సామర్థ్యంతో అమెరికాకు చెందిన టెక్ కంపెనీ కాగ్నిషన్‌కు చెందిన కృత్రిమ మేధ ఆధారంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ 'డెవిన్' సబ్‌స్క్రిప్షన్ ధర రూ.45,500 కంటే చాలా ఎక్కువ. ఇక మూడో రకం ఎఐ ఏజెంట్ పిహెచ్‌డి స్థాయి పరిశోధన చేసే సామర్థ్యంతో వస్తోంది. దీని ధర నెలకు 20వేల డాలర్లు. అంటే మన దేశ కరెన్సీ ప్రకారం అక్షరాలా రూ.17 లక్షలుగా ఉండనుందని తెలిసింది. మరో వైపు గూగుల్ తన జెమినీ డీప్ రీసెర్చ్ ఫీచర్‌ని అందిస్తోంది. ఒక అంశాన్ని పరిశీలించి సమగ్రంగా నివేదికలు రూపొందిస్తుంది. నెలకు రూ.1950 చెల్లించి జెమిని అడ్వాన్స్‌డ్ ప్లాన్‌ను వాడుతున్న వారికి ఈ సదుపాయం లభిస్తుంది.



# రూ.1,100 కోట్ల లాభం: ఓయో అంచనా

**న్యూఢిల్లీ, మార్చి 7:** రానున్న ఆర్థిక సంవత్సరం 2025-26లో రూ.1,100 కోట్ల నికర లాభం ఆర్జించగలమని ట్రావెల్ టెక్ స్టార్టప్ ఓయో అంచనా వేసింది. ఈ బాటలో రూ.2వేల కోట్ల నిర్వహణ లాభం (ఇబిటా) సాధించగలమని భావిస్తున్నట్లు యూనికార్న్ సంస్థ ఓయో వ్యవస్థాపకుడు రితేష్ అగర్వాల్ పేర్కొన్నారు. ఇందుకు ఆదాయంలో వృద్ధి దోహదపడగలదని అభిప్రాయపడ్డారు. ఇటీవల కొనుగోలు చేసిన మోటెక్ 6 తాజా అంచనాలకు దన్నుగా నిలవనున్నట్లు తెలియచేశారు. ఈ కాలంలో మోటెల్ 6 ఇబిటా రూ.630 కోట్లకు చేరగలదని ఓయో ఊహిస్తోంది. ఓయో కొనుగోలు చేశాక తొలిసా మోటెక్ 6 పూర్తి యేడాది పనితీరును వెల్లడించనుంది. వెరసి ఓయో సంయుక్త ఇబిటారూ.2వేల కోట్లను తాకనున్నట్లు సంబంధిత వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ యేడాది మూడవ త్రైమాసికంలో ఓయో రూ.166 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది ఇదే కాలంలో నమోదైన రూ.25 కోట్లతో పోలిస్తే నికర లాభం ఆరు రెట్లు పెరిగింది. వెరసి ఈ ఆర్థిక సంవత్సరం తొలి 9 నెలల్లో రూ.457 కోట్ల నికర లాభం ప్రకటించింది. గతేడాది ఇదే కాలంలో రూ.111 కోట్ల నష్టం ప్రకటించింది.





# డిబిఎస్ గ్రూప్ హోల్డింగ్స్ సిఇఓ వేతనం రూ.115 కోట్లు

**ముంబై, మార్చి 7:** డిబిఎస్ గ్రూప్ హోల్డింగ్స్ లిమిటెడ్ భారత సంతతికి చెందిన సీఈవో పియూష్ గుప్తా జీతం గత సంవత్సరం 56 శాతం పెరిగి 2024లో 17.58 మిలియన్ డాలర్లు సింగపూర్ డాలర్లకు చేరుకుంది. దీని ధర భారత కరెన్సీలో రూ.115 కోట్లు. నవంబర్ 2009 నుండి డీబీఎస్ గ్రూప్‌తో అనుబంధం కలిగి ఉన్న పియూష్ గుప్తా ఈ నెలలో తన పదవిని వీడుతున్నారు. ఆయన స్థానంలో కొత్త సీఈవోగా టాన్‌సు షాన్ నియమితులయ్యారు. 2023లో డిజిటల్ బ్యాంకింగ్ అవకతవకల కారణంగా అతని జీతం 27 శాతం తగ్గి సింగపూర్ 11.2 మిలియన్ డాలర్లకు చేరుకుంది. బ్యాంక్ రికార్డు పనితీరు కారణంగా అతని జీతం 2022లో సింగపూర్ 15.4 మిలియన్ డాలర్లు నుండి 2024లో 14 శాతం పెరుగుతుంది. అద్భుతమైన పనితీరు, సాంకేతికతలో గణనీయమైన మెరుగుదల కారణంగా బోర్డు ఈ అంచనా వేసిందని డీబీఎస్ బ్యాంక్ తన నివేదికలో తెలిపింది. 2024 సంవత్సరానికి పియూష్ గుప్తా జీతం ప్యాకేజీలో 6.6 మిలియన్ సింగపూర్ డాలర్ల నగదు బోనస్, ప్రత్యేక బహుమతిగా 2.5మిలియన్ సింగపూర్ డాలర్లు ఉన్నాయి. దీనితో అతను ప్రపంచంలోనే రెండవ అత్యధిక జీతం పొందుతున్న బ్యాంకర్ అయ్యాడు. మొదటి పేరు స్టాండర్డ్ చార్టర్డ్ సీఈవో బిల్ వింటర్స్ పేరు మీద వచ్చింది. ఆయన 2024లో 3.8 మిలియన్ డాలర్లు సంపాదించారు. గత 15 సంవత్సరాలలో డీబీఎస్ బ్యాంక్ మార్కెట్ క్యాప్ విపరీతంగా పెరిగింది. 2009లో బ్యాంక్ మార్కెట్ క్యాప్ 35 బిలియన్ సింగపూర్ డాలర్లు కాగా, 2024 నాటికి ఇది 124 బిలియన్ సింగపూర్ డాలర్లకు పెరుగుతుందని అంచనా. దీనితో ఇది 100 బిలియన్ డాలర్ల మార్కును దాటిన సింగపూర్ లిస్టెడ్ కంపెనీల జాబితాలో చేరింది. పియూష్ గుప్తా ప్రకారం.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వేగంగా మానవుల స్థానాన్ని భర్తీ చేస్తున్నందున రాబోయే మూడు సంవత్సరాలలో బ్యాంక్ 4,000 మంది కాంట్రాక్ట్, తాత్కాలిక ఉద్యోగులను తగ్గించాలని యోచిస్తోంది. 2024లో బ్యాంక్ సిఇఓ జీతం పెరగడమే కాకుండా, సీనియర్ మేనేజ్‌మెంట్ జీతం కూడా 93.8 మిలియన్ సింగపూర్ డాలర్లకు చేరుకుందని నివేదికలు చెబుతున్నాయి.



# 100 రైల్వే స్టేషన్లలో స్విగ్గీ ఫుడ్ డెలివరీ సేవలు

**న్యూఢిల్లీ, మార్చి 7:** ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ, రైళ్లలో ఆహారాన్ని అందించే సదుపాయాన్ని మరిన్ని స్టేషన్లకు విస్తరించింది. ఐఆర్‌సిటిసితో కలిసి ఇప్పటికే పలు చోట్ల ఈ సేవలు అందిస్తున్న విషయం విదితమే. తాజాగా ఆ సంఖ్యను 20 రాష్ట్రాల పరిధిలోని 100 స్టేషన్లకు విస్తరించింది. రానున్న రోజుల్లో మరిన్ని చోట్ల ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తామని ఆ కంపెనీ ఒప్రకటనలో తెలిపింది. భారర సంస్కృతిలో రైల్వే ప్రయాణం అంతర్భాగం. ప్రయాణం సౌకర్యవంతం కావడంలో ఆహారం తప్పనిసరి. ఇందులో భాగంగానే ప్రయాణికులకు ఆహారాన్ని అందించేందుకు 100 స్టేషన్లకు సేవలు విస్తరించాం అని స్విగ్గీ ఫుడ్ మార్కెట్ ప్లేస్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ మాలూ తెలిపారు. రైల్వే ప్రయాణికులకు ఆహార పదార్థాలను అందించేందుకు ఐఆర్‌సిటిసితో 2024 మార్చిలో స్విగ్గీ ఒప్పందం కుదుర్చుకుంది. తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన పాయింట్లలో ఫుడ్ డెలివరీ చేస్తోంది. మరో ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో కూడా ఇదే తరహా సేవలను రైల్వే స్టేషన్లలో అందిస్తోంది. ప్రస్తుతం ఈ రెండు ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లు కలిపి రోజుకు సుమారు లక్షలకుపైగా ఆర్డర్లు డెలివరీ చేస్తున్నట్లు అంచనా.





# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మార్చి 7:** రెండ్రోజుల వరుస లాభాల తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు మన మార్కెట్లపైనా ప్రభావం చూపాయి. దీంతో ఉదయం ఓ మోస్తరు లాభాల్లో కదలాడిన సూచీలు చివరికి పోగొట్టుకున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 3శాతం లాభపడగా, ఐటి, ప్రైవేటు బ్యాంకు స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలను పడేశాయి. మిడ్‌క్యాప్ షేర్లు స్వల్ప నష్టాల్లో ట్రేడవగా, స్మాల్‌క్యాప్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. నిఫ్టీ 22,550 పాయింట్ల ఎగువన ముగిసింది. ఇంట్రాడేలో 74,586.43 పాయింట్ల వద్ద గరిష్టానికి చేరిన సూచి, చివరికి 7.51 పాయింట్లు నష్టపోయి 74,332.58 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 7.80పాయింట్లు పెరిగి 22,552 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో విలువ 22 పైసలు పెరిగి రూ.86.90 వద్ద ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా, టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. జొమాటో, ఇండస్ ఇండ్ బ్యాంకు, ఎన్‌టిపిసి, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి.





Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.